# కథామంజరి

## పది కథల సమాహారం




### ౫వ జన్మదిన సంచిక

జూలై 2025

# కథామంజరి

## పది కథల సమాహారం



కథా మార్గదర్శి

జూలై 2025

సంపుటి : 6 ♦ సంచిక : 7



# మా జట్టు

సంపాదకుడు

జయంతి ప్రకాశ శర్మ

ప్రచురణ కర్త

అవసరాల వెంకటరావు

సంపాదక సహకారం

ఎం.ఏ. పద్మనాభరావు

కృపాకర్ పోతుల

నందూరి సుందరీ నాగమణి

ప్రచురణా సహకారం

ఎం.ఎల్. కాంతారావు

సాంకేతిక సహకారం

Harbinger Publishing

బొమ్మలు

కొయిలాడ రామ్మోహనరావు

కొచ్చెర్ల వి.ఆర్.

సూరంపూడి చలపతిరావు

# మా జట్టు పరిచయం

## ఈ సంచికలో కథకులు కాని జట్టు సభ్యులు



### శ్రీ కొచ్చెర్ల వెంకటేశ్వర రావు

కథామంజరి చిత్రకారులు. మద్రాసు టెక్నికల్ బోర్డు నుండి చిత్రలేఖనంలో హైయర్ గ్రేడ్ సర్టిఫికెట్ పొందిన చిత్రకారులు. ఎన్నో జాతీయ, అంతర్జాతీయ చిత్రకళా ప్రదర్శనల్లో పాల్గొని, బహుమతులు పొందారు. స్వాతి, ఆంధ్రభూమి వంటి పత్రికలలో కథలకు వేశారు. స్టేట్ బ్యాంక్ విశ్రాంత ఉద్యోగి. హైదరాబాద్‌లో నివాసం.



### శ్రీ పప్పు భోగారావు

కథామంజరి గళాకారులు. విశ్రాంత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతోద్యోగి. రంగస్థల ప్రదర్శనలు, ఆల్ ఇండియా రేడియో హైదరాబాద్‌లో ఉదయతరంగిణిలో ప్రసంగాలు, లోకల్ ఛానల్‌లో వార్తలు వినిపించేవారు. కథాస్రవంతి యూట్యూబ్ చానల్ ద్వారా కథలు వినిపిస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు 1750 పైచిలుకు కథలు వినిపించారు. విని నేర్చుకునే విధంగా 10వ తరగతి విద్యార్థులకు పాఠాలు రికార్డు చేసారు. అనేక ప్రశంసలూ, పురస్కారాలూ పొందారు.



### శ్రీ వెంపటి కామేశ్వర రావు

కథామంజరి గళాకారులు. అనేక సంస్థలలో, వివిధ హోదాలలో పని చేశారు. మరోవైపు ఆకాశవాణి, దూరదర్శన్‌లలో న్యూస్ రీడర్‌గా, నాటికలలో నటుడుగా, ప్రయోక్తగా, ఈటీవి, మాటీవి లలో వాయిస్ ఓవర్ ఆర్టిస్ట్‌గా సేవలు అందిస్తూ, వినిపించే కథలు అనే శీర్షిక తో స్వత యూట్యూబ్ చానెల్ లో ఇప్పటి వరకు 870 పైగా కథలు, 12 నవలలు వినిపించారు. టోరి రేడియోలో వీరి 9 నవలలు, 110 కథలు ప్రసారమయ్యాయి. పలు అవార్డులు కూడా తీసుకున్నారు. ఉష పత్రిక వారు జీవిత పురస్కారం అందచేశారు.



### శ్రీ భువనపల్లి రంగనాథం

కథామంజరి కళాకారులు. స్టేట్ బ్యాంక్ విశ్రాంత అధికారి. ఉద్యోగి, అధికారి సంఘాలలో పదవులు నిర్వహించారు. బ్యాంకు సహోద్యోగుల ప్రోత్సాహంతో అడపాదడపా స్టేజి నాటకాలు వేసేవారు. స్వతాహాగా పాటలు పాడటం హాబీ. కథామంజరికి గళం అందించడం మంచి అనుభవాన్ని ఇస్తుందని అంటున్న రంగనాథం గారి స్థిర నివాసం హైదరాబాద్‌లోనే!



### శ్రీమతి సరస్వతి కరవది

స్టేట్ బ్యాంక్ విశ్రాంత ఉద్యోగిని. సంగీతం, సాహిత్యం, అభినయం, నృత్యం, చిత్రలేఖనం రంగాలలో కృషి చేశారు. కథా రచనలో, నాటక రచనలో అనేక బహుమతులు, ప్రశంసలు పొందారు. 'సరస్వతి సమయం' ద్వారా కథలు చదివి పాఠకులకు అందిస్తారు. అనేక సాహితీ సంస్థల లోనూ, పత్రికలలోనూ బాధ్యతలు నిర్వర్తిస్తూ సాహితీ సేవ చేస్తున్నారు.


# మా జట్టు పరిచయం

## ఈ సంచికలో కథకులు కాని జట్టు సభ్యులు



### శ్రీ బి.ఎస్. మూర్తి

కథామంజరి కళాకారులు. స్టేట్ బ్యాంక్ విశ్రాంత అధికారి. చెయ్యి తిరిగిన రంగస్థల కళాకారులు. సంస్కృతం మీద మక్కువ. ప్రస్తుతం భగవద్గీత, రామాయణం మొదలైనవి అనేక వేదికలపైన, అంతర్జాలం లోనూ వినిపిస్తుంటారు. ముఖ్యంగా చిన్నపిల్లలకు వీటిని పరిచయం చేయడం మీద ఆయన ధ్యాస.



### శ్రీ సూరంపూడి చలపతిరావు

కథామంజరి చిత్రకారులు. స్టేట్ బ్యాంక్ విశ్రాంత అధికారి. కార్టూనిస్ట్‌గా అనేకమందికి పరిచయం. చిత్ర రచనలో అనేక నూతన పోకడలను ఆకళింపు చేసుకుని అనుసరించడం ఇష్టం. పుస్తకపఠనం ఇష్టమైన వ్యాపకం. ఈయన ప్రస్తుతం పిల్లల కోసం సుందరకాండ చిత్రమాలిక రచిస్తున్నారు.



### శ్రీ అవసరాల రాఘవరావు

కథామంజరి గళాకారులు. సాఫ్ట్వేర్ ఇంజనీర్. చిన్నప్పటి నుండి సంగీతం అభ్యాసం చేశారు. అనేక వేదికల మీద సంగీత ప్రదర్శనలు ఇవ్వడం, సంగీత వాయిద్యాల మీద కృషి చేయడం, టెన్నిస్ ఆడడం ఈయన హాబీ. మంచి నటుడు.



### శ్రీమతి లలితా గోవిందరాజు

కథామంజరి గళాకారిణి. న్యాయవాది. తెలంగాణా హై కోర్టు దాటితే మృదుభాషి. మంచి వ్యవహర్తగా పేరు గడించాకా, ఆ ఉద్యోగాన్ని వదిలి న్యాయస్థానానికి ఎక్కువ చేరువయ్యారు. ఎక్కువగా పుస్తకాలు చదవడం, కొంచెంగా రచించడం ఆమె హాబీ.



### శ్రీమతి నండూరి సుందరీ నాగమణి.

కథామంజరి సంపాదక బృంద సభ్యురాలు. కథా రచయిత్రిగా మంచి పేరు తెచ్చుకున్న వీరికి.. మాతృభాష మీద మిక్కిలి గౌరవం, పట్టు. భాషాపరిజ్ఞానంతో తెలుగుభాష వక్రమార్గాలు తొక్కకుండా.. తనదైన పరిధిలో భాషాసేవ అందిస్తున్నారు. వీరు ఆంధ్రాబ్యాంక్ నుండి పదవీ విరమణ తర్వాత, అనేక సాహితీ సంస్థలతో కలిసి, సాహితీ సేవ చేస్తున్నారు.

# మా జట్టు పరిచయం

## ఈ సంచికలో కథకులు కాని జట్టు సభ్యులు



### శ్రీమతి భమిడిపాటి శరత్ జ్యోత్స్న

కథామంజరి గళాకారిణి. ఆల్ ఇండియా రేడియో హైదరాబాద్ కేంద్రంలో వార్తా ప్రయోక్త, పత్రికా సమాచార కార్యాలయంలో అనువాదకురాలిగా విధులు నిర్వర్తిస్తున్నారు. కథాపఠనం అంటే తగని మక్కువ. ఈ విభాగంలో జేడిగుంట పురస్కారాన్ని గెలుచుకున్నారు. పాటల కార్యక్రమాలకు వ్యాఖ్యానం మరో ఇష్టమైన వ్యాపకం. MNC లో కాపీ ఎడిటర్‌గా, వాయిస్ ఓవర్ ఆర్టిస్ట్‌గా అనుభవం.




### శ్రీ చీమలపాటి శ్రీనివాసరావు

బ్యాంక్ ఆఫ్ ఇండియాలో అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌గా పని చేసి రిటైర్ అయ్యారు. విశాఖపట్టణంలో ఉంటారు. సాహిత్యం, నాటక రంగం, ఆధ్యాత్మికం పై ఎక్కువ మక్కువ. పుట్టుక, చదువు విద్యలనగరమైన విజయనగరం అవుట వలన జీవన గమనం, అభిరుచులపై ఆ నగర ప్రభావం. ఆన్లైన్ ద్వారా బ్యాంకింగ్ తరగతులు నిర్వహిస్తున్నారు. జగన్నాథ రథచక్రాలు, క్షీర సాగర మథనం మున్నగు నాటకానుభవంతో పాటు, శ్రీనివాసరావు చీమలపాటి యూట్యూబ్ చానెల్ ద్వారా భాగవత పఠనం రోజూ చేస్తున్నారు. కథా పఠనంపై ఎక్కువ ఆసక్తితో కథామంజరి కథలకు తమ గళం అందిస్తున్నారు.



### శ్రీమతి సమ్మెట ఉమాదేవి

కథామంజరి గళాకారిణి. విశ్రాంత ఉపాధ్యాయిని, కథా రచయిత్రి. సుమారు 150 కథలు రాశారు. బాల సాహిత్యంలో అందెవేసిన కలం. అనేక బహుమతులు, పురస్కారాలు అందుకున్నారు. వీరి కథలు.. అమ్మ కథలు, రేలపూలు, జమ్మి పూలు, సమ్మెట ఉమాదేవి కథానికలు సంపుటాలుగా విడుదలయ్యాయి. బాలసాహిత్యంలో 'మా పిల్లల ముచ్చట్లు' ఒక టీచర్ అనుభవాలు, చిలుక పలుకులు, అల్లరి కావ్య, పిల్లి మసుగు, నిజాయితీ, పిల్లల దండు, రామకృష్ణ పరమహంస జీవిత చరిత్ర.. వంటి పుస్తకాలు కూడా వచ్చాయి. హైదరాబాద్‌లో స్థిర నివాసం.



### శ్రీ ఎమ్.ఎల్. కాంతారావు

కథామంజరి ప్రచురణ బృందం సభ్యుడు. స్టేట్ బ్యాంక్‌లో ఓ పెద్ద గుమాస్తాగా పనిచేసి, విశ్రాంత జీవితం గడుపుతున్నారు. గతంలో వ్యాపకాలు చాలా ఉన్నా, అరకొరగా పుస్తకపఠనం ఒక్కటీ ఇంకా అంటిపెట్టుకుని ఉంది. కళలంటే మక్కువ. కొన్నిటిలో ప్రవేశం, కొన్నిటిలో అభినివేశం. అన్నీ విడిచిపెట్టి.. సాహిత్య, సాంస్కృతిక కార్యకలాపాల్లో నిమగ్నమైన సంస్థలకి, సమాఖ్యలకి ఇలా చేయగలిగిన సహకారం అందిస్తుంటారు. కథామంజరిని అందంగా ముస్తాబు చేయడంలో నూరు శాతం కృషి వీరిదే!



# కథామంజరి శ్రావ్యసంచిక

## ఈ నెల శ్రావ్యసంచికకి సహకారం అందించిన గళాకారులు

శ్రీ/శ్రీమతి/కుమారి

- పప్పు భోగారావు గారు
- వెంపటి కామేశ్వరరావు గారు
- భువనపల్లి రంగనాథం గారు
- కరవది సరస్వతి గారు
- బి.ఎస్. మూర్తి గారు
- అవసరాల రాఘవరావు గారు
- లలితా గోవిందరాజు గారు
- భమిడిపాటి శరత్ జ్యోత్స్న గారు
- అవసరాల వెంకటరావు గారు
- చీమలపాటి శ్రీనివాసరావు గారు
- సమ్మెట ఉమాదేవి గారు

**శ్రావ్యసంచిక కొరకు ఇక్కడ నొక్కండి**




## శీర్షికలు


| | |
|---|---|
| కథాకీయం | i |
| విశిష్ట అతిథి | ii |
| కథా మార్గదర్శి | iv |
| కథా పరిచయం | vi |
| వినదగునెవ్వరు చెప్పిన.. | ix |


## కథలు, వ్యాసాలు


| | | |
|---|---|---|
| కొరియర్ జీవితాలు | జయంతి ప్రకాశ శర్మ | 1 |
| ఎప్పుడో నాటిన విత్తు | మోచర్ల అనంత పద్మనాభరావు | 6 |
| మూడు కథలూ... ముక్తాయింపూ!!! | కృపాకర్ పోతుల | 12 |
| అతి సర్వత్ర వర్జయేత్ | కోయిలాడ రామ్మోహనరావు | 19 |
| మహానటి | నండూరి సుందరీ నాగమణి | 26 |
| అడవి | అవసరాల వెంకటరావు | 34 |
| రాణి | సూరంపూడి | 40 |
| సంకల్పం | సరస్వతి కరవది | 43 |
| కటికోళ్ల పిల్లాడు | వేంపల్లె షరీఫ్ | 47 |
| గుర్రపు డెక్క | కాశీభట్ల వేణుగోపాల్ | 55 |

# కథాకీయం



ఈ తరం తెలుగుకథని, వచ్చే తరానికి అందించాలనీ, యువతకి కథారచనలో ప్రోత్సాహం ఇవ్వాలనే ఆశయాలతో కథామంజరిని ప్రారంభించి.. అప్పుడే ఐదు సంవత్సరాలు గడిచి, ఆరో సంవత్సరంలోకి అడుగుపెడుతున్నాం! అంటే అక్షరాభ్యాసం అయిందన్నమాట! కొన్ని విషయాల్లో సంతృప్తి, కొన్ని విషయాల్లో అతికొద్ది శాతంలోనే అసంతృప్తి మిగిలాయి. సహజం కూడా.. మానవ జీవితాల్లో కూడా అంతే కదా! అయితే అసంతృప్తిని పక్కకు పెట్టి.. గీతలో చెప్పినట్టు, మా పని మేం చిత్తశుద్ధితో చేసుకుని, ముందుకు నడుస్తున్నాం!

మా పరిధి, తాహతులను దృష్టిలో పెట్టుకుని, 2020 జులై ఒకటో తారీఖున మొదటి అడుగు వేస్తున్నప్పుడు.. కథామంజరిని మహా అయితే ఓ ఏడాది నడపగలం అని అనుకున్నాం. సమయపాలనంలో సాధ్యమైనంత వరకు రాజీపడకూడదనుకున్నాం! నాణ్యమైన కథలనే ఎంపిక చేయాలనీ, తెలుగుకథ స్థానం పెంచగలిగే కథలనే ప్రచురించాలనీ అనుకున్నాం! ఈ తరంవారి చేత కథారచనలు చేయించాలనే మరో గట్టి ఆశయం కూడా మా మొదటి అడుగులో ఉన్నదే! నాలుగు సంవత్సరాల పయనం తర్వాత కథామంజరి ఏం సాధించిందనే విషయం.. మీకే వదిలేస్తున్నాం!

ముఖ్యంగా మా దృష్టిలో ప్రయోజనాలు చాలానే ఉన్నాయి. వాటిలో.. ఎన్నో కొత్త కొత్త విషయాలు తెలుసుకోగలిగాం! ఎందరో పెద్దవారితో పరిచయాలు ఏర్పడ్డాయి! మరెందరో పెద్దవారి గురించి తెలుసుకోగలిగాం! ఎన్నో వందల కథలు చదివే భాగ్యం కలిగింది. ఎన్నో ప్రయోగాలు చేయడానికి అవకాశం వచ్చింది. పత్రిక నడపడంలో ఎదురొచ్చే కష్టనష్టాలను ఎదుర్కొని ముందుకు నడవగలిగే సామర్థ్యం వచ్చింది. మాతో పాటు స్వచ్ఛందంగా అడుగులు వేసే.. మిత్రులను పొందగలిగాం! ఒక తాటి మీద నడవగలిగే నడతతో ముందుకు నడవగలిగే ఎంతో శక్తిని సంపాదించాం! వీటితో పాటు కథామంజరితో ఓ భావోద్వేగ అనుబంధం ఏర్పడింది. ఇలా ఎన్నో..

వీటితో పాటు మా పయనంలో మేం పట్టించుకోని విషయాలు కూడా ఉన్నాయి. పత్రికకు ఎన్ని లైకులు వచ్చాయో, ఎన్ని చప్పట్లు వచ్చాయో, ఎంతమంది చదువుతున్నారో, ఎంతమంది చందాలు పంపుతున్నారో.. వంటి విషయాల మీద ఆసక్తి లేదు. కారణం.. కథా సాహిత్యం మీద మక్కువ ఉన్న పాఠకుల హృదయాలలో కథామంజరి ఉంటుందనే నమ్మకం మాకు ఉంది.

యువతలో కథారచనను ప్రోత్సహించాలనీ, తెలుగు కథని ముందుకు తీసుకువెళ్ళాలనే ఆలోచనలు, ఆ బాట పట్టడమే.. మా ముందున్న లక్ష్యం!

గడిచిన ఐదు సంవత్సరాలు.. మా వెన్నంటి ప్రోత్సహించిన పాఠకులకు, రచయితలకు, చందాదారులకు, దాతలకు మా ధన్యవాదాలు తెలుపుకుంటూ.. భవిష్యత్తులో కూడా ఇదే సహకారాలు అందించాలని ఆశిస్తున్నాం.

**సంపాదకుడు**



# విశిష్ట అతిథి

**డా. వేంపల్లె షరీఫ్**

ఈ తరంవారికి భావోద్వేగాలు లేవు. బాధ్యత లేదు, భాష మీద అభిమానం లేదు.. అని రకరకాల అభిప్రాయాలు వింటుంటాం! ఈ మాటలు సరే.. కాని వారి దారి మళ్ళించి బాధ్యతలు తెలియచేయడానికి, భాషా సాహిత్యాల మీద దృష్టి మరల్చి వారి ఆలోచనల్ని అక్షర రూపంలో పెట్టించడానికి మనం ఏం చేయ్యాలి అనే విషయాన్ని అతి తక్కువ మందే ఆలోచించి, ఆ దిశలో పని చేస్తున్నారు! అసలు వాళ్ళ ఆలోచనలేమిటి, వారు ఏం రాస్తున్నారు, వాళ్ళ భాష ఎలా వుంది, భావం ఎలా వ్యక్త పరుస్తారనే అనే ఎన్నో విషయాల గురించి ఆలోచించి, ఓ సంకల్పంతో ముందడుగు వేసి, ఏడాది పాటు కృషి చేసి 40 సంవత్సరాల లోపు వయసు ఉన్న రచయితల కథలతో 2022 సంవత్సరంలో “యువ” అనే శీర్షికతో, నలభై ఉత్తమ కథలతో ఓ సంకలనం తీసుకొచ్చి.. ఓ నూతన ఉద్యమానికి శ్రీకారం చుట్టినవారు కూడా యువ రచయితే.. ఆయనే శ్రీ వేంపల్లె షరీఫ్‌గారు! తెలుగు భాష, తెలుగు సాహిత్యాలను అటు యువత, ఇటు ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్న తరుణంలో, షరీఫ్‌గారు చేసిన ప్రయత్నం సామాన్య విషయం కాదు! ఈ ప్రయత్నం వెనుక షరీఫ్‌గారికి తెలుగు కథ మీద మమకారం కనబడుతుంది. ఈ తరం కథకులను ప్రోత్సహించి, ఈ తరం కథలను నిక్షిప్తం చేయలనే తపన కనబడుతుంది. వారు వేసిన బాటలో ఆ కథల రచయితలు ప్రతి ఒక్కరూ నడిచి, మరింత మంది యువతను ఆ బాటలో నడిపించే బాధ్యత చేపడితే, తెలుగు కథ అలా చిరంజీవిగానే ఉంటుందనడంలో సందేహం లేదు!

ఓ పేద కుటుంబంలో జన్మించి, నిమ్మకాయల వ్యాపారం చేసే.. అక్షరంతో పరిచయం లేని తండ్రితో సమాజాన్ని చూస్తూ.. పందొమ్మిదవ ఏట బాల కథ, ఇరవై మూడో ఏట పెద్ద కథతో సాహిత్యరంగంలోకి అడుగుపెట్టి, ముప్పై రెండో ఏట కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం అందుకోవడం.. ఇవి చాలు అతి సామాన్యుడుగా కనిపించే షరీఫ్‌గారి అసమాన సాహితీ ప్రతిభ గురించి చెప్పడానికి! షరీఫ్‌గారు చిన్నతనం నుండే తన చుట్టూ ఉన్న సమాజం, సాంప్రదాయాలు, నమ్మకాలు, ఆచారాలు, సామాజిక పరిస్థితులు, అతి సున్నితమైన మరెన్నో విషయాలను.. చూసి చలించి, వాటిలో ఉన్న మంచి చెడులను నిర్భయంగా నిజాయితీగా కలం ద్వారా ఝులిపించి ‘కథ’నరంగంలోకి అడుగుపెట్టారు.

ప్రముఖ తెలుగు సాహితీవేత్త శ్రీ కేతు విశ్వనాథరెడ్డి గారు షరీఫ్‌గారి “జుమ్మా” కథలకు ముందుమాట వ్రాస్తూ.. ‘తెలుగు జీవితాలు, భారతీయ సమాజంలోని గ్రామీణ పేద ముస్లింల జీవితాలు, పిల్లలు, యువతీ యువకులు, తల్లిదండ్రులు, నాన్నమ్మలు, అమ్మమ్మలు, వీరందరి అస్తిత్వ వేదనలు, ఘర్షణలు, ఆకాంక్షలు, విఫల మనోరథాలను, భౌతిక మానసిక జీవితాల సంఘర్షణలు.. షరీఫ్‌గారి కథల్లో కనబడతాయి. రైతు కష్టాలు, మతపరమైన కట్టుబాట్లు, స్త్రీల అగచాట్లు.. నిర్భయంగా కథల్లో చోటు చేసుకుంటాయి...’ అంటూ ప్రశంసలు కురిపించారు. షరీఫ్‌గారి కథల్లో చక్కటి శైలి, ‘శిల్పం,

కథనం, ఎత్తుగడ, ముగింపు, వాక్య నిర్మాణం.. పాఠకుడ్ని రంజింపచేస్తాయి. పర్దా, ఆకుపచ్చ ముగ్గు, దస్తగిరి చెట్టు, పలక–పండగ, రూపాయి కోడిపిల్ల.. ఒకటేమిటి ఏ కథ చదివినా, పాఠకుడు చలించిపోతాడు! కథని పాఠకుడికి అందించే ముందు.. ఎన్నిసార్లు చదివి, ఎన్నిసార్లు మెరుగులు దిద్దుతారో గానీ, ఆయన వ్రాసిన కథల్లో వేరేగా ఆణిముత్యాలు ఏరుకునే పనుండదు, ఎందుకంటే అన్నీ ఆణిముత్యాలే! వీరి కథల్లో ప్రతీ కథాంశం, కథనం.. సమాజానికి ఓ సందేశం, ఓ హెచ్చరిక, పచ్చి నిజాలను అందిస్తాయి. రాయలసీమ మాండలికాన్ని వజ్రాల్లా పొదిగి.. కథలకి జీవం పోస్తారు. మన దేశంలో మత సామరస్యాన్ని కాపాడటానికి, షరీఫ్‌గారి కథలు ఎంతో దోహదపడతాయని చెప్పడానికి సాహసించక్కర్లేదు. వీరి కథ “ఆకుపచ్చ ముగ్గు”, 2024లో డిగ్రీలో పాఠ్యాంశంగా చేర్చడమే నిదర్శనం అని చెప్పాలి! మాతృభూమి మీద ఉన్న అపారమైన గౌరవంతో తన పేరుకి ముందు ఆ ఊరు పేరు పెట్టుకుని, వేంపల్లె షరీఫ్‌గానే గుర్తింపు తెచ్చుకున్నారు.

ఆరంభం ఆసక్తి కలిగించేలా.. ముగింపు ఆలోచనల్లో దింపేలా కథలు వ్రాయాలనే షరీఫ్‌గారి సాహితీ ప్రస్థానం.. చిన్నతనం నుండి పుస్తకాలు చదువుతూ, చూట్టూ ఉన్న సమాజాన్ని చూస్తుంటే.. కథలు వ్రాయాలనే ఓ బలమైన కోరిక కలిగి ఇంటర్మీడియట్ చదువుతున్నప్పుడే వ్రాయడం మొదలెట్టారు. ఓ వైపు చదువుతూ, జర్నలిస్ట్‌గా పనిచేస్తూ, అటు జీవితంలోనూ, ఇటు సాహితీ సౌధంలోనూ ఒకొక్క మెట్టూ ఎక్కారు! అలా ఇరవై నాలుగు సంవత్సరాలుగా తెలుగు సాహితీరంగంలో ప్రత్యేకతను సంపాదించుకున్న శ్రీ షేక్ మహమ్మద్ షరీఫ్‌గారు.. కడప జిల్లా వేంపల్లె గ్రామంలో 1980 సంవత్సరంలో జన్మించారు. ఎమ్.ఏ. తెలుగు చదివి, జర్నలిజంలో పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్శిటీ, హైదరాబాదు నుంచి పి.హెచ్.డి. అందుకున్నారు. జర్నలిస్టుగా, సంపాదకుడుగా, ప్రభుత్వ మీడియా కో ఆర్డినేటర్‌గా, రేడియో క్యాజువల్ అనౌన్సర్‌గా, ప్రోగ్రామ్ ప్రొడ్యూసర్‌గా.. వివిధ శాఖల్లో అనుభవం సాధించారు. జుమ్మా, టోపి జబ్బార్, తియ్యని చదువు, తలుపు, ఆకుపచ్చ ముగ్గు, చారల పిల్లి.. వీరి కథలతో సంకనాలుగా విడుదలయ్యాయి. యువ, కథామీనార్, చోంగారోటి.. వీరి సంపాదకత్వంలో కథా సంపుటాలుగా వచ్చాయి. 2012లో కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారంతో పాటు మరో పదిహేను సాహితీ పురస్కారాలు అందుకున్న షరీఫ్‌గారి కొన్ని కథలు ఇతర భాషల్లోకి అనువదించబడ్డాయి. వీరి కథల మీద యూనివర్సిటీ విద్యార్థులు పరిశోధనలు చేసి పి.హెచ్.డి లు సాధించారు. ఇలా ఎన్నో ప్రత్యేకతలు ఉన్న యువ రచయిత డా. వేంపల్లె షరీప్‌గారు... ఈ జన్మదిన సంచిక విశిష్ట అతిథిగా విచ్చేయడం కథామంజరి కి ఓ ప్రత్యేకత చేకూర్చింది. వారికి మా ధన్యవాదాలు తెలుపుకుంటూ.. వారు ఈ తరం యువత చేత కలం పట్టించి, కథా రచనల వైపు నడిపిస్తూ, తెలుగు కథకి ఊపిరులు అందిస్తున్నందుకు అభినందిస్తూ.. వారి బాటలో కథామంజరి సహాయం తప్పక ఉంటుందని తెలియచేసుకుంటున్నాం!

**కథామంజరి బృందం**



# కథా మార్గదర్శి

**కీ.శే. కాశీభట్ల వేణుగోపాల్**

వైవిధ్యమైన జీవనశైలిలో నుంచే వినూత్నంగా ఆలోచనలు పుట్టడం కొందరిలో చూస్తూ ఉంటాం. అలాంటి వారు సాహిత్యరంగంలో అడుగు పెడితే.. వారి సాహిత్యానికి కూడా ఓ ప్రత్యేకత ఉంటుంది. చదువుతుంటే.. ఇది ఫలానా వారిదని చెప్పగలిగే విధంగా ఉంటుంది. అలాంటి రచయితలు అతి కొద్దిమందిలో, తనకంటూ ఓ ప్రత్యేకమైన పేరు సంపాదించుకున్న సాహితీవేత్త కీ.శే. కాశీభట్ల వేణుగోపాల్ గారు.

తన చుట్టూ ఉన్న సమాజ కట్టుబాట్లను వ్యతిరేకించిన సరే.. సమాజానికి ఏనాడు దూరం కాలేదు. సమాజం నట్టనడుమ ఉండి.. ఆ వాదనలతోనే రచనలు చేసారు. తనదైన భిన్నమైన ఆలోనలతోనే రచనలు చేసారు గాని, ఎవరి ప్రభావం తన మీద లేదని చెప్పుకునే వేణుగోపాల్ గారి రచనలో తన నడవడిక, తన ఆలోచనా శైలి.. కనబడతాయి. కొన్ని రచనలలో ఆధునిక కల్పన కనబడినా.. అవి నిజంగా పాఠకుల్ని కలవరపెడతాయి. వారి ముందు దర్శనమిచ్చి భయపెడతాయి. అంతే కాదు.. పాఠకుడే ఆ రచనల్లో ఓ పాత్రగా మారిపోతాడు. సామాన్య పాఠకుడి మెదడును తట్టి లేపి, పరిగెత్తించగలిగేలా చేసే బాధ్యత ప్రతీ రచయిత మీద ఉందని నమ్మే వేణుగోపాల్ గారి కథలు ఓ మెట్టు పై స్థాయిలో ఉంటాయి.

కొత్త కొత్త ప్రయోగాలు చేస్తూ తన బాటని తానే నిర్మించుకున్నారు. భాష, పదశైలి, వాక్య నిర్మాణం.. చాలా వినూత్నంగా ఉంటుంది. ఆంగ్ల పదాలు అవసరమైన మేర ఉంటాయి. అందరు చేప్పే విషయమైన సరే.. వేణుగోపాల్ గారు అందరిలా కాకుండా ప్రత్యామ్నాయ రీతిలో చెప్తారు. ”ఆయన రచన్లో ఉన్న గొప్ప విలువలను తెలుసుకోడానికి సమయం పడుతుంది. అందుకు పాఠకుధు తన మెదడుని కొంత వ్యాయామం చేయించాలి” అని వేణుగోపాల్ గారి అభిమానులు అంటారు.

1954లో కర్నూలులో జన్మించిన వేణుగారి మొదటి కథ “‘రంగనాయకీ లేచిపోయిందీ” 1974 లో ఆంధ్రపత్రికలో ప్రచురింపబడింది. చాలా కవితలు, 12 నవలలు, వందకు పైగా కథలు వ్రాసిన వేణుగోపాల్ గారికి 1996 లో తానా పురస్కారం లభించింది. మొదటి నవల “నేను–చీకటి” చాలా ప్రాచుర్యం పొందింది. ఉస్మానియా కళాశాలలో చదువు పూర్తి చేసిన తరువాత.. మొదట్లో అభ్యుదయ, విప్లవ సాహిత్యాల వైపు ఆకర్షితులై అటు అడుగులు వేసినా, తర్వాత కాలంలో విశ్వసాహిత్యం చదువుతూ.. తన పంథా మార్చుకున్నారు. చిన్నప్పట్నుంచీ పుస్తకాలు చదవడం అలవాటైన వేణుగోపాల్ గారు.. తెలుగు, ఆంగ్లసాహిత్యాలని విస్తృతంగా చదివారు. “ఎక్కువుగా దేశయాటన చేసి.. ఎన్నో అనుభూతుల్ని పొంది, తద్వారా రచయిత కాగలిగానని” ఆయన చెప్పేవారు.

నేను– చీకటి, దిగంతం, తపన, మంచు పూవు, అసత్యానికి ఆవల, స్పర్శరేఖలు.. వంటి నవలలు; అస్పష్ట చిత్రం, అరణ్యజ్వాల, ఆల్ఫా టీ స్టాల్ – ఓ మానవీయ హత్య, ఒక వికృతిలో నుంచి, గోళీ సోడా– జీవితం, చావు బావురుమంది.. వంటి వీరి కథలు చాలా ప్రాచుర్యం పొందాయి. జీవితాంతం బ్రహ్మచారిగా ఉన్న కాశీభట్ల వేణుగోపాల్ గారు ఆగస్టు 19, 2024 న మరణించారు.

తెలుగు సాహితీ రంగంలో ఓ ప్రత్యేకమైన స్థానంలో నిలిచిన వేణుగోపాల్ గారికి ఘనమైన నివాళి అర్పించుకుంటున్నాం!

**కథామంజరి బృందం**

# కథా పరిచయం



## సి. రామచంద్రరావు గారి కథ "నల్ల తోలు"

సి. రామచంద్రరావు గారి కథలు అనగానే గుర్తుకొచ్చేది 'వేలుపిళ్ళై'. ఆ కథ ఆయనకు ఎంతో పేరు తెచ్చింది. ఆయన రాసిన కథలు చాలా తక్కువే. ఏడు కథల సంకలనం 'వేలుపిళ్ళై' పేరుతోనే ప్రచురించారు. ఆ తరవాత కూడా ఆయన రాసినవి చాలా తక్కువే. తనకో ప్రత్యేక గుర్తింపు కావాలని అనుకున్న రోజుల్లో రాసిన కథలని, మళ్ళీ అలాంటి గుర్తింపు అక్కరలేకపోయిందని చెప్పారొక ఇంటర్వ్యూలో! అతి తక్కువ కథలు రాసి మంచి కథకుడిగా స్థిరపడిన కొద్దిమంది రచయితల్లో రామచంద్రరావు గారిది అగ్రతాంబూలం. సుజాత వేల్పూరి గారు చేసిన ఓ ఇంటర్వ్యూలో, తను రాసిన కథలలో పాత్రలన్నీ నిజజీవితంలో చూసినవేనని చెప్పారు. అదే విషయం సంకలనం మొదటి ముద్రణకు పరిచయ వాక్యాలు రాస్తూ నండూరి రామమోహనరావు గారు 'ఈ కథావస్తువులన్నీ తనకు తెలిసిన, పరిచితమైన జీవితంలోంచి ఏరుకుని, పరిశీలించి, భావన చేసి రాసినవే. అందుచేత, వీటిలో ఒక నిజాయితీ, ఒక వాస్తవికత ఉన్నాయి' అని అంటారు. ఆయన ఒక టీ ఎస్టేట్‌కి అధికారిగా ఉండడంతో తెలుగుదేశ వాతావరణం ఆయన కథల్లో కనపడక పోవచ్చు. రామమోహనరావు గారన్నట్లు అంత మంచి కథలు తెలుగులో రాసిన ఆయన్ని తెలుగు రచయిత కాదనగలమా? కథకు నేపథ్యం ఏమైతేనేం? చిత్రీకరించిన జీవితం ముఖ్యమని నిరూపిస్తాయి ఆయన కథలన్నీ! ప్రస్తుతం పరిచయం చేస్తున్నది ఆయన రాసిన మరో కథ, 'నల్లతోలు'!

భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా బ్రిటిష్ వాళ్ళు మనదేశంలో కొన్నేళ్ళు ఉన్నారు – ముఖ్యంగా కాఫీ, టీ ఎస్టేట్లలో వ్యాపారాలు చేస్తూ! కథ ఆ కాలం నాటిది. బ్రిటిష్ హుందాతనం అనుకునే ప్రవర్తన మన భారతీయులు అనుకరించడం ఆ రోజుల్లో ఒక ప్రత్యేకత, అదే హై సొసైటీ అనుకునే వారి ప్రవర్తనకు ఒక నిర్వచనం. అలాంటి కోవలోకి చెందినవాడే పేట్‌రావ్ అనబడే ప్రతాపరావు. ఆక్స్‌ఫర్డ్‌లో చదువుకున్నవాడు. ఆరోజు పార్టీకెళ్ళాలి. 'బోయ్' అనబడే లోపరాజు నల్ల జాకెట్ బదులు తెల్ల జాకెట్ తెచ్చాడని కోపం వస్తుంది. స్నానానికి నీళ్ళ దగ్గరనుంచి బట్టల వరకు అన్నీ అమర్చే వాడని, పదిహేనేళ్ల క్రితం హంటర్ దొర రెటైర్ అయి తిరిగి ఇంగ్లండ్ వెళ్ళిపోతూ లోపరాజుని పేట్‌కి అప్పచెప్పి వెళ్ళాడు. ఇంగ్లీష్ మాట్లాడగలిగీ, విస్కీమీద మక్కువ వుండి, దొరల మెప్పు పొందగలిగిన బోయ్‌కి వెంటనే ఉద్యోగమిచ్చాడు పేట్‌రావ్. పైజమా విప్పడం దగ్గర నుంచి ప్రతి విషయంలో సాయపడే బోయ్ అంటే ఇష్టమే, కానీ అప్పుడప్పుడు కోప్పడకపోతే ఎలా? నల్ల డి. జె. (డిన్నర్ జాకెట్) ఎందుకు వేసుకోవాలో, తెల్లది ఎందుకు వేసుకోకూడదో బోయ్‌కి లెక్చర్ ఇచ్చాడు రావ్. మామూలుగా నల్ల జాకెట్ వేసుకోవాలని, ఇండియన్ పార్టీలకు కూడా పనికొస్తుందని తెల్ల జాకెట్ కూడా కుట్టించాననీ, స్వచ్ఛమైన బ్రిటిషర్ దాన్ని డి.జె. కింద జమ కట్టడని చెప్తాడు.

మిస్టర్ అండ్ మిసెస్ స్టూవర్ట్ రగ్గర్ ఫుట్‌బాల్ పోటీలో గెలిచిన క్లబ్బు జట్టుకి, ఆ రోజు సాయంత్రం క్లబ్ బ్రిడ్జి రూమ్‌లో కాక్‌టైల్ పార్టీ ఇస్తున్నారు. అతిథుల్లో తనొక్కడే ఇండియన్. అంతకంటే, ప్రస్తుతం రగ్గర్ జట్టులో ఇండియన్స్ ఎవరూ లేరు. తెల్లవాళ్లంతా కలిసి ఇండియన్లకు చోటు లేకుండా చేశారన్నారు మన దేశస్థులు. అవన్నీ చేతకాని కబుర్లంటాడు

పేట్‌రావ్. అతని ఉద్దేశ్యంలో అప్పటికీ, ఇప్పటికీ, తెల్లవాళ్లు ఇండియన్లతో మంచిగా ఉంటున్నారనే. తమకు సత్తువ లేకుండా బ్రిటిషర్లను నిందించడమెందుకంటాడు రావ్.

పేట్‌రావ్ తయారై నల్ల డి.జె. వేసుకుని క్లబ్బుకెళ్ళాడు. కోటు కాలరుకున్న బటన్ హోల్‌లో వేడి దేశంలో దొరకని కార్నేషన్ పువ్వు బదులు ఎర్ర గులాబీని పెట్టుకున్నాడు. అయితే తననుకున్నట్లుగా అందరూ నల్ల కోట్లు వేసుకుని లేరు. మిసెస్ స్టూవర్ట్ తనకు కావలసిన విస్కీ అండ్ సోడా కలిపిచ్చింది. తెలిసినవాళ్ళ కోసం చూస్తూ మాట్లాడుకుంటూన్న చిన్న చిన్న గుంపులను పరిశీలించాడు. తనకు తెలిసిన వాళ్ళు కనబడుతూనే ఉన్నారు. తనొక్కడే ఇండియన్ కావడం కొంచెం గర్వంగానే ఉంది. స్టూవర్ట్ ఇంకో గ్లాసు నింపాడు. తనకు ఆల్కహాల్ తీసుకునే లైసెన్స్ లేదని తెలుసు (ప్రొహిబిషన్ రోజులు). అయినా ఇక్కడ పట్టించుకునే వాళ్ళెవరూ? తనకు గుండె జబ్బుందని తెలుసు. డాక్టరు లైసెన్సుకు సర్టిఫికేట్ ఇవ్వనని చెప్పాడు. అయితేనేం?

భార్య రీటా అడుగుతూంటుంది.. 'తను ఈ బ్రిటిషర్లకు ఇచ్చే గిఫ్ట్‌లకు సమానంగా వాళ్ళెప్పుడైనా తిరిగి ఇచ్చారా' అని! అవును, వాళ్ళెందుకివ్వాలి? మనదేశం వచ్చేదెందుకు మరి, కొంచెం డబ్బు వెనకేసుకోవాలనేగా? తను మాత్రం ఆశించడు. ఇలాంటి పార్టీలలో అందరితో చనువుగా ఉండే భార్య రీటాతో డాన్సు చేయాలని, ఈ కుర్రకారు ఉవ్విళ్లూరుతుంటారు. తనకు గుర్తింపు ఆమె వల్లా? ఏవో ఆలోచనలు చుట్టుముట్టాయి పేట్‌రావ్‌కి!

పార్టీ మంద్ర స్థాయికి చేరుకుంటోంది. యువత అంతా గోలగా విస్కీ, బియర్లు ఎవరెక్కువ తాగగలరో పందేలు కట్టుకుని తాగుతున్నారు. ఆరోజు ఫుట్‌బాల్ పోటీలో అగ్రస్థాయి ఆటగాడైన డంకన్ హార్వీని కవ్విస్తున్నారు. అల్లరి ఎక్కువైంది. ఒకడు లేచి తామందరూ ప్రపంచ నాగరికతలో ప్రముఖస్థానం వహించిన బ్రిటిష్ యువకుల్లాగా ప్రవర్తించాలన్నాడు. అగ్రస్థానమని అందరూ కరక్ట్ చేశారు. అల్లరి తారస్థాయికి చేరుతోంది. డ్రింక్స్ మళ్ళీ ఎక్కువయ్యాయి.

ఇంతలో డంకన్ హార్వీ చూపులు పేట్‌రావ్ మీద పడ్డాయి. "ఇక్కడికి నల్లవాడెలా వచ్చాడు?" అని అరిచాడు. ఇక్కడీ హోటల్‌లో నల్లవాళ్ళకు చోటులేదు. తక్షణం వెళ్ళమని హుకుం జారీ చేశాడు. తను ఆహ్వానం మీద వచ్చానన్నాడు. తాగడానికి పెర్మిట్ ఉందా అడిగింది ఇంకో గొంతు. తనకు అక్కరలేదన్నాడు. ఈలోగా హోస్ట్ స్టూవర్ట్ గొంతెత్తి, నల్లతోలైనా పేట్‌రావ్ తన అతిథి అని, డంకన్‌కు అతన్ని పంపించే అధికారం లేదని, అక్కడున్న వారందరూ క్షమాపణ చెప్పాలనీ అరుస్తాడు. అవన్నీ తనకు అనవసరమని, పెర్మిట్ లేకుండా కాక్‌టైల్‌కి ఎలా పిలిచాడని తిరిగి ప్రశ్నిస్తాడు డంకన్.

మిసెస్ స్టూవర్ట్ జరుగుతున్నదంతా గ్రహించి మిస్టర్ స్టూవర్ట్‌ను బయటకు తీసుకుపోయింది. అన్నివిధాలా యోగ్యుడైన డంకన్ తమ కూతురికి తగిన వరుడని, అతనితో పోట్లాట పెట్టుకోవడం తగదని, వారిస్తుంది. ఇష్టం లేకపోయినా మిస్టర్ స్టూవర్ట్ ఏమీ చేయలేని పరిస్థితికి వస్తాడు. తరవాత మిసెస్ డంకన్ బ్రిడ్జి రూమ్‌లోకి వెళ్ళి జాన్ (మిస్టర్ స్టూవర్ట్) తలనెప్పి వల్ల రాలేదని, మిగిలిన విస్కీ పూర్తిచేసి, మజా చేసుకోమని చెప్తుంది. అక్కడ యువతకు ఒకటే ఆనందం.

"హి ఈజ్ ఎ జాలీ గుడ్ ఫెల్లో.... హి ఈజ్ ఎ జాలీ గుడ్ ఫెల్లో..." పాట అందరూ అందుకున్నారు. పాట కలత పెట్టింది పేట్‌రావ్‌కి. బయటకు వచ్చి కారు కోసం వెతుక్కుంటూ అనుకున్నాడు, తను ఎన్నోసార్లు పార్టీ ఇచ్చినప్పుడు ఇదే పాట విన్నాడు.. ఇవే గొంతుకలు. ఎప్పటి స్థానంలో నిలబడి ఉన్న నల్లటి విలువైన జాగ్‌వార్ కారు చిక్కని చీకట్లో సరిగా కనిపించలేదు. దానిమీద పడి చేతికి చిన్న గాయం చేసుకున్నాడు. చీకటినీ, కారు రంగునీ, ముందు సీట్లో గాఢంగా

నిద్రపోతున్న డ్రైవరునీ తిట్టుకుంటూ కార్లోకెక్కి హారన్ వాయించాడు. డ్రైవర్ తుళ్ళిపడి లేచి, సీటులో పడి నలిగి వున్న టోపీని తలకు తగిలించుకుని కారు పోనిచ్చాడు.

అదీ కథ.

భారతదేశానికి స్వాతంత్ర్యం రాకముందు, వచ్చిన తరువాత కూడా బ్రిటీష్ వాళ్ళకున్న జాత్యహంకారం తెలిసినదే. తెల్లతోలు గొప్పదని, వాళ్ళతో సహవాసం, వాళ్ళ గుర్తింపు కోసం ఆరాటపడే పేట్‌రావు లెంతమందో ఆరోజుల్లో! అలాంటివారిని దృష్టిలో పెట్టుకుని రాసిన కథ ఇది. రచయిత పేట్‌రావ్ పాత్ర ద్వారా ఆ రోజుల్లో ఉన్న సామాజిక పరిస్థితిని పాఠకుడి దృష్టికి తీసుకువచ్చారు. పైపై మెరుగులను బట్టి మన ఆలోచనలు, చేతలు మనల్ని, మన జీవితాల్ని ఎలా నడిపిస్తాయో ఈ కథ ద్వారా మనం గమనించవచ్చు. రచయిత తను టీ ఎస్టేట్ లలో జరిగే తను చూసిన యదార్ధ పరిస్థితుల్ని కథగా మలిచారనేది స్పష్టం. అంతరంగాల్లో నిక్షిప్తమైపోయిన భావాల్ని కప్పిపుచ్చుతూ, సభ్యసమాజంలో అందరూ సమానమే అనే భావన పైపొరలలో మన ప్రవర్తనను నిర్దేశిస్తూ ఉంటుంది. అయితే సేవించిన మద్యం పైమెరుగులను ఛేదించి తమ తమ నిజస్వరూపాలను బయటపెడుతుంది. మనలో అణిగి వున్న ఆలోచనలు బయటకు వచ్చినప్పుడు నాగరికత, ఆదర్శాలు ఇవేవీ ప్రవర్తనకు అడ్డురావన్నది రచయిత కథ ద్వారా స్పష్టం చేశారు.

కథలో చాలా ఇంగ్లీష్ పదాలు సునాయాసంగా దొర్లిపోతాయి. అవి కథ చదివే పాఠకుడి ఆలోచనలకు అడ్డురావు సరికదా, కథలో నేపథ్యం వల్ల చక్కగా ఇమిడిపోయాయి. కథ చెప్పిన వైనం బావుంది. పాఠకుడిని కథతో పాటు ఎలా చెయ్యి పట్టుకు తీసుకెళ్ళాలో ఎంతో ఆలోచనతో చెయ్యబడింది. పేట్‌రావ్‌కీ, అతని దగ్గర పని చేస్తున్న బోయ్‌కీ మధ్య అనుబంధం కానీ, పేట్‌రావ్ తన భార్యను తల్చుకున్నప్పుడు అతని ఆలోచనలు కానీ, పాఠకులకు ఒక సంపూర్ణ అవగాహనను ఇస్తాయి. ఇవి కావాలని చొప్పించినవే. అవి లేకుండా కథ చెప్పవచ్చు, కానీ సందర్భానికి నిండుతనం రాదు. చిక్కని చీకట్లో కనిపించని నల్లని జాగ్వార్ కారు, నల్ల జాకెట్ అన్నీ రచయిత ఎంచుకున్న ఇతివృత్తానికి సంకేతాలే!

జాత్యహంకారం అన్ని జాతుల ప్రజలలోనూ ఉంటుంది. మనందరం ఆ భావనలకు అతీతం కాదు. దానిని మనం అంగీకరించక తప్పదు. అయితే తెల్ల తోలు ప్రజలు ప్రపంచంలో చాలా దేశాల్ని ఆక్రమించి తామే మిగతా ప్రజలందరికీ నాగరికత నేర్పిన అత్యంత ఉన్నతమైన వారనే భావన, మిగిలిన వారందరిలోనూ కలిగించడమే కాదు, చాలామందిని బానిసలుగా చేసుకోవడానికి కూడా వెనుతీయలేదు.

బానిసత్వపు ఆలోచనలకు దర్పణం పట్టిన కథే ఈ ‘నల్ల తోలు’. అందరం సమానమే అని గుర్తించే మన ప్రవర్తన ఎప్పటికైనా ఈ పైపొరల్లోనే ఉండిపోకుండా, ఆ పొర దళసరితనం పెరుగుతూ, అంతరాల్లోంచి ఆ సమభావన ఎప్పటికైనా వస్తుందని ఆశ.

మంచి కథ అందించిన రామచంద్రరావు గారికి అభినందనలు.

***పరిచయ కర్త: శాయి రాచకొండ, హ్యూస్టన్***

# వినదగునెవ్వరు చెప్పిన..

ఘండికోట విశ్వనాధంగారి “వేటు” కథారచనకి అభినందనలు. శ్రామికవర్గం పోరాటపటిమ శక్తివంతమైనదిగా లేనప్పుడు, అది రాజకీయ, వ్యాపార శ్రేణుల కసాయి వేటుకి గురికాక తప్పదన్న విషాద సంఘటనని రచయిత సూటిగా, క్లుప్తంగా చెప్పేరు. కథనంలో మొదట నుంచీ తేలికైన పదాలతోనే బరువైన ఒక విషయాన్ని చెప్పేరు. ఇది ఒక మంచి కథ. “కర్ర పట్టుకుని షాపులో ప్రవేశించేం” చదివేక, వేటు, ఇటు నుంచి అటుపడినట్టు రాస్తారనుకున్నాను. కానీ ఆ వేటు వేసిన గండ్రగొడ్డలిని, పట్టుకున్నది ప్రభుత్వం కదా! రచయిత మరిన్ని మంచి కథలు రాయాలని కోరుతూ..

**వేదప్రభాస్, విశాఖపట్నం**



# కొరియర్ జీవితాలు

**జయంతి ప్రకాశ శర్మ**

✆ 9848629151

కథామంజరి సంపాదకుడు. అయ్యకోనేరు దీక్షాపరుడు. విజయనగరంలో అయ్యకోనేరు అన్ని ఊసులు మనతో పంచుకునే జనం రచయిత. కొత్త పత్రిక పెట్టడంలో కష్టాలన్నీ ఐదేళ్లు అనుభవించి, ఇప్పుడిప్పుడే పత్రిక ఎదుగుదల వైపు చూస్తున్నారు. తెలుగు కథని, కథామంజరి ని తర్వాతి తరానికి అందించాలని నడుస్తూ కూడా ఆలోచించే వ్యక్తి.

***ఇలా పలకరింపులతో మొదలై, అప్పులు అడిగే చనువు వరకు దారితీస్తాయి. ఇలాంటివాళ్ళకి అసలు చనువివ్వకూడదు... అని అనుకుంటూ... ”ఏ౦వయ్యా... మళ్ళీ నీకు కూడా బొట్టు పెట్టి చెప్పాలా? పేపరు బిల్లు, మీ అకౌంట్ నెంబరు వాట్సాప్‌లో పంపితే డబ్బులు పంపుతా కదా! నీకు శ్రమ ఉండదు, నాకు నీ గోల ఉండదు!” కోపంగా అన్నాను.***

“రిటైరయిన తర్వాత మీకు బద్ధకం మరింత పెరిగిపోయింది!” అంటూ మా ఆవిడ రోజూ నన్ను సతాయిస్తునే ఉంటుంది. ఉద్యోగంలో ఉన్నప్పుడు కూడా నాకు బద్ధకం ఉందన్న శ్లేష ఆ మాటల్లో వినబడుతుంది.

“బద్ధకం కాదు... అరవై ఏళ్ళు కష్టపడ్డాను. అంచేత రిటైర్డ్ జీవితాన్ని సుఖమయం చేసుకుని, హాయిగా ఉండాలని అనుకున్నాను. ఉంటున్నాను!” జవాబుగా నేను కూడా ఇదే మాటను నొక్కి వక్కాణిస్తుంటాను.

ఆ మాటలు వింటూనే.. “మగాళ్ల జీవితాలకి రిటైర్మెంట్లు ఉంటాయి... మా జీవితాలే... తులసినీళ్లు జారేవరకు గాడిదచాకిరి చేస్తూ ఉండాలి!” అంటూ ముక్కు చీదరించే సందర్భాలు కూడా ఉన్నాయి. (గాడిద ఎవరు?)

వెంటనే కాకపోయినా... తర్వాత తన మొహంలో కదలికలు గమనించి “మీకేం... ఇప్పుడు పొయ్యిలు లేవు, వంటావార్పులు లేవు. రోళ్ళు, రోకళ్ళు లేవు. నేలమీద చతికిలపడి వంటచేసే అవసరం లేదు. స్టవ్వులు, కుక్కర్లు, గ్రైండర్లు వచ్చిసాయి. బోల్ట్ టైము మిగిలిపోతుంది. పనిలేక చక్కెర, రక్తపోటులు వస్తే... కాళ్లకు బూట్లు వేసుకుని హాయిగా కబుర్లు చెప్పుకుంటూ, వాహ్యాళికి వెళ్తున్నారు. ఇంతకంటే ఏం కావాలి!” అంటూ, మనసులో మాటల్ని ఎటో చూస్తూ కక్కేస్తుంటాను కూడా!

మొత్తం మీద ‘మీ జీవితాలు బావున్నాయంటే.. మీ జీవితాలు బావున్నాయని...’ చిర్రుబుర్రులాడుకునే వ్యాయామం... దినచర్యలో ఓ భాగమైపోయింది.

ఈ దినచర్యలో భాగంగా... ఆ రోజు ఉదయాన్నే ఓ రౌండ్ కాఫీ, చెదురుమదురుగా మాటల తూటాల కాల్పులనంతరం పేపరు పట్టుకున్నాను.

అదేం కర్మో... మొదటి పేజీ అయిన తర్వాత పేపరు చేతిలో ఉంది గాని... ఆలోచనలు ఎటో చక్కర్లు కొడుతున్నాయి!!

డోర్‌బెల్లు వినబడేసరికి చిరాకు వేసి, తలుపు తీసాను. బిగ్ బాస్కెట్ వాడు... కూరల పేకెట్టు చేతిలో పెట్టేడు.

"ఆ తలుపుకి తగిలించిన సంచిలో వేసి వెళ్ళొచ్చుగా! బొట్టు పెట్టి, వాయనం ఇచ్చినట్లు ఇవ్వక్కర్లేదు!" వాడి వైపు చిరాగ్గా చూస్తూ అన్నాను.



ఓ నవ్వు నా మొహాన్న పడేసి వెళ్ళిపోయాడు.

అది ఇవ్వడానికి వంటింట్లోకి వెళ్ళాను.

"అంటే అన్నానని అంటారు గాని, సందు చివర రైతు బజారుకి వెళ్ళి, తాజాగా కూరలు తెచ్చుకోకుండా ఈ సంబరమేమిటో అర్థం కాదు! పైపెచ్చు... బద్ధకం పెరిగిపోయిందంటే, అంతెత్తు ఎగురుతారు! ఆ బాస్కెట్ గాడు... పుచ్చులో, మీలా ముదిరిపోయిన వాటినో... ముస్తాబు చేసి, మనలాంటి బద్ధకస్తులతో వ్యాపారం చేస్తున్నాడు!" అంటూ... నా వైపు చూస్తూ, ఓ మిసైల్ పేల్చింది మా ఆవిడ.

"సుఖపడటం మీ ఆడవాళ్ళకి చేత కాదులే!" అంటూ అక్కడ్నుంచి వచ్చిసాను.

వచ్చిసినంత మాత్రాన మాటల వర్షం ఆగిపోతుందని కాదు, ఆవిడ ముఖకవళికలు చూడక్కర్లేదు!

"అవునవునూ... నలభై ఏళ్ళగా తెగ సుఖపడిపోతున్నాను. మీ మగాళ్ళకేం అర్థమవుతాయి మా ఆడాళ్ల గానుగెద్దు జీవితాలు? ఈ వంటింటి చుట్టూనే సరిపోతాయి! పోనీ పిల్లలు సుఖ పెడతారా... అంటే అదీ లేదు! వాళ్ళ కొంపలకి వెళ్తే... వంటతో పాటు... పిల్లల పెంటకూడా ఎత్తాలి! ఇంకేం సుఖం... నా పిండాకూడు!" అంటూ, ఆరంభమయిన ఆ వర్షం... అలా పడుతునే ఉంది.

మరోసారి తలకాయ పేపరు మీద పడిసాను.

మిత్రపక్షాల మధ్య రాజుకుంటున్న వైరం!

ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నాయకుడు... ఎడమొహం పెడమొహం...

ఇజ్రాయిల్... ఇరాన్ దేశాల మధ్య భీకర పోరాటం...

నలభై సంవత్సరాల తర్వాత ఆత్మీయ కలయిక...

ఆ వార్త దగ్గరకి వచ్చేసరికి ఒక్కసారిగా నవ్వొచ్చింది.

'అదేం వేలంవెర్రో... నలభై సంవత్సరాల తర్వాత మొహం వాచిపోయినట్టు, ఓ రోజు మీటింగు అంటూ గెంతులు వేయడం, వందల్లో ఫోటోలు తియ్యడాలు, ఫేస్బుకులు... వాట్సప్‌లలో గుమ్మరించడాలు... తర్వాత ఎవరి దారిన వాళ్ళు వెళ్ళిపోవడాలు... మళ్ళీ తుపాకీగుండుకి కూడా ఎవడూ కనబడడు. ఎవరి గోల వాడిదే!' ఏంవిటో... హాయిగా ఇలా ఇంట్లో వాలుకుర్చీలో కాలుమీద కాలు వేసుకుని కూర్చుంటే ఉన్న సుఖం... ఆ జన సముద్రం మధ్య ఏం వుంటుంది!'

నా తలపులకు ఒక్కసారి తలుపులు పడ్డట్టు... మా ఆవిడ వచ్చి నా పక్క సోఫాలో కూర్చుని, కొంగుతో చేతులు తుడుచుకుని, టీవి రిమోట్ చేతిలోకి తీసుకుంటూ అంది. "అన్నట్లు మర్చిపోయా... నిన్న వాకింగ్‌లో మీ ఆఫీసులో పనిచేసేదే... చంద్రమతి కనబడింది. వాళ్ళ అబ్బాయికి సంబంధాలు చూడమని మీతో చెప్పమంది. మీ సంగతి తెలియదెమో... కొంపలో కాకుల్ని కూడా వాలనివ్వరని! ఇంక సంబంధాలేం చూస్తారు!"

“ఆ ముక్క ఆ మందమతితో చెప్పలేదా... పీడ విరుగుడయ్యేది.” అంటూ చిరాకుగా చూసాను. “రిటైర్మెంట్ తర్వాత మళ్ళీ మా ఆఫీసు వాళ్ళ మొహం చూడలేదు. నాకు రావాల్సిన పియఫ్, గ్రాడ్యూవిటీ, పెన్షన్‌లన్నీ చివరి రోజే నా చేతుల్లో పెట్టిసారు. ఇక వాళ్ళ చుట్టూ తిరిగే పనిలేదు. తెచ్చి పెట్టుకున్న పలకరింపులు పులకరింపులు అక్కర్లేదనిపించి, ఆ బంధాల్ని తెంపిసాను. వాళ్ళతోనే కాదు నా స్నేహితులతో కూడా కాంటాక్టులు తగ్గించిసాను.”

“ఆ ముక్క నే చెప్పక్కర్లేదు, వాళ్ళకీ తెలుసు! అయినా సరే... ఓ పలకరింపుగా చెప్పింది. తప్పేముంది! అన్నట్టు... కొంపలో సరుకులు నిండుకున్నాయి... మూడ్రోజులై చెప్తున్నాను!” టీవీ వైపు చూస్తూ అంది.

“అమెజాన్‌లో బుక్ చేసాగా... సాయంత్రంలోగా వస్తాయి కంగారెందుకు!” అంటూ సెల్‌ఫోన్‌లో మెసేజులు చూస్తూ కూర్చున్నానే గాని, నా ఆలోచనలు ఆ కొరియర్ తెచ్చేవాడి మీదే ఉన్నాయి.

‘వాడు సరిగ్గా నిద్ర సమయానికి... మధ్యాహ్నం రెండుగంటలకు దిగబడతాడు. బెల్ కొడతాడు. పేరు అడుగుతాడు, ఓటిపి చెప్పమంటాడు... ఇవన్నీ నాకు చిరాకు కలిగించే విషయాలు! కానీ తప్పదు!! దానికో మార్గం చూడాలి’ అనుకున్నాను.

“మీరు రిటైర్ కాకముందే బాగుండేది. ఇంచక్కా నాక్కావలసిన సామాను ఎంచుకుని, వాళ్ళతో కబుర్లు చెప్పి, బేరాలు ఆడుకుని... కొని తెచ్చేదాన్ని! వాడికో పది రూపాయలిస్తే, సరుకులు ఇంట్లో పడిసేవాడు. ఇప్పుడా భోగం లేదు! వాడెవడో వచ్చి, పేపరు వాడు పేపరు పడిసినట్టు... ఆ గుమ్మం దగ్గర పడేసి వెళ్ళిపోతాడు! లోపలకి తెచ్చుకుని, సరిగా ఉన్నాయో లేదో చూసుకోవాలి. ఏఁవిటో... ఒంటిపిల్లి రాకాసి బతుకులు!” మా ఆవిడకి టీవీ  మీద కళ్ళు ఉన్నాయి గాని, మాటల తూటాలన్నీ నా మీద పడ్డాయి.

“కాలు కదపకుండా, ఒంటికి చెమట పట్టకుండా.. అన్నీ సమకూర్చుతుంటే... ఏవొచ్చిందిట మాయదారి రోగం!” కోపంతో ఊగిపోతూ అన్నాను.

“మరదే... ఏ మాయదారి రోగం రాకుండానే, ఇంత బొట్టు పెట్టుకుని గుటుక్కుమన్నానంటే... మీకు అరగ్లాసు మంచినీళ్లు ఇవ్వడానికి కూడా ఎవరూ రారు అని చెప్తుతున్నాను! !” మా ఆవిడ మాటలు నాకర్థమయేలోగా డోరు బెల్లు వినబడితే, వెళ్ళి తలుపు తీసాను.

ఎదురుగా పేపరు బిల్లు అబ్బాయి... “సార్ నమస్కారం, బావున్నారా! పేపరు బిల్లు సార్!” అంటూ బిల్లు నా చేతిలో పెట్టాడు.

ఇలా పలకరింపులతో మొదలై, అప్పులు అడిగే చనువు వరకూ దారితీస్తాయి. ఇలాంటివాళ్ళకి అసలు చనువివ్వకూడదు... అని అనుకుంటూ, “ఏఁవయ్యా... మళ్ళీ నీకు కూడా బొట్టు పెట్టి చెప్పాలా? పేపరు బిల్లు, మీ అకౌంట్ నెంబరు వాట్సాప్‌లో పంపితే డబ్బులు పంపుతా కదా! నీకు శ్రమ ఉండదు, నాకు నీ గోల ఉండదు!” కోపంగా అన్నాను.

“అది కాదు సార్... నేను ఉదయాన్నే పేపరు వేసే సమయానికి ఎవరూ కనబడరు. ఇన్ని వందలమందికి పేపరు వేస్తున్నా, ఒక్కరి మొహం కూడా చూడలేకపోతున్నానండి. కనీసం పేపరు బిల్లు కోసం వచ్చి, మిమ్మల్ని పలుకరించడం ఆనందం ఇస్తుందండి. ‘మా పిల్లలే పలకరించడం లేదు... ఎలా ఉన్నామో కూడా అడగరు... అలాంటిది నీ పలకరింపు మాకు బలాన్ని ఇస్తున్నాది’ అంటూ ఎంతోమంది మెచ్చుకుంటుంటారండి. అందుకేనండి... ఎండైనా వానైనా వస్తుంటాను! ఈ భాగ్యం

ఒక్క మనుషులకే ఉందండి, మరే జీవరాశికి ఉండదు!" అంటూ డబ్బులు తీసుకుని వాడు వెళ్ళిపోతుంటే... ఆ మాటలు ఎక్కడో గుచ్చుకున్నాయి! ఆలోచనల్లో పడ్డాను!

మర్నాడుదయమే... ఆన్‌లైన్లో బుక్ చేసిన అర్డర్లన్నీ కాన్సిల్ చేసి, సంచి పట్టుకుని రైతుబజారుకి బయలుదేరాను.

నమ్మలేనట్టు మా ఆవిడ వీధి గుమ్మం దగ్గరే నిలబడిపోయింది!!

# ఎప్పుడో నాటిన విత్తు

మోచర్ల అనంత పద్మనాభరావు
✆ 9848607127



కథామంజరి సంపాదక సహకార బృంద సభ్యుడు. తప్పులు లేని సంచిక కోసం శ్రమించడం, ఇంకా మెరుగైన కథామంజరి కోసం ఆలోచించడం పత్రికకు సంబంధించి ఈయన ప్రవృత్తి. కథకుడిగా మంచి స్థానాన్ని పదిలపరచుకున్న రచయిత. మంచి కథలని ఆచి తూచి అందించడం ఈయన శైలి.

***"ఆ ధైర్యం, పట్టుదల, ఆత్మవిశ్వాసం ఆనాడు మీరు నాటిన విత్తులే సార్. మీరు ఆ రోజు నా కోసం తెగింపు చూపకపోయి ఉంటే, చారుమతక్క నాకు అండగా నిలబడకపోయి ఉంటే, నా జీవితం ఏమయ్యేదో తెలియదు. నా బిడ్డ భవిష్యత్తు కూడా అంధకారంలో కలిసిపోయేది. మీరు నాకు ఇచ్చిన ఈ జీవితాన్ని సార్థకం చేసుకున్న నేను ఈ సమాజానికి నా వంతుగా ఏదోకటి తిరిగి ఇవ్వాలి. అందుకే ఈ యూనిఫాం ఎంచుకున్నాను సార్"***

శ్రీమతి చారుమతిదేవి. I.A.S. జిల్లా కలెక్టర్ అండ్ మేజిస్ట్రేట్ బోర్డున్న గది తలుపును చిన్నగా తట్టి లోపలికి అడుగుపెట్టాను. పెద్ద టేబుల్ వెనుక కుర్చీలో హుందాగా కూర్చుని ఫైల్ చదువుతున్న చారుమతి నన్నుకూర్చోమంటూ సంజ్ఞ చేసింది. చారుమతి మా పెద్దమ్మ కూతురు. నా కన్నా పెద్దది.

"అక్కా! నీతో మాట్లాడాలి. ఓ కేసు విషయంలో నీ సలహా కావాలి. నువ్వు సరేనంటే సాయంత్రం నీ బంగ్లాకు వస్తాను. నాతో బాటు ఓ అమ్మాయిని తీసుకొస్తాను."

"ఏంటీ ప్రేమ వ్యవహారమా? నన్ననవసరంగా నీ వ్యక్తిగత విషయాల్లోకి లాగకు." నిష్ఠూరంలో దాచలేని ఇష్టం వినిపించింది అక్క మాటల్లో.

"అదేం లేదక్కా. ఒక ముఖ్యమైన పనికి నీ సలహా కావాలి. రమ్మంటావా వద్దా?"

"సరే! రా... ఎక్కువ సేపు నన్ను విసిగించకూడదు మరి." వార్నింగిచ్చింది.

థాంక్స్ చెప్పి వచ్చేసాను. సాయంత్రం పోలిని తీసుకుని చారుమతక్క బంగ్లాకు వెళ్లాను. తర్వాతేం జరిగింది చెప్పడానికి ముందు పోలి ఎవరు? ఎందుకు ఆమెను అక్క దగ్గరకు తీసుకెళ్ళాల్సి వచ్చింది అన్నది మీకు చెప్పాలి కదా! లేకపోతే కనెక్షన్ లేని కథ మీకర్థమవ్వదు సరికదా, నా ప్రయత్నమంతా వ్యర్థమౌతుంది. కనుక మనం కొంచెం వెనక్కి వెళ్ళాలి తప్పదు.

★★★

రాష్ట్రం సరిహద్దుల్లో ఎత్తైన కొండలు, అడవి ప్రాంతానికి అనుకునున్న ఓ గిరిజన ప్రాంతం. గలగల పారే సెలయేళ్ళు, వాగులు, వంకలు ఆ ప్రాంతానికి సహజమైన ప్రశాంతతను, అందాన్ని సమకూర్చుతున్నాయి. శీతాకాలం ఉదయం పదిగంటలు. ఇంకా కొంచెం చలిగా ఉంది. ఆ చుట్టుపక్కల చెల్లాచెదురుగానున్న పది గూడాలకి ఓ పోలీసు స్టేషన్. అందులో నేనో ఎస్సైని. ఆక్కడి ప్రజలను కాపాడాలన్నా, రాపాడించాలన్న మా పోలీసు స్టేషనే వాళ్లకి దిక్కు.



వారం క్రితం మద్దిగూడెం గ్రామంలో ఏదో నేరం జరిగిందనే సమాచారం తెలిసి, నేను, కానిస్టేబుల్ కరీమ్ జీప్ మీద వెళ్లాం. కర్రలతో కట్టి, తాటాకులతో కప్పిన మట్టిళ్ళు. వాటికి కాస్త దూరంలో ఖాళీప్రదేశంలో ఓ మద్దిచెట్టు, దాని నీడలో నులకమంచం మీద చుట్ట తాగుతూ కూర్చున్న ఓ గుబురుమీసాల పెద్దమనిషి. మంచానికి ఎదురుగా కింద కూర్చున్న గూడెం జనాలు, దూరంగా నిల్చునున్న మరి కొంతమంది... అంటే అక్కడ కులపెద్దల పంచాయితీ జరుగుతోందని తెలుస్తోంది. వాళ్ళందరి ఎదురుగా ఎండలో తలొంచుకుని పదిహేను పదహారు ఏళ్ళున్న ఓ పిల్ల నిలబడుంది. వంటికి చాలీచాలని బట్టలు, నడుంకి బిగించి కట్టుకున్న తువ్వాలు, చలిగాలి తగలకుండా చెవుల మీంచి స్కార్ఫ్‌లా కట్టుకున్న గుడ్డ. ఆ పక్కన నేలమీద నిద్రోతున్న ఓ పసిగుడ్డు. బహుశా బాలింతరాలై ఉంటుంది. మమ్మల్ని చూసి అందరూ ముందు ఆశ్చర్యపోయినా, ఆతర్వాత మీకిక్కడ పనేంటన్నట్టు చూసి మౌనంగా ఉండిపోయారు.

"ఏంటి పెద్దాయనా! ఏం జరిగింది?" పోలీసు దర్పం ప్రదర్శిస్తూ నులకమంచంపై కూర్చున్నాను.

"ఏం జరిగింది? ఏం జరగలా!" అమాయకంగా అన్నాడు.

"ఏం జరగకపోతే ఏంటా పంచాయితీ? ఏయ్ పిల్లా ఇట్లరా." ఆ పిల్ల రాలేదు. అసలు తలెత్తి చూడనేలేదు. మొదటిసారిగా నాలో పోలీసు అహం బుసలు కొట్టింది. గిరిజన గ్రామాల్లో ప్రజల కట్టుబాట్లు, నియమాలు వారివారి కులం శాసిస్తుందన్నది కాదనలేని నిజం. ప్రభుత్వం రూపొందించిన చట్టాలు, కోర్టులు, అవి చెప్పే న్యాయాలతో వీళ్ళకి పనిలేదు. కులపెద్దల మాటే చట్టం, వాళ్ళ పంచాయితీలో చెప్పిందే న్యాయం. అన్నీ కులాచార ప్రకారమే జరుగుతాయి. కులపెద్దలు మాటే వారికి వేదం. కులం గీతను దాటితే వాళ్లకి వెలే.

నేలమీదు పడుకునున్న పసిగుడ్డు ఒక్కసారిగా కెవ్వుమంది. ఆ పసిగుడ్డును చేతిలోకి తీసుకోవాలని గబుక్కుని ఓ అడుగు ముందుకేసి ఆగిపోయిందా పిల్ల. మంచంపై నున్న ఆ పెద్దమనిషి కనుసైగతో ఆమె ఆగిపోయిందని గ్రహించాను. ఇక్కడేదో జరిగిందని నా పోలీసు బుద్ధి గ్రహించింది. బహుశా ఆ పిల్ల చేయకూడనిదేదో చేసుంటుంది. అందుకేనేమో ఆ పిల్లని జనం మధ్యలో దోషిలా నిలబెట్టారు. కాస్త దూరంగా చలిమంటల్లో ఎర్రగా కాలుతున్న ఇనప కడ్డీలు. ఆమెను వాటితో శిక్షిస్తారా? నా బుర్రలో సందేహం. ఈ గూడాల్లో నున్న ఆటవికప్రజల శిక్షలు వింతగా ఉంటాయి. ఆ పిల్ల చేసినపనికి వాతలు పెడతారా? ఔనన్నట్టుగా అక్కడ అందరూ మౌనంగా ఉన్నారు. నివురుగప్పిన నిప్పులా ఉంది గూడెం. కానీ, ఆ పిల్లని చూస్తే అంత పెద్ద తప్పు చేసిందానిలా అనిపించడం లేదు. కాని ఆమె అపాయంలో ఉందని మాత్రం నాకనిపించింది. ఆ పిల్లను కాపాడమని నా అంతరాత్మ చెప్తోంది. ఆ పిల్లను పోలీసు స్టేషన్‌కి తీసికెళ్ళి ప్రశ్నిస్తే గాని నిజం తెలీదు. కాని, గూడెం ప్రజలు ఒప్పుకోరు. ఆ పిల్లను రక్షించాలంటే నేనే ఏదొకటి చెయ్యాలి. "చూడు పెద్దాయనా! ఈ చంటిపిల్ల తల్లిని ఇట్లా విచారించడం తప్పు. ఆమె ఏదైనా నేరం చేసుంటే మాకు రిపోర్ట్ ఇవ్వాలి! అంతేకాని మీ మటుకు మీరు ఇలా విచారణ చేయడం కుదరదు. చట్టాన్ని మీ చేతుల్లోకి తీసుకోడం నేరం! నేనీ పిల్లను స్టేషన్‌కి తోల్కపోయి విచారించి కేసు పెడతా! అంతవరకూ మీరంతా గమ్మునుండండి. మా పనికి అడ్డుపడితే మిమ్మల్నందరిని కూడా తీస్కుపోతా" అని ఏ మాత్రం ఆలస్యం చెయ్యకుండా పిస్టల్ చేతిలో పట్టుకుని ఆ అమ్మాయిని, ఆ పసిగుడ్డుతో బాటు జీపెక్కించి, "కరీమ్! త్వరగా పోనీయ్!" అన్నాను.

గూడెం జనాల్ని లెక్కచేయకుండా, వాళ్ళేం చేస్తారోనని ఆలోచించకుండా పోలీసు స్టేషన్‌కి తీసుకొచ్చాను. గూడెం జనాలు స్టేషన్ పైకి దాడి చేస్తారేమోనని ఆందోళనగానే ఉంది. గంట గడిచినా అటువంటిదేం లేకపోయేసరికి కాస్త కుదుటపడి, ఆ పిల్లని ప్రశ్నించడానికి తయ్యారయ్యాను. సౌమ్యంగా మాట్లాడి పేరు తెల్సుకున్నా. ఆ పిల్ల పేరు పోలి. అక్కడేం జరిగిందో చెప్పమనేసరికి బిగుసుకు పోతోంది. నోరు విప్పడంలేదు. నాలో సహనం నశిస్తోంది.

"మీరు నెమ్మదిగా అడిగితే అదేం చెప్పదు సార్. దాని సంగతి నాకొదిలేయండి నిముషంలో నిజం కక్కిస్తా." లాఠీతో ముందుకొచ్చాడు కరీమ్.

"నువ్వుండు కరీమ్. నాకు తెల్సు ఎప్పుడేం చెయ్యాలో!" కసిరేను.

నన్నో వెర్రోడిని చూసినట్టు చూసి వెనక్కి తగ్గాడు. ఏంచెయ్యాలోనన్న ఆలోచనతో నిశ్శబ్దంగా ఉండిపోయా.

ఆ నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ, నా ఆలోచనలకు అడ్డం పడ్తూ పసిగుడ్డు ఏడుపు వినిపించింది. పోలి నాకేసి వేదనగా, అభ్యర్థనగా చూసింది. ఆమె ఎద ఎగిసి పడ్తోంది. నేను తలూపడంతో ఒక్కుదుటన లేచి పసిగుడ్డును అక్కున చేర్చుకుంది. చాలీచాలని

బట్టను గుండె చుట్టూ కప్పుకుని, బిడ్డ పాలు ఇవ్వడానికి ప్రయత్నం చేసింది. ఇంకా పాలు సరిగా తాగడం రాని ఆ పసికందు ఏడుస్తూనే ఉంది. ఆమె ప్రయత్నం ఫలించి బిడ్డ నోటికి పాలు అంది కాసేపటికి సర్దుకుంది. బిడ్డ పాలు తాగుతోంటే ఆ మాధుర్యాన్ని చవిచూస్తోంది పోలి.

నిశ్శబ్దంగా బయటికొచ్చాను. వెనకాలే వచ్చిన కరీమ్‌తో, "ఎక్కడైనా టీ దొరుకుతుందేమో చూడు" అన్నాను. కరీం ఫ్లాస్క్ తీసుకుని బయటకు వెళ్ళాడు.

ఆ గూడెంలో ఏమై ఉంటుంది? పోలి నిజంగా నేరం చేసిందా? నేనూహించిందంతా తప్పా? పోలి విషయంలో నాది ఓవరేక్షనా? కరీం వచ్చేవరకు నా బుర్రలో గందరగోళం నెలకొంది. కరీం తెచ్చిన టీ తాగి లోపలికి వెళ్లాను. కడుపు నిండుగా పాలు తాగిన పిల్ల పడుకుంది. కడుపు నింపిన మాతృత్వంతో పోలి మొహం మెరుస్తోంది. నేనడగకుండానే నోరు విప్పింది. నెమ్మదిగా ఆగిఆగి మాట్లాడుతోంది!

"మా యడవి గూడాల్లో మావోల్లంతా అనాగరికంగా ఉంటారు. నాకు సదువుకోవాలని ఆస. కాని మా అయ్యకు, మా యమ్మకు అసలిట్టం లేదు. మా గూడెంలో సదూకుంటే తప్పు. కులదేవత సాపమిస్తాదంట. మా కులపెద్ద సెప్పాడని మా అయ్య అన్నాడు. అప్పుడే మా గూడెంలో సర్కారు ఇస్కూల్ పెట్టారు. పంతులు ఎంత సెప్పినా పిల్లలు ఇస్కూలుకి ఎల్లడానికి ఈల్లేదని గూడెం పెద్ద అడ్డు సెప్పాడు. ఆ దిక్కుమాలిన సదువు... పిల్లల్ని కులానికి, కట్టుబాటలకు దూరం సేస్తుందన్న మూడనమ్మకం మావోల్లందిరిలో నింపేడు. నేను మాత్రం సదువుకోవాలనే ఆసతో మాయమ్మని, అయ్యని, సివరికి మా కులపెద్దలను ఏమార్చి, దొంగతనంగా ఇస్కూలుకి ఎల్లాను. ఎంతో కట్టపడి సదవడం, రాయిడం నేర్సుకున్న. మావోల్ల కల్లు కప్పి ఇస్కూలుకి పోతున్న ఇసయం తెలిసి మా అయ్య నాకు కర్రు కాల్సి వాతలు ఎట్టాడు. తిండి పెట్టకుండా ఇంసించాడు. ఇకా బాదలు తట్టుకొనేక, నా ఆసనొగ్గేసి ఇస్కూలుకెల్లడం మానేసాను. ఒప్పుడే నే పెద్దమనిసయ్యా. నాకొప్పుడు పదమూడేల్లు. మా కులంలో వో సెడ్డాచారముంది. పెద్దమనిసి అయిన పిల్ల యడవిలోకి పోవాల. ఆ నాల్గు దినాలు అక్కడనే ఉండాల. యా యడవిలో సానా బయంగా ఉండేది కూర జంతువులూ, ఇసప్పాములుంటాయి. కాని ఆటి మూలంగా లేని బయం... యడవి జంతువు కన్నా, మా కులపెద్ద కొడుకు కూరమైన సింగడును సూసేసరికి కలిగింది. పొంకంగా, ఏపుగా పెరిగిన నన్ను ఆడు సూసాడు. బలంగా వాటేసుకుని జంతువులా మీద పడ్డాడు. నన్నట్టుకోకు, నేను బయిటున్న, నాకింకా రగతసావం అవుతోందని ఆడి కాల్లట్టుకుని బెతిమాలా. ఆడిన్లేదు. మీదబడి అత్తేసారం సేసాడు. రగతం కారుతూన్న నన్ను సూసి మా యమ్మా అయ్యలు పంచాయితీ పెట్టింసి నన్నాడికి పెల్లాంగా కట్టిబెట్టీరు. ఆ సింగడు నాకు మొగుడయ్యాడు. అడినుంసి నా కిట్టంతో నేకబోయినా పదేపదే బలాత్కారం సేసేవోడు. దాని మూలంగా నేనీ బిడ్డకి అమ్మనయ్యా. ఇక ఆడి అగాయిత్తాన్ని బరించనేక, ఆడి దాస్తీకం నున్సి రచ్చింసు కోడానికి నేనేం సేసానంటే" దుఃఖం ఆపుకోలేక పోలి బావురుమంది. మొత్తం జరిగింది కళ్ళకు కట్టినట్టు చెప్పింది. నాకు విషయం బోధపడింది.

నేననుకున్నదే నిజం. పోలి నిందితురాలు కాదు అమాయకురాలు. కులాచారానికి బలైన అభాగ్యురాలు. మూఢనమ్మకాల కట్టుబాట్లకు గురైన బాధితురాలు.

ఆత్మరక్షణ కోసం పోరాడిన పోలిపై నేరం మోపి బాలింతరాలనే కనికరం లేకుండా హింసించారు. చట్టం దృష్టిలో ఆమె నేరస్థురాలు కాదు, బాధితురాలు. నేను చెయ్యాల్సింది... నేరారోపణపై విచారణ కాదు, ఆమెకు న్యాయం! అప్పుడు నాకు

స్ఫురించింది చారుమతక్క. ఆమె ఓ స్త్రీ. ఇంకో స్త్రీ సమస్యను ఇట్టే అర్థం చేసుకోగలదు. అంతేకాదు ఈ జిల్లాకు అధికారిణి కూడా! చిన్నతనంలోనే అమ్మను పోగొట్టుకున్న నాకు ఆ లోటును తెలీకుండా చూసిన అమ్మలాంటి అక్క కూడాను. ఆమె తనధికారాన్నిఉపయోగించి పోలికి న్యాయం చేయగల ఏకైక వ్యక్తి. ఆ ఆలోచన వచ్చిందే తడవుగా ఓ పేపర్‌పై నాల్గు వాక్యాలు గిలికి, పోలి సంతకం తీసుకున్నాను. గూడెంలో నేను విచారణ చేసినట్టుగా రిపోర్ట్ తయారుచేసాను. పోలిని, పసిగుడ్డును తీసుకుని అక్క దగ్గరకు వెళ్లాను.

★★★

కాలం గాలానికి దొరకని చేపలా దూసుకుపోతోంది. పదిహేనేళ్ళు గడిచాయి. నా ఉద్యోగంలో ఎదుగుదలొచ్చింది. ఓ జిల్లాకు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసుగా ఇవాళే నేను రిపోర్ట్ అవ్వాలి. నా ఆఫీసు చేరాను. డిపార్ట్‌మెంట్‌లో కొద్దో, గొప్పో మంచి పేరే తెచ్చుకున్నాను. నా గురించి ముందే తెలుసుకున్న నా క్రింది అధికారులందరూ ఘనంగానే స్వాగతం పలికారు. వారిని పరిచయం చేసుకుంటూంటే నన్ను విస్మయపరచే సంఘటన జరిగింది. ఒక లేడీ కానిస్టేబుల్ గభాల్న వచ్చి నాకు పాదాభివందనం చేసేసరికి విస్తుపోయాను.

ఆమెను చూసి, “తప్పమ్మా, మన డిపార్ట్‌మెంట్‌లో అలా చేయకూడదు. సెల్యూట్ మాత్రమే చేయాలి. ఇంకెప్పుడూ అలా చెయ్యకు” అంటూంటే... “నాకో జీవితాన్నిచ్చి, నాలో ఆత్మస్థైర్యాన్ని నింపిన దేవుని కాళ్ళకు మొక్కడం తప్పు కాదు సార్.” అని తన టోపీ తీసింది.

ఆమెను చూసి ఆశ్చర్యపోయాను.

“సార్! మీరు గుర్తుపట్టారా?” ఆమె కళ్ళల్లో కృతజ్ఞత, ఆత్మవిశ్వాసం తొణికిసలాడాయి.

నా కళ్ళ ముందు గతం కదిలింది. పోలిని, తన పసిగుడ్డుని... చారుమతి అక్క బంగ్లాకు తీసుకెళ్ళిన క్షణాలు, అక్క ఇచ్చిన అభయం, తన అధికారంతో పోలికి న్యాయం చేసిన తీరు... జరిగినదంతా నా కళ్ళముందు కదలాడింది. అక్క నాతో అన్న మాటలు మళ్ళీ మళ్ళీ వినిపించాయి.

“అసలీ అమ్మాయి ఏంచేసింది? ఎందుకు నువ్వామెను కాపాడాలనుకుంటున్నావు?” చారుమతి అక్క ప్రశ్నించింది.

“పోలి చదువుకోసం, స్వేచ్ఛ కోసం, కులం పేరుతో విధించిన కట్టుబాట్లపైన, పోరాటం చేసిన ఒంటరి ఆడపిల్ల. పచ్చిబాలింతరాలైనప్పటికీ కనికరంలేని మొగుడు పదేపదే అత్యాచారం చేస్తుంటే సహించలేక అతని పురుషహంకారాన్ని ఒక్క కొడవలి దెబ్బతో నరికేసింది. ఆ మగాడిని మగతనంలేని వాడిగా చేసింది. ‘మొగుడైనంత మాత్రాన నన్ను బలాత్కరించే హక్కు వాడికి లేదు కదా? అలాంటి నరరూప రాక్షసునికి సరైన శిక్ష అదే కదా? ఔనా, కాదా?’ అని అమాయకంగా అడిగిన అమ్మాయిని రక్షించలేకపోతే నేనెందుకు? నా పోలీసు ఉద్యోగం ఎందుకు?” అన్న నా మాటలకు అక్క కళ్ళు చెమ్మగిల్లాయి.

“ఇది నేను గూడెంలో విచారించి సేకరించిన రిపోర్టు. తనకిష్టం లేకపోయినా పెళ్ళిచేసారని, తనకి చదువుకోవాలనుందని, సహాయం చేయమని అడుగుతూ పోలి సంతకం చేసిన ఉత్తరం ఇది.” అక్కకు అందించాను.

కన్నీటితో నన్ను హత్తుకున్న అక్క చేతుల నుంచి అమ్మతనం నాలోకి ప్రవహించి నా గుండెను తడిపింది.

వెంటనే జిల్లా గిరిజన సంక్షేమాధికారిని రప్పించి, "ఈ అమ్మాయిని గిరిజన సంక్షేమ హాస్టల్‌లో చేర్పించి ఆమె చదువుకు కావాల్సిన ఏర్పాట్లు చేయండి. దానికి కావాల్సిన పేపర్లు, పర్మిషన్లు వగైరాలేమైనా ఉంటే రేపు నాకు పంపించండి. నేను అఫీషియల్‌గా చేయవలసింది చేస్తాను. ఈ పోలీస్ రిపోర్ట్, ఆ అమ్మాయి వ్రాసిన లెటరు తీసుకుని రేపు పేపర్లతో పంపండి. ఆ పసిపాపను కూడా ఆమెతో ఉండేలా అనుమతివ్వండి." అంటూ ఆర్డర్ జారీ చేసింది. పోలిని దగ్గరకు తీసుకుని, "చూడమ్మా పోలి! ఇప్పటినుంచి నీ బాధ్యత, నీ బిడ్డ బాధ్యత ప్రభుత్వం చూసుకుంటుంది. కొన్నాళ్ళవరకే నీ బిడ్డ నీ దగ్గరుంటుంది. తర్వాత ఆమెను శిశు సంరక్షణాలయానికి పంపుతాం. ఈ పోలీసాఫీసర్ చాలా రిస్క్ తీసుకుని నిన్ను నేరం నుంచి రక్షించాడు. దానికి ప్రతిగా నువ్వు బాగా చదువుకుని పైకి రావాలి."

కన్నీళ్ళ నింపుకుని మా ఇద్దరికీ నమస్కరిస్తూ భవిష్యత్తు నిర్దేశించుకోడానికి ముందుకడుగేసింది పోలి.

ఆమె బిడ్డను చారుమతి అక్క తన స్వంతఖర్చులతో మంచి స్కూల్‌లో చేర్పించి చదివించింది. ఇదంతా నాకు తెలుసు. కాని ఆ పోలి నా ముందు ఇలా నిలబడుతుందని అనుకోలేదు.

"పోలి! నిన్ను చూస్తుంటే చాలా గర్వంగా ఉంది. నువ్వు అనుకున్న జీవితాన్ని సాధించావు. నీ ధైర్యం, నీ పట్టుదల ఎందరికో ఆదర్శం." నా గొంతులో ఆనందం, భావోద్వేగం నిండిపోయాయి. "ఆ ధైర్యం, పట్టుదల, ఆత్మవిశ్వాసం ఆనాడు మీరు నాటిన విత్తులే సార్. మీరు ఆ రోజు నా కోసం తెగింపు చూపకపోయి ఉంటే, చారుమతక్క నాకు అండగా నిలబడకపోయి ఉంటే, నా జీవితం ఏమయ్యేదో తెలియదు. నా బిడ్డ భవిష్యత్తు కూడా అంధకారంలో కలిసిపోయేది. మీరు నాకు ఇచ్చిన ఈ జీవితాన్ని సార్థకం చేసుకున్న నేను ఈ సమాజానికి నా వంతుగా ఏదోకటి తిరిగి ఇవ్వాలి. అందుకే ఈ యూనిఫాం ఎంచుకున్నాను సార్." పోలి కళ్ళల్లో నీళ్ళు నిండాయి.

ఒకప్పుడు అమాయక గిరిజన బాలికగా నాకు తెల్సిన పోలి, నేడు ఆత్మవిశ్వాసం నిండిన ఒక మహిళగా, బాధ్యత నెరిగిన ఒక పోలీస్ కానిస్టేబుల్‌గా నా ముందు నిలబడటం చూసి, నేను తీసుకున్న ఆ సాహసోపేతమైన నిర్ణయం సార్థకమైందన్నతృప్తితో నా మనస్సు సంతోషంతో నిండిపోయింది.

ఎక్కడో ఎప్పుడో నాటిన ఆ విత్తు నేడు ఒక వృక్షమైన తీరు, మరింత మందికి స్ఫూర్తినిస్తుందని నాకు ఆ క్షణంలో అర్థమైంది.

# మూడు కథలూ.... ముక్తాయింపు!!!!

కృపాకర్ పోతుల
✆ 9441865262



కథామంజరి సంపాదక సహకార బృంద సభ్యుడు. నిరంతరం చదవడం ఈయన వ్యసనం. తెలుగు, ఆంగ్ల భాషా సాహిత్యాన్ని రోజువారీగా ఆస్వాదించే మంచి సాహిత్యాభిమాని. జాతీయ, అంతర్జాతీయ వేదికల మీద ఆయన కథలు స్థానాన్ని పొందాయి. కథ విశ్లేషణలో ఈయన ఘనాపాటీ.

> ***'అసలు ప్రేమించడమే తప్పంటావా? ఈ రోజుల్లో ఎవరు ప్రేమించట్లేదో చెప్పు?' అని నిలదీసేడు.***
>
> ***'ప్రవీణకు నువ్వంటే ఎంతో ప్రేమ గనుక, తన ప్రేమ విషయం చెప్పిందిగాని, అసలు చెప్పకుండా పెళ్లి చేసుకొని ఉంటే ఏంచేసేవాడివి?' అన్న లాజిక్ కూడా లాగేడు.***

**మొదటి కథ:**

నేను కావాలన్నది కాదని గాని, అడిగినది చెయ్యనని గాని నాన్న ఇంతవరకూ ఎప్పుడూ అనలేదు! నోట్లో మాట నోట్లో ఉండగానే కోరుకున్నది కంటిముందు ప్రత్యక్షమయ్యేది... డబ్బుకు లోటులేదు గనుక అది ఎంత ఖరీదైన వస్తువైనా సరే!!

అందుకే నేను ఏది అడిగినా ఆయన కాదనరన్న నమ్మకం నాలో బలంగా నాటుకుపోవడమేకాక, అందు గురించి ఎంతో గర్వంగా ఉండేది నాకు!

'ఆడపిల్ల అది... ఎల్లకాలం ఇక్కడే, మీతోనే ఉండిపోతుందని అనుకుంటున్నారేమో! ఎప్పటికైనా పరాయింటికి వెళ్ళాల్సిందే! ఆ విషయం గుర్తుపెట్టుకొని మరీ పెంచండి దాన్ని! ప్రపంచంలో మహా మీకొక్కడికే కూతురున్నట్టు...' అంటూ అమ్మ విసిరే విసుర్లు, నాన్న ఖాతరుచేసిన పాపాన పోలేదేనాడూ. అడిగింది ఏదైనా, 'ఎందుకూ' 'దేనికీ' అని ప్రశ్నించకుండా ఇచ్చారే తప్ప, ఎప్పుడూ కాదనలేదు, మొన్న... అంటే సరిగ్గా మూడురోజుల క్రితం వరకూ!!


అది కూడా మామూలుగా కాదు, చాలా కోపంగా కాదన్నారు. అంత కోపంగా నాన్న నాతో మాట్లాడడం అదే మొదటిసారి. అందుకే చాలా భయపడ్డాను. నా భయం చూసి, 'అయ్యో పాపం...' అనుకున్నారేమో, అతికష్టం మీద సంబాళించుకున్నారు.

"ఆ ఒక్కటీ మాత్రం అడగొద్దు ప్రవీ. నా ప్రాణం కంటే ఎక్కువైన నీకోసం కూడా నేనా పని చెయ్యలేను, చెయ్యను" అన్నారు

శాంతంగా మాట్లాడడానికి ప్రయత్నిస్తూ. కానీ, మాటలో వాడీ, చూపులో కోపం... వీటిని పూర్తిగా అదుపు చేసుకోవడం సాధ్యపడలేదు నాన్నకు.

చెప్పినది నవ్వుతూ విని, వెంటనే ‘ఓకే’ అనేస్తారని నేను కూడా అనుకోలేదుగాని, అంత కోపంగా రియాక్ట్ అవుతారని మాత్రం ఊహించలేదు. కొంచెం బ్రతిమలాడీ, కాసిన్ని కన్నీళ్ళు కార్చీ, అవేవీ నాన్న మనసును కరిగించకపోతే బోలెడంత కోపం నటించీ, వీటన్నింటితోపాటు రెండురోజులు తిండి తినడం, మాట్లాడడం మానేస్తే మెత్తబడిపోతారనీ, ‘ఓకే’ చెప్పేస్తారనీ అనుకున్నానుగాని, నాన్న రియాక్షన్ చూశాక, ఆ పప్పులేవీ ఉడకవని స్పష్టంగా బోధపడింది.

పోనీ అమ్మతో రికమెండ్ చెయ్యిద్దామంటే, నాకు సంబంధించిన విషయాల్లో అమ్మది మొదటినుంచీ ప్రేక్షకపాత్రే. తను దర్శించిన పుణ్యక్షేత్రాలూ, మొక్కిన మొక్కులూ, చేసిన పూజలూ... వీటి ఫలితంగానే నేను పుట్టేననీ, అందులో అమ్మ పాత్ర అతిస్వల్పమైనదనీ నాన్న బలమైన నమ్మకం.



అందువల్ల నాకు సంబంధించిన ప్రతీ విషయంలోనూ... చిన్నప్పుడు నేను తొడుక్కునే గౌను దగ్గరనుంచి, కాలేజీ చదువుకి వచ్చాక డ్రైవ్ చేసే కారు వరకూ... ఏదైనా సరే, తనకు నచ్చినదే ఉండాలన్న పట్టుదల ఉండేది నాన్నలో!

అందుకే... పాపం అమ్మ... ఎంతో అవసరం అయితే తప్ప నా విషయాల్లో జోక్యం చేసుకునేది కాదు. ఒకవేళ ఎప్పుడైనా పొరపాటున కల్పించుకున్నా అమ్మమాట చెల్లేది కాదు.

అయినా ఆశ చావక అడిగాను, ‘నాన్నతో ఒకసారి మాట్లాడతావా?’ అని. నోటితో ‘నో’ అని అనలేదు గాని, నా కళ్లలోకి అమ్మ చూసిన చూపు... ఆ పని అమ్మ చెయ్యదు... అని మాత్రమేకాక, ‘ఆవిషయంలో’ తనది కూడా పూర్తిగా నాన్న పక్షమేనని స్పష్టాతిస్పష్టంగా తెలియజేసింది.

పోనీ నాన్న మాట విని, ఆయన చెప్పినట్టు చేస్తేనో... అనిపించిందో

క్షణం! క్షణం మాత్రమే! మరుక్షణమే... 'నేనేమీ మెచ్యూరిటీ లేని పదేళ్ళ పసిపిల్లను కాదే... పాతికేళ్ళ వెల్ ఎడ్యుకేటెడ్, సెన్సిబుల్ వుమన్నే! ఏం చేస్తున్నానో పూర్తిగా తెలిసి చేస్తున్నదాన్నే! అది తప్పు కాదని త్రికరణశుద్ధిగా నమ్మినదాన్నే! అలాంటప్పుడు రాజీ పడాల్సిన అవసరం నాకేంటి?' పడగ విప్పి బుసలు కొట్టింది నాలోని అహం!

'అవన్నీ సరే కానీ, అవి సరిపోతాయి నీ సమస్య పరిష్కారమైపోడానికి?' ప్రశ్నించింది నాలోని వివేకం.

'అవును కదా! నిజమే కదా!' అనుకున్నాను ఒకింత చిరాకుగా.

సమస్యనెలా పరిష్కరించాలో బోధపడడం లేదు. ఏం చెయ్యాలో, నాన్ననెలా కన్విన్స్ చెయ్యాలో తెలియక జుట్టు పీక్కుంటుంటే కృష్ణమావయ్య గుర్తొచ్చాడు.

మావయ్య నాన్నకు అత్యంత ప్రియమైన స్నేహితుడు మాత్రమే కాదు, ఫిలాసఫర్ ఎండ్ గైడ్ కూడా. నాన్న ఎవరి మాటైనా ఎప్పుడైనా విన్నారంటే, అది కృష్ణమావయ్య మాటే! మావయ్యకి నేనంటే చాలా ఇష్టం కూడా! 'నాన్నతో మాట్లాడు మావయ్యా!' అని అడిగితే కాదనడు. తప్పకుండా మాట్లాడతాడు. నాన్న మావయ్య మాట వింటారు కూడా.

యెస్స్... కృష్ణమావయ్యే నాన్నతో మాట్లాడడానికి సరైన వ్యక్తి అనుకున్నాను రిలీఫ్‌తో! మావయ్యతో మాట్లాడడానికి మొబైల్ చేతిలోకి తీసుకున్నాను!

**రెండో కథ:**

అమరేంద్ర నా ప్రాణ స్నేహితుడు. ఆడపిల్లలు లేని నాకు, వాడి కూతురు ప్రవీణ అంటే చెప్పలేనంత ఇష్టం. మా ఆవిడకేం అది ఆరోప్రాణం. అందుకే రింగవువుతున్న మొబైల్ స్క్రీన్ మీద ప్రవీణ పేరు కనబడగానే కాల్ ఆన్సర్ చేశాను. క్లాసులో సీరియస్‌గా పాఠం చెప్తున్నా సరే!

"ఏంటమ్మా ప్రవీ ఈ టైమ్..." నామాట పూర్తి కాకుండానే, "నీతో అర్జెంటుగా మాట్లాడాలి మావయ్యా" అంది ప్రవీణ ఆదుర్దాగా.

"ఏమైందిరా బంగారం, ఈజ్ సంథింగ్ రాంగ్?" అని ఆందోళనగా అడుగుతూ క్లాస్‌రూమ్‌లో నుండి బయటకు నడిచాను.

"అవును మావయ్యా. అందుకే ఈ టైమ్‌లో ఫోన్ చేశాను" అంది ఉద్విగ్నంగా.

నాకు మాట్లాడడానికి అవకాశం ఇవ్వకుండా విషయం చెప్పడం మొదలుబెట్టింది. అరగంటసేపు గుక్క తిప్పుకోకుండా చెప్తూనే ఉంది. చెప్పడం పూర్తయ్యాక, అరనిమిషంసేపు ఆయాసం తీర్చుకొని, "ఇప్పుడు చెప్పు మావయ్యా... నేను నాన్నని కోరిన కోరిక తప్పంటావా?" ప్రశ్నించింది ఆవేశంగా.

తప్పని ఎలా అనగలను? అనే మనిషిని కూడా కాదు నేను. ఆమాటే చెప్పాను ప్రవీణతో!

"థాంక్యూ మావయ్యా, కనీసం నువ్వైనా అర్థం చేసుకున్నావు... అది చాలు నాకు! నేను చేసిన పని తప్పుకాదని నువ్వుకూడా నమ్ముతున్నావు గనుక, ఒక హెల్ప్ చేస్తావా నాకు? నాన్న ప్రపంచంలో ఎవరి మాటైనా వింటారంటే అది నీ ఒక్కడి మాటే! అందుకే, నాన్నతో ఒకసారి మాట్లాడవా, ప్లీజ్!" అడిగింది. జాలిగానో, బేలగానో మాత్రం కాదు!

'పెద్ద ఇబ్బందిలో పెట్టేశావురా తల్లీ' అనుకున్నాను మనసులో. ప్రవీణ చెప్పినది నిజమే. వాళ్ళ నాన్న నాకు మామూలు 'ఫెయిర్ వెదర్ ఫ్రెండ్' కాదు... ప్రాణస్నేహితుడు! డిగ్రీ వరకూ ఒకే బెంచీ మీద, పక్కపక్కనే కూర్చొని చదువుకున్నాం ఇద్దరం. ఆర్థికంగా చాలా అంతరం ఉన్న కుటుంబాలు మావి. వాడు బాగా డబ్బున్న ఫామిలీ నుంచి వచ్చినవాడు. మాదేమో దిగువ మధ్యతరగతి కుటుంబం! అయినా నేనంటే ఎంతో అభిమానంగా ఉండేవాడు.

అందరి కంటే తెలివైనవాడిననీ, క్లాస్ టాపర్‌ని ఎప్పుడూ నేనేననీ, అందుకే నేనంటే వాడికి వల్లమాలిన 'హీరో వర్షిప్' అనీ అనుకోవడానికి వాడు తెలివితక్కువవాడేమీ కాదు.

నలుగురికీ చెప్పుకోడానికి బాగుంటుందనీ, ఎక్కువ కట్నం గుంజడానికి పనికొస్తుందనీ... వాడి నాన్న వాడిని చదివిస్తున్నాడు తప్ప, చదవాల్సిన అవసరం లేదు వాడికి. ఉద్యోగం చెయ్యాల్సిన అవసరం అంతకంటే లేదు. చూసుకోవలసిన వ్యాపారాలూ, వ్యవహారాలూ చాలానే ఉన్నాయి.

అందుకే వాడెందుకు నన్నంతగా అభిమానిస్తున్నాడో అర్థం కావడానికి చాలా కాలమే పట్టింది నాకు.

'ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా డిగ్రీ తరవాత చదువు మానేద్దామనుకుంటున్నాన'న్న విషయం తెలిసి ఇంటికి పరిగెత్తుకుంటూ వచ్చేడు. 'కాలేజీ ఫస్టొచ్చిన వెధవ్వి, చదువు మానేస్తానంటున్నావట, బుద్ధుందా?' అని కేకలేశాడు. 'యూనివర్సిటీ ఇక్కడే, మన ఊర్లోనే ఉందన్న సంగతి గుర్తుందా?' అని ప్రశ్నించేడు. 'ఒకవేళ ఫీజులూ, పుస్తకాలూ వీటి గురించే నీ వర్రీ అయితే, డిస్టింక్షన్లో పాసైనవాడివి, నీకు స్కాలర్షిప్ వస్తున్న విషయం మరచిపోయావా?' అని నిలదీసేడు. 'ఒకవేళ ఏ కారణం చేతనైనా స్కాలర్షిప్ రాలేదనుకో... నేనున్నాను కదురా' అన్న భరోసా ఇచ్చాడు నా భుజం చుట్టూ చెయ్యివేసి!

నేను నోరు తెరిచి మాట్లాడేలోపే 'దాతృత్వమో, దయాళుత్వమో ప్రదర్శించుకోవడానికి కాదొరేయ్ కృష్ణా, అప్పుగానే ఇస్తున్నాను. నీ చదువు పూర్తై, ఉద్యోగం వచ్చాక వడ్డీతో సహా వసూలు చేసుకుంటాను.' అని కూడా చెప్పేడు నవ్వుతూ.

అంతేకాదు, యూనివర్సిటీలో నా అప్లికేషన్ వాడే సబ్మిట్ చేసి, సీటొచ్చాక, 'నాచెయ్యి మంచిదిరా క్రిష్ణా' అని చెప్పి, ఫీజు కూడా వాడిచేత్తో వాడే కట్టేడు. యూనివర్సిటీ టాపర్‌గా పీజీ పూర్తిచేసిన ఆరునెలలు తిరక్కుండానే... మేము చదువుకున్న కాలేజీలోనే లెక్చరర్ ఉద్యోగం కూడా వెయ్యించేడు. కాలేజీ కమిటీకి సెక్రటరీ వాడి నాన్నే!!

'ఎందుకు చేసావురా ఇవన్నీ?' అని ఎప్పుడో మంచి జోష్ మీద ఉన్నప్పుడు అడిగితే, 'నీకిచ్చిన అప్పు వడ్డీతో సహా వసూలు చేసుకోవద్దూ, అందుకు' అని నవ్వుతూ చెప్పి, 'అయినా, మనమే ఒకడికొకడు సాయం చేసుకోపోతే పైవాడెవడో ఎందుకు చేస్తాడ్రా మనకి?' అని తిరిగి నన్నే ప్రశ్నించేడు!

కాకపోతే, వెనక్కి తిరిగి చూసుకుంటే, ఇంతవరకూ వాడికి నేను చేసిన ఉపకారం ఒక్కటి కూడా లేదు. అన్నీ వాడు నాకు చేసినవే! నన్ను అంతగా ప్రేమించే స్నేహితుడు అమర్. అయినా సరే, ప్రవీణ చెప్పిన విషయంలో వాడ్ని కన్విన్స్ చెయ్యగలనన్న నమ్మకం కొంచెమైనా కలగలేదు నాకు. ఎందుకంటే, నలభై ఏళ్ల స్నేహంలో అమరేంద్ర ఎలాంటివాడో, వాడి బలాలేంటో, బలహీనతలేంటో, వాడి నమ్మకాలూ, సిద్ధాంతాలూ... అవేంటో నాకు తెలిసినంతగా మరెవరికీ తెలియవు గనుక!

అయినా ప్రవీణకు మాటిచ్చాను గనుక, నా ప్రయత్నం చిత్తశుద్ధితో నిర్వర్తించాల్సిందే. అందులో ఎటువంటి లోపమూ ఉండడానికి వీల్లేదు. అందుకనే అమరేంద్రకు ఫోన్ చేసి, 'మాట్లాడాల్సిన పనుందనీ, సాయంత్రం కాలేజీ అయిపోయాక వచ్చి కలుస్తాననీ' చెప్పి, ఎందుకు, ఏమిటి అని వాడు అడిగేలోపే ఫోన్ కట్ చేశాను.

**మూడో కథ:**

ప్రవీణ మా ఏకైక సంతానం. రెండు ఎబార్షన్స్ జరిగి, ఒక బిడ్డ పుట్టి పోయాక, ఈ జన్మకి పిల్లలు పుట్టే యోగం లేదేమోనన్న నిరాశా నిస్పృహల్లో మునిగి తేలుతున్న సమయంలో, దర్శించిన పుణ్యక్షేత్రాలూ, చేసిన పూజలూ ఫలించి, పుట్టిన ఒక్కగానొక్క బిడ్డ! ప్రాణం కంటే ఎక్కువగా పెంచుకున్నాను దాన్ని. కోరినదేదీ ఎప్పుడూ కాదనలేదు. అడిగినది ఇవ్వనని ఏనాడూ చెప్పలేదు. ఐ ఆల్వేజ్ గేవ్ హెర్ ద బెస్ట్.

ప్రవీణ చాలా తెలివైనది. ఐఐటీ చెన్నైలో ఇంజనీరింగ్ చేసింది. అదయ్యాక ఎం.బి.ఏ. చేసి, వ్యాపారాల్లో నాకు చేదోడువాదోడుగా ఉంటుందనుకున్నాను. తను కూడా చేస్తాననే అంది కాని, అమెరికాలో చేస్తే బాగుంటుందనీ, జాబ్ ఎక్స్పీరియెన్స్ ఉంటే 'హార్వర్డ్', 'వార్టన్' వంటి 'ఐవీ లీగ్ స్కూల్స్'లో సీటొచ్చే ఛాన్సెస్ ఎక్కువనీ, అందుకని రెండేళ్ళు జాబ్ చేసి, ఆ తరవాత చేస్తాననీ చెప్పింది. అది కూడా బాగానే ఉంది కదా అనుకున్నాను. 'ఓకే అమ్మా, ఏజ్యూ విష్' అన్నాను హుషారుగా. అంటున్నప్పుడు తెలియలేదు ఆ 'ఏజ్ యూ విష్' ఎక్కడికి దారితీస్తుందో!

ఇక్కడ నాగురించి కొంత చెప్పుకోవాలి. ఆస్తులూ, పలుకుబడీ, మందీమార్బలం ఉన్న పెద్ద వ్యాపార కుటుంబం మాది. రాజకీయాల్లో ఆసక్తిలేక అటు దృష్టి సారించలేదు గాని, ఒకవేళ సారించి ఉంటే ఎమ్మెల్యేనో, ఎంపీనో అయ్యేవాణ్ని కచ్చితంగా! మినిస్టర్ని కూడా అయ్యేవాణ్నేమో!

నాకు పెద్ద పెద్దవాళ్ళు చాలామందితో పరిచయాలున్నాయి, ఆర్థికపరమైన లావాదేవీలున్నాయి. అందరితోనూ స్నేహపూర్వకంగా ఉంటాను నేను. వ్యాపారరీత్యా అలా ఉండడం అవసరం కూడా. కానీ నా చుట్టూ కంటికి కనబడని గిరి ఒకటి గీసుకొని ఉంటాననీ, అతి కొద్దిమందిని మాత్రమే ఆ గీత దాటనిస్తాననీ, అలా దాటనిచ్చిన వారితో మాత్రమే బంధాలూ, బాంధవ్యాలు పెంచుకుంటాననీ, ఎవరికోగాని, అందరికీ తెలియని విషయం.

నాకు కులాభిమానం చాలా ఎక్కువ. అందుచేత నా కులానికి చెందినవారిని తప్ప, మిగిలిన వారినెవరినీ కంటికి కనబడని ఆ గీత దాటి రానివ్వను. ఇది అతికొద్దిమందికి మాత్రమే తెలిసిన వాస్తవం.

అభ్యుదయవాదులమని భుజాలు చరుచుకునేవారు... నాకున్నదాన్ని 'కులగజ్జి' అని వేళాకోళంగా అంటారని నాకు తెలుసు. అలా అనుకోడానికి వారికి సర్వహక్కులూ ఉన్నాయన్నది నిర్వివాదాంశం. ఆ విషయంలో నాకెలాంటి ఆక్షేపణా లేదు. కాకపోతే, వాళ్ళంటున్నట్టు అది నిజంగా 'గజ్జే' అయితే, ఈ సమాజంలో బతకడానికీ, బాగుపడడానికీ 'ఆ గజ్జి' అనివార్యం అన్నది నా ప్రగాఢ విశ్వాసం.

చిన్న విత్తనం మొలకెత్తి, ఆకులు తొడిగి, మొక్కగా ఊపిరి పోసుకొని, చెట్టుగా ఎదిగి, మహావృక్షంగా విస్తరించడంలో దాని మూల వ్యవస్థ ఎటువంటి పాత్ర పోషిస్తుందో, మనిషి మనుగడలోనూ, అభివృద్ధిలోనూ కులం సరిగ్గా అటువంటి పాత్రే పోషిస్తుందని బలంగా నమ్మినవాణ్ని నేను.

చిన్నమొక్క మహావృక్షంగా ఎదిగే క్రమంలో కొమ్మలు ఎంత దూరం, ఎంత విశాలంగా విస్తరిస్తూ పోయినా, దాని మూలాలు భూమిలోనే బలంగా పాతుకొని, ఎలాగైతే దానికి స్థిరత్వాన్ని ఆపాదించి పెడతాయో, అలాంటి స్థిరత్వాన్నీ, రక్షణనూ మనిషికి కులం ఆపాదించి పెడుతుందని కూడా నమ్ముతాను నేను.

'ఏమైనా చెయ్యి... ఎలాగైనా జీవించు. కానీ ఏది చేసినా కులం పరిధిలో మాత్రమే చెయ్యి. దాన్ని ఏనాడూ, ఏ విషయంలోనూ అతిక్రమించకు...' ఇదీ నా ఫిలాసఫీ. ఇంతవరకూ నేను చాలా నిష్టగా పాటిస్తూ వచ్చిన నా జీవనసూత్రం.

దీన్ని ఏనాడూ ఉల్లంఘించకుండా, ఇంతకాలం జీవించినవాడ్ని. అలాంటిది, నాకూతురు కోసం ఈరోజు ఉల్లంఘిస్తానా దాన్ని? నో... నెవ్వర్! అదే చెప్పేను ప్రవీణకి... నీకోసమైనా సరే... ఎట్టి పరిస్థితుల్లోనూ నేనా పని చెయ్యనని!

ప్రవీణ నామాట లక్ష్యపెట్టలేదు సరికదా, కృష్ణగాడు, నా బెస్ట్ ఫ్రెండ్, వాడ్ని రాయబారం పంపింది నన్ను ఒప్పించడానికి! దానికి బృహత్ప్రయత్నమే గావించేడు వాడు.

'అసలు ప్రేమించడమే తప్పంటావా? ఈ రోజుల్లో ఎవరు ప్రేమించట్లేదో చెప్పు?'... అని నిలదీసేడు. 'ప్రవీణకు నువ్వంటే ఎంతో ప్రేమ గనుక, తన ప్రేమ విషయం చెప్పిందిగాని, అసలు చెప్పకుండా పెళ్లి చేసుకొని ఉంటే ఏంచేసేవాడివి?' అన్న లాజిక్ కూడా లాగేడు.

వాడి వితండవాదం వింటుంటే చిర్రెత్తుకొచ్చింది. నా కూతురు ప్రేమించడం విషయంలో నాకెలాంటి అభ్యంతరంలేదనీ, అది తప్పని అనుకోవటంలేదనీ నొక్కి మరీ చెప్పేను. నాకున్న అభ్యంతరమల్లా నా కూతురు వేరే కులంవాడ్ని ప్రేమించడం మాత్రమేననీ, వాడు మనవాడయ్యుంటే, నిరుపేద అయినా ఆనందంగా వారి పెళ్లి చేసేవాడినని కూడా చెప్పేను.

'ఈరోజుల్లో కూడా అంత కులపిచ్చి అయితే... పిచ్చంటే నువ్వొప్పుకోవనుకో... ఎలారా అమర్?' అని ప్రశ్నించేడు అదేదో మహాపరాధమైనట్టు.

విపరీతమైన కోపం వచ్చింది నాకు. కంట్రోల్ చేసుకోవడం నావశం కాలేదు. నువ్వన్నట్టు అంత కులపిచ్చి ఉండబట్టే... నా స్థాయికి ఏమాత్రం సరితూగని నీలాంటి గర్భదరిద్రుడితో స్నేహం చేసేనని చెప్పేను. నెత్తిన పెట్టుకున్నాననీ, ఎన్నో ఉపకారాలు చేసేననీ గట్టిగా అరిచి మరీ గుర్తుచేసేను. నా మాటలకు వాడికి కోపం రాలేదు సరికదా తేలికగా, గట్టిగా నవ్వేసేడు.

'రోజులు మారాయిరా అమర్. వాటితోపాటు మనం కూడా మారాలి' అన్నాడు పెద్ద సంఘసంస్కర్తలా. 'కూతురుకంటే కూడా కులం ఎక్కువట్రా నీకు?' ప్రశ్నించేడు.

'ఎక్కువే రా! కొంచెం కాదు, చాలా ఎక్కువ! దేవుడ్నైనా, భార్యనైనా, నీలాంటి స్నేహితుడ్నైనా, చివరికి నా ప్రాణమైన ప్రవీణనైనా వదులుకుంటాను గాని, కులాన్ని మాత్రం వదులుకునే ప్రసక్తి లేదని' గట్టిగా చెప్పేను వెధవకి. అదేమాట ప్రవీణతో కూడా చెప్పమన్నాను. ఇక మాట్లాడేదేమీలేదనీ, దయచేయమనీ చెప్పి, అక్కడ్నుంచి లేచి వెళ్ళిపోయాను.

ఇది జరిగిన మర్నాడే ప్రవీణ ఇంట్లోనుండి వెళ్లిపోయింది. ప్రేమించినవాడ్ని రిజిస్టర్ మేరేజ్ చేసుకుంది. దానికి కృష్ణగాడూ, వాడి భార్యా... సొంత చెల్లిలా చూసుకున్నాను తనని... ఇద్దరూ సాక్షి సంతకాలు చెయ్యడం పుండు మీద కారం జల్లినట్టైంది నాకు.

అవమానభారంతో తలెత్తుకోలేకపోతున్నాను. ఫోన్ స్విచాఫ్ చేసేశాను. నావాళ్ళకి మొహం చూపించలేక, బయటకు రావడం మానుకున్నాను. కోపంతో రగిలిపోతూ ఇంట్లో కూర్చున్నాను.

ఏదో ఒకటి చెయ్యాలి. ఏం చేసినా, ప్రవీణ జీవితాంతం కుమిలిపోయేలా చెయ్యాలి. ఆలస్యం చేస్తే నా కోపం చల్లారిపోవచ్చు. రగులుతున్న ప్రతీకారేచ్ఛ ఆరిపోవచ్చు. అందుకే ఒకట్రెండు రోజుల్లోనే ఏదో ఒకటి చెయ్యాలి. చేసి తీరాలి. లేకపోతే నాకు మనశ్శాంతి ఉండదు!!

**ముక్తాయింపు:**

'ఎంత ఆస్తిపరుడంటే అమరేంద్ర! ఎంత పలుకుబడండీ!! ఆయన మాటకి ఎదురుండేదా చెప్పండి! అలాంటి వాడు ఇంత దారుణానికి ఎలా ఒడిగట్టేడండీ! నమ్మలేకపోతున్నాం సుమండీ!' ఊరి ప్రజల్లో విభ్రాంతీ, విస్మయం.

'ఇలాంటి పని చేసేదేంటండీ అసహ్యంగా! అమరేంద్రలాంటి గొప్పవాడూ, అన్నీ ఉన్నవాడూ చెయ్యాల్సిన పనేనా ఇది! తలంచుకుంటేనే కడుపు మండిపోతోంది!"... సాటికులస్తుల్లో ఆగ్రహం, ఆవేదన!!

"ఎంత విశాలహృదయుడండీ అమరేంద్ర. దానకర్ణుడు దిగదుడుపు కాదటండీ ఆయన ముందు!"... భార్య బతకడానికి కావల్సినంత మాత్రం పక్కన పెట్టి, కోట్ల విలువచేసే మిగిలిన ఆస్తంతా కులసంఘానికి ధారాదత్తం చేసినందుకు సంఘం నాయకుల్లో ఆనందోత్సాహం, హర్షాతిరేకం!!

'ప్రవీణ తన చూపులతోనైనా నా మృతదేహాన్ని కలుషితం చేయడం నాకు సమ్మతం కాదు' అన్న వాక్యాన్ని కుదురుగా రాసిన కాగితం షర్ట్ జేబులో పెట్టుకొని, తన లైసెన్స్డ్ రివాల్వర్‌తో కణత మీద కాల్చుకొని, ఆత్మహత్యకు పాల్పడ్డాడు అమరేంద్ర!!

*బాల్యంనుంచే తెలుగు, ఆంగ్ల కథలు, నవలలను బాగా చదివే అలవాటు ఉన్న, కృపాకర్ గారు స్టేట్ బ్యాంక్‌లో పనిచేసి పదవీవిరమణ చేశారు. మంచి కథకులు, విశ్లేషకులు. హైదరాబాద్‌లో నివాసం.*



# అతి సర్వత్ర వర్జయేత్


కోయిలాడ రామ్మోహనరావు
✆ 9849345060



రసాయన శాస్త్ర పండితుడు. పదవీ విరమణ తర్వాత సేంద్రీయ పద్ధతిలో అక్షర, రేఖా సేద్యాలు చేస్తున్నారు. ఎన్నో బహుమతులు, ప్రశంసలూ, పురస్కారాలూ పొందిన బహుముఖ ప్రజ్ఞాశాలి. తెలుగు అక్షరాన్ని, ఆలోచనని నవతరానికి అందించడం సామాజిక బాధ్యతగా తీసుకున్న ఆదర్శ పౌరుడు.


***ఇండస్ట్రీలో భద్రత దృష్ట్యా ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాలి. కానీ మా వాళ్ళవేమీ పాటించటం లేదు. వాటి కారణంగా ఇప్పటికే ఎన్నో నష్టాలు జరిగాయి.***

***బాయిలర్ పేలిపోయి ఆరుగురు మనుషులు మరణించారు ఈ మధ్యనే. కాలుష్యంతో నిండిన నీళ్లు తాగి మనుషులు, పశువులు రోగాల బారిన పడిన సందర్భాలు ఉన్నాయి. ఇవన్నీ ఎప్పటికప్పుడు చెక్ చేయడానికి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఉంది. కానీ మీకు తెలుసుగా? మన దేశంలో రూల్స్ ఉంటాయి.***

***వాటిని మేనేజ్ చేసే మేనేజ్మెంట్లు కూడా ఉంటాయి.***

"వచ్చావా? రా... రా. నీ కోసమే చూస్తున్నాను. నీ సలహా విని, ఏడేళ్లకే పార్థుని ఐదో తరగతిలో జాయిన్ చేయడం నా తప్పయింది. నీ అభిమాన పుత్రుడు ఏం చేశాడో చూడు? నేను ఎప్పుడూ చెబుతూ ఉంటాను. ఏదైనా మితంగా ఉండాలని, 'అతి సర్వత్ర వర్జయేత్' అని పెద్దలు ఊరికే అనలేదని" అన్నాడు అంబరీష్ ఉపోద్ఘాతము ఏమీ లేకుండా!

"ఏం జరిగిందో స్పష్టంగా చెప్పరా" అంటూ విసుక్కున్నాను.

"ఈరోజు ఉదయం వీడి స్కూల్ టీచర్లు ఇద్దరు, మార్కెట్లో కలిశారు. వీడివల్ల స్కూల్లో చాలా సమస్యలు వస్తున్నాయట. ఏదైనా వర్క్ ఇస్తే నిమిషాల్లో చేసేసి, మిగతా పిల్లల్ని డిస్టర్బ్ చేస్తున్నాడట. కొన్నిరోజులు చూసి స్కూల్‌నుంచి పంపేస్తామని అంటున్నారు. వీడితో నాకు తలవంపులు తప్పడం లేదు" అన్నాడు కోపంగా.

"ఏమిటిది నాన్నా? ఎందుకురా పిల్లల్ని డిస్టర్బ్ చేస్తున్నావు?" పార్థుని దగ్గరగా తీసుకుంటూ అనునయంగా అడిగాను. అంతవరకు దుఃఖాన్ని ఉగ్గబెట్టుకొని ఉన్నాడేమో, ఒక్కసారిగా భోరుమని ఏడవడం మొదలుపెట్టాడు.

కొంచెం తేరుకుని... "నేనేమీ డిస్టర్బ్ చేయలేదు మావయ్యా. మిగిలిన పిల్లలే నా దగ్గరకు వచ్చి, 'ఆ వర్క్ ఎలా చేయాలని' పదేపదే అడుగుతుంటే, చెప్పడానికి ప్రయత్నించాను. మా టీచర్లు... నాన్న దగ్గర ఫిర్యాదు చేయడానికి మరో కారణం

కూడా ఉంది. ఒక్కొక్కసారి మాస్టర్లు తప్పు చెప్పినప్పుడు, నేను ప్రశ్నించేవాడిని! దాంతో వాళ్ళు నా మీద కోపం పెంచుకోవడం మొదలుపెట్టారు!" అని అంటుండగానే, "అదే పోయింది కాదు నీకు! మాస్టర్ల కన్నా గొప్పవాడివా నువ్వు? వాళ్ళు ఎందుకు తప్పు చెబుతారు?" అంటూ మళ్ళీ గొంతు పెంచాడు అంబరీష్.

ఆగమన్నట్లు చేయి పైకెత్తగానే, ఆగిపోయాడు.

"నువ్వు చెప్పేది మీ నాన్న నమ్మకపోయినా, నేను నమ్ముతాను. జరిగిన దానికి బాధపడకు. రేపు నేను మీ స్కూల్‌కి వచ్చి మాట్లాడతాను. లోపలికి వెళ్లి చదువుకో!" అంటూ వాడిని పంపేసాను.



పార్థు దగ్గరలో లేడని నిర్ధారణ చేసుకున్నాక, "వాడు చెప్పింది నిజమేనని నేను నమ్ముతున్నాను. నీకు ఫిర్యాదు చేసింది ఆ రామేశం మాస్టారు, జగదీష్ మాస్టారేనా?" అని అడిగాను.

"అంత కరెక్ట్‌గా ఎలా చెప్తున్నావు?" అంటూ ఆశ్చర్యపోయాడు.

"వాళ్ల గురించి పార్థు ముందే చెప్పాడు. వాళ్లు అప్పుడప్పుడు తప్పులు చెబుతూ ఉంటారట. వాళ్ళిద్దరికీ చాలా బద్ధకం. క్లాసుకు సరిగా ప్రిపేర్ అవరు. అర్ధరాత్రివరకూ పేకాట ఆడుతూ కూర్చుంటారు. మనవాడు ఐదో తరగతి చదువుతున్నాడన్న

మాటే గాని, వాడు ఇప్పటికే ఏడు, ఎనిమిది, తరగతుల పుస్తకాలు చదివేయగల జ్ఞానాన్ని సంపాదించాడు. ఆఫీసు పని ఒత్తిడి ఎక్కువగా ఉండటం వల్ల, నీకు ఈ విషయాలన్నీ తెలియడం లేదు. ఇకపైన వాడివల్ల ఏ సమస్య వచ్చినా నాకు కబురు పెట్టు. నేను చూసుకుంటాను. ఇలా వాడిమీద ఎప్పుడూ ఇలా అరవకు!" అంటూ వార్నింగ్ ఇచ్చినంత ఘాటుగా చెప్పాను.

అంబరీష్ తల ఊపాడు అలాగే అన్నట్లు.

★★★

'అతి సర్వత్ర వర్జయేత్' అన్న నానుడి నేను చాన్నాళ్ల నుంచి వింటున్నాను. కానీ అది సర్వత్ర వర్తిస్తుంది అని చెప్పలేను. దానికి ఉదాహరణ మా పార్థు. వాడు నా ప్రాణ స్నేహితుడు, అంబరీష్‌కి ఒక్కగానొక్క కొడుకు. అంబరీష్ ఒక ప్రైవేట్ ఆఫీసులో గుమస్తాగా పనిచేస్తున్నాడు. వాడు, నేను కలిసి చదువుకున్నాం. చదువులో వాడు ఎప్పుడూ వెనకబడే ఉండేవాడు. అందుకనే ఒక గుమస్తాగానే మిగిలిపోయాడు. నేను బాగా చదువుకొని ఒక బ్యాంకులో రీజనల్ మేనేజర్ హోదాలో ఉన్నాను.

పార్థు ఒక బాలమేధావి. వాడిలో ఉన్న ఆ ప్రత్యేకతను, వాడి తల్లిదండ్రుల కన్నా నేనే ఎక్కువగా గుర్తించాను. వాడికి అపారమైన తెలివితేటలు ఉన్నాయని వాళ్లకు తెలుసు గానీ... అవి ఏ స్థాయిలో ఉన్నాయో, అవి వాడిని ఎంత పైకి తీసుకెళ్తాయో నేను మాత్రమే ముందుగా పసిగట్టగలిగాను. వాళ్ళింట్లో పుట్టడమే, పార్థు చేసుకున్న దురదృష్టం అని నేననుకుంటూ ఉంటాను. వాడి తల్లి చదువులేని మూర్ఖురాలు. తండ్రి చదువుకున్న మూర్ఖుడు. వాడి తెలివితేటలను అతి తెలివిగా ముద్ర వేసి, వాడికి ఇవ్వాల్సినంత విలువ గాని, ప్రోత్సాహం గానీ వాళ్ళు ఇవ్వడం లేదని, నేను పలు సందర్భాల్లో గుర్తించాను. అందుకే చాలాసార్లు వాడి విషయంలో జోక్యం కలుగజేసుకుంటూ, వాడికి వీలైనంత మేలు కలిగేలా చూసుకునేవాడిని. వాడు నా ఇంట్లో పుట్టి ఉంటే, కళ్ళల్లో పెట్టుకొని చూసుకునేవాడిని! పిల్లలు లేని నాకు, వాడొక 'మానస పుత్రుడు' అయిపోయాడు.

మర్నాడే స్కూల్‌కి వెళ్లి, రామేశంని, జగదీష్‌ని కలిసాను. పార్థు ఇబ్బంది పడకుండా, వాళ్ళూ ఇబ్బంది పడకుండా ఒక పరిష్కారం సూచించాను. వాళ్ళు దానికి ఒప్పుకున్నారు.

'పార్థు తన వర్క్ తొందరగా పూర్తి చేసిన వెంటనే, నేను ఇచ్చిన పుస్తకాలు చదువుకుంటాడు. అవి ఎక్కువ స్థాయిలో ఉన్నా, వాడు చదవగలడు. దానివల్ల వాడికి భవిష్యత్తులో చాలా లాభం ఉంటుంది. టీచర్లకు డిస్టర్బెన్స్ సమస్య ఉండదు' అన్నది నేను సూచించిన పరిష్కారం!

ఆ తర్వాత హెడ్మాస్టర్‌ని కలిసి, జరిగిన విషయం చెప్పాను. ఆయన పార్థు పక్షాన్నే మాట్లాడాడు. మంచి పని చేసానని అభినందించాడు. అప్పటి నుంచి ప్రతీ నెలా స్కూలుకు వెళ్లి పార్థు గురించి, వాడు చదువు గురించి తెలుసుకుంటూ ఉండేవాడిని. దాంతో అంబరీష్ వాడి బాధ్యత దాదాపుగా నామీదే వదిలేశాడు.

పార్థుకి చదువంటే మహాప్రాణం. ఒక రకమైన పిచ్చి. సెలవులు వచ్చాయంటే చాలు. పెద్ద తరగతి క్లాసు పుస్తకాలు తెచ్చుకుని చదువుతూ ఉండేవాడు. పార్థు మేధస్సు గుర్తించిన హెడ్మాస్టర్, రామావతారం వాడికి పూర్తిస్థాయిలో ప్రోత్సాహం ఇచ్చేవాడు. ఐదో తరగతి నుంచి నేరుగా ఎనిమిదో తరగతిలోకి, ఆ తర్వాత నేరుగా పదో తరగతిలోకి ప్రవేశం పార్థుకి

వచ్చిందంటే ఆయన చలవే! వయసులో చిన్నవాడైనా ఎప్పుడూ క్లాసులో ఫస్ట్ వస్తూ, హెడ్మాస్టర్ నమ్మకాన్ని వమ్ము చేయలేదు.

పార్థు, పదో తరగతి పరీక్షలు రాయడానికి వాడి వయస్సు, ఒక అవరోధం అయింది. తొమ్మిది ఏళ్ళ వయసులో వాడు పరీక్ష రాయడానికి వీలు లేదని 'బోర్డ్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్' అభ్యంతరపెట్టింది. రామావతారం చేతులు ముడుచుకొని కూర్చోలేదు. సంబంధిత అధికారులను, లోకల్ ఎమ్మెల్యేని, విద్యాశాఖ మంత్రిని కలిశాడు. పార్థు టాలెంట్‌ని పరీక్షించడానికి, ఒక త్రిసభ్య కమిటీ ఏర్పాటయింది. వాళ్లు పెట్టిన పరీక్షల్లో అత్యుత్తమమైన మార్కులు తెచ్చుకొని, 'శభాష్' అనిపించుకున్నాడు.

పదో తరగతి పరీక్షలో స్టేట్ ర్యాంక్ తెచ్చుకున్నాడు. అప్పటి నుంచి వాడికి ఏ పరీక్షలోనూ వయసు ప్రతిబంధకం కాలేదు. ఏళ్లు గడుస్తున్న కొద్దీ వాడి స్థాయి పెరుగుతూ రావడం, నాకు ఎంతో ఆనందాన్నిస్తూ వచ్చింది. ఉద్యోగరీత్యా నాకు ట్రాన్స్ఫర్లు తప్పడం లేదు. అయినా నెలకు రెండుసార్లయినా పార్థుని కలుస్తూ, వాడి పురోగతిని గమనిస్తూ ఉండేవాడిని.

★★★

ఇంటర్మీడియట్ పరీక్ష, ఐఐటిలో ప్రవేశపరీక్ష పూర్తి అయ్యాక, వాణ్ణి చూద్దామని వెళ్లాను. ఇంట్లోకి వెళ్ళేసరికి కనిపించిన దృశ్యం చూసి నాకు మతి పోయింది. వాళ్ళ నాన్న ఆఫీసు ఫైల్స్ ముందేసుకుని, ఆ పని చేస్తూ కూర్చున్నాడు. అంబరీష్ కొడుక్కి పని అప్పచెప్పి, టీవీ చూస్తూ కూర్చొని ఉన్నాడు. నాకు చాలా చిరాకేసింది. పార్థు చేతిలో ఉన్న ఫైల్ లాక్కొని, టేబుల్ మీద పడేసి, అంబరీష్ మీద పడ్డాను.

"ఏమిటిరా ఈ పని? ఇలాంటి పనులు పార్థు చేత చేయిస్తావా? పరీక్షలు అయిపోయాక వాడిని సెంట్రల్ లైబ్రరీకి పంపమని చెప్పానా... లేదా?" అంటూ అరిచాను.

"వారం రోజుల క్రితం వరకు వెళ్ళాడు. నా పని ఒత్తిడి ఎక్కువగా ఉందని..." అంటూ నసిగాడు.

"స్నేహితుడిగా నాకు విలువ ఇస్తే, నేను చెప్పినట్లు చెయ్" అన్నాను కోపంగా.

"అలాగేలే! ఖాళీగా ఉన్నాడు కదా అని..." అంటూ మళ్ళీ నసిగాడు.

"వాడు ఖాళీగా ఉంటాడని ఇవన్నీ తీసుకొచ్చాను" అంటూ కొన్ని పుస్తకాలు, మెటీరియల్ బయటికి తీసాను.

"ఏమిటి మావయ్యా ఆ పుస్తకాలు?" అంటూ చెంగున గెంతి, నా దగ్గరికి వచ్చి, ఆ పుస్తకాలు చేతిలో తీసుకొని ఆసక్తిగా చూడసాగాడు. వాడిని అలా చూస్తుంటే నాకు ఎంతో ముచ్చటేసింది.

"నీ కొడుకు వేలకు వేలు, లక్షలు సంపాదించే రోజులు వస్తున్నాయి" అన్నాను గర్వంగా, పార్థు భుజం తడుతూ.

అర్థంకానట్లు చూశారు పార్థు, వాడి తండ్రి.

"ఇవన్నీ ఇంటర్నేషనల్ సర్టిఫికెట్ ప్రోగ్రాం ప్రవేశ పరీక్షకు సంబంధించినవి. మనవాడు ఆ పరీక్ష పాస్ అయితే మంచి ఉద్యోగమే వస్తుంది. ఉద్యోగం చేస్తూ చదువుకోవచ్చు. చాన్నాళ్ళ క్రితం తమిళనాడులో 'చంద్రశేఖర్' అనే కుర్రాడు

పది హేనేళ్లకే ఇంజినీరింగ్ పూర్తి చేసి, రికార్డ్ స్థాపించాడు. ఆ కుర్రాడు కూడా ఇంటర్ తర్వాత ఇలాంటి పరీక్షయే రాసి, సెలెక్ట్ అయ్యాడు. సైన్స్‌లోనూ, మేథ్స్ లోనూ ఎన్నో అన్‌సాల్వ్డ్ ప్రోబ్లమ్స్ ఉన్నాయి. అటువంటి వాటిని సాల్వ్ చేయడానికి, ఇలాంటి మేధావులను ఎంపిక చేయడానికే ఈ పరీక్షలు పెడతారు" అంటూ దాని అప్లికేషన్, మెటీరియల్, పుస్తకాలు పార్థు చేతిలో పెట్టాను.

'కొడుకు చేత ఆఫీస్ పని చేయిస్తున్నాడు' అని తిట్టినందుకు చిన్నబుచ్చుకున్న అంబరీష్ ముఖం విప్పారింది.

"వాడికి తండ్రిని నేను కాదురా. నువ్వే" అంటూ కౌగిలించుకున్నాడు అంబరీష్.

నేను ఊహించినట్లే పార్థు ఆ పరీక్ష పాసయ్యాడు. అతి చిన్న వయసులోనే ఒక అంతర్జాతీయ సంస్థకు ఆనరరీ డైరెక్టర్ అయ్యాడు. అతని పని చాలా వరకు ఆన్‌లైన్ లోనే. అప్పుడప్పుడు కలకత్తా, చెన్నై, ముంబైలాంటి సిటీలకు వెళ్లాల్సి ఉంటుంది. బిటెక్, ఎంటెక్ చదవడానికి ఖర్చు అంతా వాళ్లే భరిస్తారు. కాకపోతే ప్రవేశపరీక్షల్లోనూ, డిగ్రీ పరీక్షల్లోనూ మంచి ప్రతిభ కనబరచాలి.

వాడికి ఉద్యోగం ఇచ్చిన అంతర్జాతీయ సంస్థ సలహామేరకు, 'ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్'తో ఒక ఐఐటిలో బిటెక్ చేసాడు. బిటెక్ లోను, ఎమ్ టెక్ ప్రవేశపరీక్షలోనూ అత్యుత్తమమైన మార్కులు తెచ్చుకొని మా అందరినీ ఆనందపరిచాడు పార్థు.

★★★

బిటెక్‌లో చేరడానికి ముందు వాడికి మూడు నెలల ఖాళీ దొరికింది. ఆ మూడు నెలల్లో దొరికిన మంచిపుస్తకమల్లా చదివేశాడు. స్టీఫెన్ హాకింగ్ రాసిన 'ఎ బ్రీఫ్ హిస్టరీ ఆఫ్ టైమ్' అనే పుస్తకాన్ని, అందరికీ అర్థమయ్యే రీతిలో తెలుగులో రాశాడు. దాన్ని ఒక ప్రముఖ సంస్థ ప్రచురించింది. వాతావరణ కాలుష్యం, పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ కారణంగా జరిగే అనర్థాలు, బయోడైవర్సిటీ, ఆంధ్ర నవయుగ వైతాళికులు, అంతరించిపోతున్న అడవిజంతువులు, ఆర్థికమాంద్యం — తీరు తెన్నులు.... ఇలా ఒకటేమిటి? అనేక అంశాలను గురించి విస్తృత పరిశోధన చేసి, నిరంతరం ఏదో ఒకటి ఇంగ్లీషులోనో, తెలుగులోనో రాస్తూనే ఉన్నాడు. అలా రాసిన వ్యాసాలన్నీ పుస్తకాలుగా రూపొందడం జరిగింది. ఎంతో ధనం రాయల్టీగా అందింది.

వాడికి పదిహేను ఏళ్ల వయసు వచ్చేటప్పటికి బి టెక్ పూర్తయింది. ప్రపంచంలోనే అతి చిన్న వయసులోనే ఇంజనీరింగ్ పూర్తి చేసిన అతి కొద్దిమందిలో వాడొకడుగా పదిలమైన స్థానాన్ని పొందాడు.

అంబరీష్ ఉద్యోగం మానేశాడు. అద్భుతమైన ఇల్లు కట్టించడం మొదలు పెట్టాడు. కొడుకు సంపాదనతో హాయిగా జీవిస్తున్నాడు.

★★★

పార్థు ఎమ్‌టెక్ చేయడానికి ఖరగ్‌పూర్‌ని ఎంచుకున్నాడు. రెండువారాల్లో అడ్మిషన్. నేను పనిచేస్తున్న కలకత్తాకు ఖరగ్‌పూర్ దగ్గరే కాబట్టి, ఆ సమయానికి నేను అక్కడికి వస్తానని చెప్పాను. అయితే ఈలోగానే అంబరీష్ మా తలుపు

తట్టాడు. ఆశ్చర్యపడుతూ వాడిని ఇంటిలోకి ఆహ్వానించాను. వాడి ముఖం సీరియస్‌గా ఉంది. వాడినెప్పుడూ అలా చూడకపోవడం వల్ల, నా మనసేదో కీడును శంకించింది.

"ఏమిట్రా విషయం? అంత సీరియస్‌గా ఉన్నావు" అంటూ అడిగాను కుతూహలంగా.

"నీ అభిమాన పుత్రుడు ఏం చేశాడో తెలుసా?" కోపంగా అంటున్న వాడి కళ్ళు ఎర్రబారాయి.

'ఆ పసివాడు ఏం చేసి ఉంటాడు? వీడు ఎందుకు ఇలా రెచ్చిపోతున్నాడు?' అనుకుంటూ ఆందోళన పడ్డాను.

"ఏం చేశాడు?" అని అడుగుతున్నానే గాని, ఏం వినాలోనన్న టెన్షన్ నన్ను చంపేస్తోంది.

"ఎమ్ టెక్ చదవడట. ఉద్యోగం మానేస్తాడట!"

ఆ మాటలు వినేసరికి మతిపోయినట్లు చూశాను. ఆ సమాధానం నన్ను ఒక బొమ్మలా మార్చేసిందేమో! కొన్ని నిమిషాల పాటూ మాట, పలుకు లేక షాక్‌లో ఉండిపోయాను. కాసేపటికి గాని పెదవి విప్పలేకపోయాను.

"ఎందుకట? చెప్పరా. నాకు ఏమీ అర్థం కావడం లేదు" ఆత్రుతగా ప్రశ్నించాను.

"ఆ కంపెనీ వాళ్ళ పాలసీ నచ్చలేదట. కారణాలేవో చెప్పాడు. నాకు సరిగ్గా అర్థం కాలేదు. నువ్వే అడుగు. వాడు బాగా సంపాదిస్తున్నాడని ఇల్లు మొదలుపెట్టాను. ఇంటికి ఎలక్ట్రికల్ సామాన్ల కోసం కలకత్తా వచ్చాను. ఈలోగా ఈ చావు కబురు చల్లగా అందింది. నా బుర్ర ఏమీ పని చేయట్లేదు" అంటున్న అంబరీష్‌కి ఏడుపు ఒక్కటే తక్కువ. కాసేపైన తర్వాత వాడు వెళ్ళిపోయాడు.

వాడు వెళ్ళగానే పార్థుకి ఫోన్ చేశాను. పార్థు చెప్పడం మొదలుపెట్టాడు.

"బి టెక్ ఆఖరి సంవత్సరంలో, మా కంపెనీ నాకు అప్పచెప్పిన బాధ్యతలు, మన పరిశ్రమల వాతావరణ కాలుష్యంతో ముడిపడి ఉన్నాయి. మీకు తెలుసు కదా? ఇండస్ట్రీలో భద్రత దృష్ట్యా ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాలి. కానీ మా వాళ్ళవేమీ పాటించటం లేదు. వాటి కారణంగా ఇప్పటికే ఎన్నో నష్టాలు జరిగాయి.

బాయిలర్ పేలిపోయి ఆరుగురు మనుషులు మరణించారు ఈ మధ్యనే. కాలుష్యంతో నిండిన నీళ్లు తాగి మనుషులు, పశువులు రోగాల బారిన పడిన సందర్భాలు ఉన్నాయి. ఇవన్నీ ఎప్పటికప్పుడు చెక్ చేయడానికి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఉంది. కానీ మీకు తెలుసుగా? మన దేశంలో రూల్స్ ఉంటాయి. వాటిని మేనేజ్ చేసే మేనేజ్మెంట్లు కూడా ఉంటాయి. ఇదంతా తెలుసుకున్న తర్వాత, ఆ ఉద్యోగంలో కొనసాగకూడదనే నిర్ణయం తీసుకున్నాను. ఇది మీకు ముందుగా చెప్పకపోవడం నా తప్పే. నన్ను మన్నించండి!" అని బతిమాలుతున్న కుర్రవాడితో నేనేం మాట్లాడాలి?

"నీ సంపాదన మీద ఆధారపడి మీ నాన్న ఎన్నో ఆశలు పెట్టుకున్నాడురా. పెద్ద ఇల్లు కట్టించడం మొదలుపెట్టాడు. ఆ నిర్మాణం ఆగిపోతే వాడు చాలా బాధపడతాడురా!" అన్నాను.

"నాన్న కోరిక నెరవేరుతుంది మావయ్యా. కాకపోతే కాస్త ఆలస్యం అవుతుంది. మంచి ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాను. నిన్ననే మాక్మిలన్ పబ్లిషర్స్‌తో డీల్ ఫిక్స్ అయింది. వాళ్ళు అడిగిన కంటెంట్‌తో పుస్తకం రాయడం మొదలు పెట్టాను.

రాయల్టీ బాగానే వస్తుంది. ఇదంతా నాన్నకు అర్థం కాదు. నాది ఓవర్ యాక్షన్ అని, ఎప్పటిలాగే ‘అతి సర్వత్ర వర్జయేత్’ అంటూ బుర్ర తినేస్తున్నాడు. మీరే సర్ది చెప్పాలి. మనసు చంపుకొని ఆ ఉద్యోగం చేయలేను మావయ్యా” అని అంటున్న పార్థు, ‘పదిహేను ఏళ్ల వయసుకే, ఎంత ఎదిగిపోయాడు!’ అనిపించింది. అయినా వాడికో సలహా చెప్పాలనిపించింది.

“ఒరే నాన్నా... పర్యావరణం గురించి, ప్రజల గురించి ఆలోచించి, ఉద్యోగం మానేయడం కాదు. వాటికోసం నువ్వే ఏదయినా చేయాలి. ఎందుకంటే చిన్న వయసులోనే ఎంతో ఎత్తుకు ఎదిగావు. సమాజానికి సేవచేయడం కోసమైనా నువ్వు ఐయ్యేఎస్ పాసవ్వాలి. ఆ హోదాలోనే ఏదయినా సాధ్యమౌతుంది. ఒక్కసారి ఆలోచించు” అన్నాను.

నా సలహా వాడు తప్పక పాటిస్తాడు అనే నమ్మకం నాకుంది!

# మహాసతి

నందూరి సుందరీ నాగమణి
✆ 9849989201



కథామంజరి సంపాదక సహకార బృంద సభ్యురాలు. నిరంతరం సాహితీ వాతావరణం లో గడిపే ఈమె అశక్తి అక్షర దోషాన్ని క్షమించడం. చాలామంది ప్రఖ్యాతులకు అందని వ్యాకరణ జ్ఞానం ఈమె సొంతం. ఈమె శక్తి .. ఈమె తన ‘అక్షర సుమాలు’ గ్రంథం ద్వారా ఆ జ్ఞానాన్ని అందరికీ పంచడం.

> ***ఏజ్‌కి తగ్గట్టు తయారైతే కాదూ? అసలు ఆ పర్సనాలిటీ ఏమిటి? బక్క పీచులా ఉంటుంది.***
>
> ***ఒంటిమీద పావుకేజీ కండ కూడా లేదూ! పైగా ఆవిడకి ఒక్క బంగారు నగ లేదు. అన్నీ గిల్టునగలే. మొగుడు దూరంగా ఉన్నా ఈవిడా, ఈవిడ కుర్రవేషాలూనూ.***
>
> ***చాలా చిరాగ్గా ఉంటుంది నాకైతే... ఇంట్లో అసలు వంటే చేయదు తెలుసా? రోజూ లంచ్ టైమ్‌లో మాతో పాటుగా బయటకు వచ్చేస్తూ ఉంటుంది. బిల్లు మాత్రం మేమే పే చేయాలి. పర్సు తీయదసలు!***

ఆదివారం పూట, తలస్నానం చేసి, జుట్టు చిక్కులు తీసుకుని, ఒక రిబ్బన్ తీసి కట్టుకుని అలాగే వదిలేసి, పనుల్లో పడింది, వసుధ. తేలికగా వంట ముగించుకుని, సమయం ఇంకా పన్నెండే కావటంతో పుస్తకం పట్టుకుని చదువుతూ కూర్చుంది.

కాలింగ్‌బెల్ మ్రోగటంతో, ‘ఈ సమయంలో ఎవరబ్బా!’ అనుకుంటూ వెళ్ళి తలుపు తెరచిన వసుధ ఆశ్చర్యపోయింది. ఎదురుగా పార్వతి, జానకి! పార్వతి తన కాలేజీలోనే ఇంగ్లీషు లెక్చరర్, జానకి జూవాలజీ లెక్చరర్. వాళ్ళిద్దరూ అక్కాచెల్లెళ్లు.

“హే... భలే ఆశ్చర్యం! రండి రండి!” అంటూ ఇద్దరినీ లోపలికి ఆహ్వానించింది, వసుధ.

పార్వతి, జానకి నవ్వుతూ లోపలికి వచ్చి, సోఫాలో కూర్చున్నారు. వసుధ ఇచ్చిన చల్లని మంచినీళ్లు తాగుతూ, “అబ్బా, మీ ఇల్లు భలే చల్లగా ఉందోయ్... చక్కగా అన్నీ సర్దుకున్నావు. చాలా బాగుంది” అంటూ అభినందించింది పార్వతి.

“థాంక్యూ పారూ!” నవ్వింది, వసుధ.

“ఈ పక్క కాలనీలోనే మా కజిన్ వాళ్ళమ్మాయిని పెళ్ళికూతురిని చేస్తుంటే ఆ ఫంక్షన్‌కి వచ్చాము. ఉదయం పదిగంటలకే ఆ వేడుక అయిపోవటంతో, భోజనాలు కూడా పెట్టేసారు. భోజనం చేసేసి, ఇదిగో నిన్ను కలిసి పోదామని వచ్చాము.” చెప్పింది, జానకి.

"పోనీలే, మంచిపని చేసారు. అయ్యో, భోజనాలు అయిపోయాయా? ఈరోజు మీకు నా చేతివంట రుచి చూసే భాగ్యం లేదు పొండి." నవ్వింది, వసుధ.

తాము కూడా నవ్వారు పార్వతి, జానకి. కాలేజీలో అందరూ లెక్చరర్స్ కావటంతో లంచ్ సమయంలో కలిసి భోజనం చేస్తూ ఉంటారు అందరూ. అలా ఒక చక్కని స్నేహబంధం అలముకుంది వీరి మధ్యలో.

"ఎక్కడ తినిపిస్తున్నావు వసూ, నువ్వు ఈమధ్య మాతో కలిసి భోజనం చేయటమే మానేసావు కదా..." కినుకగా అన్నది పార్వతి.



"అవును. లంచ్‌టైమ్‌లో నీ స్టూడెంట్స్‌తో కలిసి తరచుగా బయటకు వెళ్ళిపోతూ ఉంటావు."

"ఓ అదా! ఎమ్మే సెకెండ్ ఇయర్ కోమలి అనుకోకుండా నాకు బాగా దగ్గరైంది పారూ! నాకు ఒక కూతురిలాగా అనుకో..." మురిపెంగా అన్నది వసుధ.

"అవును... ఆ కోమలి, అర్పిత, జలజ... వీళ్లలో జలజ నా స్టూడెంటు." చెప్పింది, జానకి.

"అవును జానూ! ఒంటరిగా ఉంటాను కదా, వారానికి రెండుసార్లు వచ్చి, తెలుగులో సందేహాలు చెప్పించుకుంటూ ఉంటారు. చాలా ప్రేమగా ఉంటారు అందరూ. అందులో కోమలి మరీనూ! ఆదివారాలు నా దగ్గరకు వచ్చి భోజనం చేసి వెళుతూ ఉంటారు. ఈమధ్య తరచుగా లంచ్‌కి బయటకు తీసుకువెళుతున్నారు. ఇంట్లో ఒంటరిగా ఉండి బోర్ కొడుతూ ఉంటుంది కదా, వీళ్ళ కంపెనీ బాగుంది నాకు!"

"ఊ..." దీర్ఘంగా నిట్టూర్చింది జానకి.

"అసలు మొన్న నా పుట్టినరోజుకు అందరూ కలిసి, నాకు చీరలు, డ్రెస్‌లు కొనిచ్చారు తెలుసా? నాకింకా యాభైకూడా రాలేదని, పైగా సన్నగా సుకుమారంగా ఉంటానని, చీరల బదులుగా సల్వార్, కమీజులు వేసుకోమంటారు. ముఖానికి మేకప్ వేసుకోవటం నేర్పారు. ఆడపిల్లలు లేని లోటు తెలియటం లేదంటే నమ్మండి!"

వసుధ వైపు జాలిగా చూసింది, పార్వతి. "వసూ... మేము చెబితే నీకు నమ్మకం కలగదు కానీ, ఆ కోమలి నిన్ను బాగా వాడుకుంటోంది. తన అసైన్మెంట్స్ కోసం, ఇంటర్నల్ పరీక్షల కోసం నువ్వు చచ్చీచెడీ నోట్సులు ప్రిపేర్ చేసి ఇస్తున్నావు. అవి చక్కగా కాపీ చేసి, మంచిమార్కులు సంపాదించుకుంటోంది. అసలు, లెక్చరర్స్ అనేవారు, తమకు, స్టూడెంట్స్‌కి మధ్య ఎప్పుడూ కొంతదూరం పాటించాలి తెలుసా? ఈ వరుసలు, అతిచనువులు, గారాబాలు పనికిరావు!"

"అదేమిటి పారూ, అలా అంటావు? ఆడపిల్లలు లేని నాకు కోమలి ఆ లోటు తీరుస్తోందనిపిస్తోంది. నాతో చాలా ప్రేమగా ఉంటారు ఆ ముగ్గురు పిల్లలూ!" చిన్నబుచ్చుకుంటూ అన్నది వసుధ.

పార్వతి, జానకి ఇద్దరూ ముఖముఖాలు చూసుకున్నారు. "నువ్వు పూర్తిగా మునిగిపోయి ఉన్నావు వసూ, మేము చెప్పేది నీకు తలకి ఎక్కదు. సరే, వస్తాం!" అంటూ లేచింది పార్వతి.

"అయ్యో, అప్పుడేనా? ఉండండి కాసేపు పారూ. ప్లీజ్..." అంటూ కూల్‌డ్రింక్స్, చిప్స్ తీసుకువచ్చింది వసుధ. వాళ్ళతో కబుర్లు చెబుతుందే కానీ, కోమలి గురించి వాళ్ళు అలా మాట్లాడినందుకు ఆమెకు మనసు కడలిలో అల్లకల్లోలపు సుడి ఏర్పడింది.

దానిని మరల్చుకోవటానికి ఈమధ్య తాను కొన్న పుస్తకాలు, చీరలు, ఒన్ గ్రామ్ గోల్డ్ నగలు చూపించింది. పార్వతి, జానకి కూడా ఆమెకు కబుర్లు చెబుతూ, కాసేపు గడిపారు. ఆ తరువాత లేస్తూ, "అమ్మో రెండవుతోంది. నువ్వింకా లంచ్ చేయలేదు. మేము బయలుదేరతాము. చాలా సమయం కలిసి గడిపాము నీతో..." అంటూ లేచారు.

బొట్టు పెట్టి, తాంబూలం ఇస్తూ, "వస్తూ ఉండండి మీ ఇద్దరూ... నేను కూడా ఇంక లంచ్ టైమ్‌లో బయటకు వెళ్ళను. మనం కలిసే తిందాము." చెప్పింది వసుధ, మనస్ఫూర్తిగా.

"సరే, అలాగే... ఆ పిల్లలతో కాస్త చెలిమి తగ్గించు. బెటర్ థింగ్ ఏమిటంటే, నువ్వు లీవ్ పెట్టి, జర్మనీకి గానీ, స్టేట్స్‌కి గానీ వెళ్ళి, కొన్నాళ్ళుండి రా." హెచ్చరించి, కదిలారు ఇద్దరూ.

★★★

అన్యమనస్కంగానే భోజనం చేసాననిపించి, పక్కపై వాలింది వసుధ.

అప్రయత్నంగా ఆమె ఆలోచనలు భర్త మీదకు మళ్ళాయి. ఇక్కడ తనను ఒంటరిగా వదిలిపెట్టి, కంపెనీ పని మీద డిప్యుటేషన్‌పై జర్మనీ వెళ్ళి రెండేళ్ళు గడిచాయి. మధ్యలో ఒకసారి వచ్చి వెళ్ళాడు అంతే. తనను తీసుకువెళ్ళే వీలులేదంటాడు. 'ఇంకా ఒక్క సంవత్సరమే కదా, వచ్చేస్తానుగా...' అని సముదాయిస్తాడు. తనకి మాత్రం ఒంటరిగా ఉండాలంటే చాలా కష్టంగా ఉంటోంది. ఒకే ఒక్క సంతానం మురళి పైచదువులకు అమెరికా వెళ్ళి, అక్కడే ఉద్యోగం సంపాదించుకుని స్థిరపడ్డాడు. వచ్చే సంవత్సరం వాడికి పెళ్ళిచేయాలని చూస్తోంది తను. ఇక్కడ తను, తన ఉద్యోగం, కొలీగ్స్ అయిన స్నేహితులు... జీవితం బాగానే సాగుతున్నా, కుటుంబసభ్యులు తనతో లేకపోవటం అనేది వసుధను ఈమధ్య బాగా మానసికంగా వేధిస్తున్నది.

ఈ సమయంలో తనకు ఎంతో దగ్గరయ్యారు, కోమలి, అర్పిత, జలజ. వాళ్ళది వరంగల్ దగ్గరున్న ఒక చిన్న ఊరు. కోమలి వాళ్ళ నాన్నగారు చాలా ధనవంతులు. హైదరాబాద్‌లో కాలేజీకి దగ్గరలోనే ఒక పీజీలో ముగ్గురూ కలిసి ఉంటున్నారు. వసుధ తెలుగు లెక్చరర్ అవటం, పైగా సబ్జెక్ట్ పట్ల ఎంతో ప్రేమ, అవగాహన, సాధికారత కలిగిన వ్యక్తి కావటంతో టెక్స్ట్ పుస్తకాలలోని పాఠ్యాంశాలలో దొరకని కొన్ని సబ్జెక్ట్ పరమైన అధ్యాయాల విషయంలో ఆమె దగ్గరున్న ఎన్నో రిఫరెన్స్ గ్రంథాలు, పరిశోధనావ్యాసాలు... వీటి అధ్యయనంతో, చక్కటి ఉదాహరణలు, ఉపాఖ్యానాలతో ఎంతో చక్కగా పాఠాలు చెప్పే వసుధ అంటే విద్యార్థులందరికీ మక్కువే!

మొదటి సంవత్సరం పరీక్షల సమయంలో, తన దగ్గరకు కోమలి, అర్పిత రావటం, తన సహాయం అర్థించటంతో చదువు పట్ల, తెలుగు పట్ల వాళ్ళకున్న ఆసక్తికి, శ్రద్ధకు తాను ఎంతగానో పొంగిపోయిన మాట వాస్తవం. కాలేజీకి, వాళ్ళుండే పీజీకి తన ఇల్లు దగ్గరే కావటంతో, తన ఇంటికి తమ ఫ్రెండ్ జలజతో సహా తరచుగా వస్తూ ఉండటం, వాళ్ళతో ఒక రకమైన అనుబంధం తాను పెంచుకోవటం జరిగింది. కోమలి అయితే, తనను 'అమ్మా!' అని పిలవటం మొదలుపెట్టింది. మురళి తరువాత ఒక ఆడపిల్ల పుట్టి ఉంటే, అచ్చు కోమలిలాగే ఉండేదేమో అనుకుంటూ ఉంటుంది తానెప్పుడూ. చాలా తరచుగా లంచ్ సమయంలో తనను హోటల్‌కు తీసుకువెళ్ళిపోతూ ఉంటారు. నెలకు రెండుసార్లయినా సినిమాలకు, షికార్లకు తిప్పుతూ ఉంటారు. తన కొడుకు, భర్త దగ్గరలేని సమయంలో ఎంతో బెంగగా, ఒంటరిగా ఫీలయ్యే తనకు వాళ్ళు ఇంత ప్రేమను అందిస్తూ ఉంటే, పార్వతి వాళ్ళు... ఇదేమిటి, ఇలా అంటారు?

అప్రయత్నంగా వసుధ కళ్ళు చెమరించాయి.

★★★

ఒక మూడునెలల తరువాత...

"హాయ్ అమ్మా! శుభోదయం." ఫోన్‌లో కోమలి గొంతు పలకరించింది, ఉదయాన్నే.

"శుభోదయం..."

"ఏమిటమ్మా, గొంతు అలా ఉంది? ఒంట్లో బాగుందా?" కోమలి స్వరంలో ఆరాటం.

"అబ్బే, ఏమీలేదు కోమలీ... రాత్రి కొద్దిగా జలుబు, దగ్గు వచ్చాయిలే"

"జాగ్రత్తమ్మా... ఈరోజు కాలేజీకి లీవ్ పెట్టేయండి. నేను వచ్చి డాక్టర్ దగ్గరకు తీసుకువెళ్ళనా?"

"మందులు వేసుకున్నాను."

"మీరు నాన్నగారిమీద, అన్నయ్యమీద బాగా బెంగ పెట్టుకున్నారు. ఇలా అయితే ఎలా?" చనువుగా కోప్పడింది కోమలి.

జవాబు చెప్పకుండా నవ్వేసి, "ఉంటానమ్మా, వంట మధ్యలో ఉంది." అంటూ కాల్ కట్ చేసేసింది, వసుధ.

కోమలికి, వసుధ ఏదో తేడాగా ఉన్నట్టు అర్థమైంది. కానీ అదేమిటో మాత్రం అర్థం కాలేదు. ఇంకో వారంలో అసైన్మెంట్స్ పూర్తి చేయాలి. వసుధ హెల్ప్ లేకుండా అది సాధ్యం కాదు. 'సాయంత్రం వెళ్ళి ఆ పని చూడాలి' అనుకుంది దృఢంగా!

★★★

ఆ ముందురోజు సాయంత్రం ఏమి జరిగిందంటే...

పార్వతి వాళ్ళ ఇంట్లో పూజ, పేరంటం ఉంటే, తాంబూలం తీసుకోవటానికి వాళ్ళ ఇంటికి వెళ్ళింది వసుధ.

పార్వతి, జానకి ఇద్దరూ వసుధను భోజనం చేసి వెళ్ళమని కోరారు. ఇంటికి వెళ్ళి, చేసే పనేమీ పెద్దగా లేకపోవటంతో అంగీకరించింది, వసుధ. పేరంటాళ్ళ హడావుడి అంతా అయ్యాక, భోజనాలు పూర్తయ్యాక, అందరూ ఒక రూములో కూర్చున్నారు.

పార్వతి, ఒక అమ్మాయిని పిలిచి, "వసూ, ఈ అమ్మాయి నీకు తెలుసు కదా... అపర్ణ. నీ స్టూడెంటే... ఈ ఏడాది కాస్త ఆలస్యంగా చేరింది మన కాలేజీలో" అని చెప్పింది.

"ఓ... అవునవును. తెలుసు! ఏమ్మా అపర్ణా, బాగా చదువుతున్నావా? లెసన్స్ అన్నీ ఫాలో అవుతున్నావా?" ఆప్యాయంగా పలకరించింది వసుధ. తల ఊపింది అపర్ణ.

"అపర్ణ మా ఊరి అమ్మాయే వసూ. మాకు దూరపు బంధువులు అవుతారు. నిన్న కాలేజీ క్యాంటీన్‌లో స్టూడెంట్స్ అందరూ నీ గురించి మాట్లాడుకున్నారట. నీకు తెలుసా?"

"అయ్యో, నాకెలా తెలుస్తుంది?" అయోమయంగా చూసింది, వసుధ.

జానకి సైగ చేయటంతో, అపర్ణ తన మొబైల్ ఫోన్‌లోని రికార్డర్ ఆన్ చేసింది.

★★★

అమ్మాయిల నవ్వులు, బ్యాగ్రౌండ్‌లో 'కాఫీ', 'ఇడ్లీ' అంటూ సౌండ్‌లు వినిపిస్తున్నాయి.

అంతకుముందు ఏమి సంభాషణ జరిగిందో తెలియదు కానీ, కోమలి గొంతు వినిపిస్తోంది. "ఆ... అదేమంత పెద్ద కష్టం కాదులే. మనకి ఒక బకరా ఉంది కదా. అడిగితే చాలు బోలెడు నోట్స్ ప్రిపేర్ చేసి ఇస్తుంది. ఒకటి, రెండుసార్లు చదువుకుని, వెళ్ళి పరీక్ష వ్రాసేస్తే, క్లాసు గ్యారంటీ!"

“అదేమిటి కోమలీ... బకరా అన్న మాటేమిటి, తప్పు కదా. ఆవిడ నిన్ను ఎంతగా ప్రేమిస్తోంది! నువ్వు ఆవిడ పెంపుడు కూతురివని అందరికీ చెబుతుంది వసుధా మేడమ్” ఎవరిదో గొంతు మందలింపుగా వినిపించింది.

“గాడిదగుడ్డేమీ కాదూ... నా అవసరం తీరటం కోసం ఆవిడను ‘అమ్మా!’ అని పిలుస్తున్నానంతే. మా అమ్మెక్కడ, ఈవిడెక్కడ? నక్కకీ, నాగలోకానికి ఉన్నంత తేడా!” విలాసంగా పలికింది కోమలి గొంతు.

“పాపం. వసుధామేడమ్ చాలా అమాయకురాలు. ఆమెను నువ్వింత మోసం చేస్తున్నావని తెలిస్తే ఏమైపోతుందో?”

“ఆ... ఏమీ అవ్వదు. ఏదో, ఫ్యామిలీకి దూరంగా ఉంటుందని కంపెనీ ఇస్తున్నాం అంతే. ఆవిడ మాకు చదువులో హెల్ప్ చేసిందేమీ లేదు. అక్కడొకటీ, ఇక్కడొకటీ వ్యాసాలు చూసి, కాపీ చేసి నోట్స్ తయారుచేస్తుంది. ఆ మాత్రం దానికి ఆవిడకి బోలెడు జ్ఞానం ఉన్నట్టు కాదులే!”

“అదేమిటి కోమలీ, ఇంతకు ముందే కదా, ఆవిడ ప్రిపేర్ చేసిన నోట్స్ చదువుకుని, పరీక్షలు రాస్తే క్లాసు గ్యారంటీ అన్నావు!”

“ఆ... పట్టుకుందండీ లాయరమ్మ పాయింటూ! అసలు ఆవిడకి ఎన్ని తాపత్రయాలు ఉన్నాయో తెలుసా? యంగ్‌గా, అందంగా కనిపించాలని ఆరాటం... మాలాగా ఉండాలని కోరిక! అందుకే ఈమధ్య సల్వార్లు వేస్తోంది, మేకప్ చేసుకుంటోంది. ఏజ్‌కి తగ్గట్టు తయారైతే కాదూ? అసలు ఆ పర్సనాలిటీ ఏమిటి? బక్కపీచులా ఉంటుంది. ఒంటిమీద పావుకేజీ కండ కూడా లేదూ! పైగా ఆవిడకి ఒక్క బంగారు నగ లేదు. అన్నీ గిల్టునగలే. మొగుడు దూరంగా ఉన్నా ఈవిడా, ఈవిడ కుర్రవేషాలూనూ. చాలా చిరాగ్గా ఉంటుంది నాకైతే... ఇంట్లో అసలు వంటే చేయదు తెలుసా? రోజూ లంచ్ టైమ్‌లో మాతో పాటుగా బయటకు వచ్చేస్తూ ఉంటుంది. బిల్లు మాత్రం మేమే పే చేయాలి. పర్సు తీయదసలు!” ఎలాంటి తడబాటు, వెరపు లేకుండా మాట్లాడుతున్నది కోమలి.

“ఛ! ఊరుకోవే...” కోమలిని వారిస్తూ కంగారుగా అన్నది అర్పిత.

“ఎందుకు ఊరుకోవాలే? ఆమె నిజస్వరూపం వీళ్లందరికీ తెలియాలి కదా...”

అక్కడితో ఆగిపోయింది సంభాషణ!

★★★

వింటున్న వసుధ ఆ సంభాషణ పూర్తి కాగానే, ఒక్కసారిగా రెండు చేతుల్లో ముఖం దాచుకుని, భళ్ళున ఏడ్చేసింది.

“అయ్యో... ఇదేమిటి వసూ! ప్లీజ్ ఊరుకో...” వసుధ తలను తన భుజానికి చేర్చుకుని, మంచినీళ్లు తాగించింది పార్వతి.

“నిన్న అపర్ణ ఫోన్ చేసి, ‘ఈ కోమలి, వసుధా మేడమ్ గురించి ఏమేమో మాట్లాడుతోంది పిన్నీ’ అని చెప్పగానే, వీలుంటే రికార్డ్ చేయమని చెప్పాను వసూ... నీకు ఆమె నిజస్వరూపం తెలుస్తుందని. నువ్వేమో ఆమె పట్ల గుడ్డి నమ్మకంతో ఉన్నావు. మేము చెప్పినా రియలైజ్ అయ్యేటట్టు లేవని, నీ చెవులతో నీవే వింటే నీకు బాగా అర్థమవుతుందని అనుకున్నాము అక్కా, నేనూ...” చెబుతోంది జానకి.

వసుధకు అవేవీ వినిపించటం లేదు. ‘బకరా! బకరా!’ కోమలి గొంతు వినిపిస్తోంది. అసలు తను విన్న మాటలన్నీ నిజమేనా? నిజమే అయితే, ఎంత ఫూల్ అయింది తను? మరీ మనిషి మంచితనాన్ని, ప్రేమను ఇలా కూడా వాడేసుకుంటారా?

అవసరం కోసం ఇంతగా నటిస్తారా? ఇంత నయవంచనా? తనను ఎవరో నిలువెల్లా కత్తితో గాట్లు పెట్టిన భావన కలిగింది వసుధకు.

"పారూ, నిజం చెబుతున్నాను. కన్నకూతురిలా ప్రేమించాను. ఇలా మాట్లాడుతోందేమిటి? అసలు కోమలికి మా అబ్బాయి పెళ్ళిలో ఆడపడుచు లాంఛనాలు ఇప్పించాలని అనుకున్నాను. ఆమె దృష్టిలో నేను ఇంత చీప్‌గా... వద్దు వద్దన్నా, నా కంపెనీ కావాలంటూ లంచ్‌కి తీసుకుపోయేది. నేను బిల్లు డబ్బు ఇవ్వబోతే పుచ్చుకునేది కాదు. నేనసలు ఇంట్లో వంటే చేయనని అంటోంది... ఎన్నిసార్లు ఇంటికి వచ్చి, కావలసిన వంటకాలు తయారు చేయించుకుని మరీ తిన్నారో వీళ్ళు. అన్నం పెట్టి దెప్పకూడదు కానీ ఇదేమిటి? మరీ ఇలాగా? వెనకాల ఇలా ఇంత అసహ్యంగా ప్రచారం చేస్తుందని ఊహించలేదు ఎప్పుడూ..." వెక్కివెక్కి ఏడవసాగింది, వసుధ.

"ఆరోజు మీరిద్దరూ మా ఇంటికి వచ్చి చెబుతుంటే, ఆ పిల్లల స్నేహం నాకు దొరికిందని మీరిద్దరూ నామీద అసూయ పడుతున్నారనుకుని అపార్థం చేసుకున్నాను. నిజానిజాలు తెలుసుకునే ప్రయత్నం చేయలేదు. ఆ కోమలి కోసం ఎంత శ్రమపడ్డాను? ఎంతగా తపించాను? ఛ! మోసపోవటం అనేది, ఎంత బాధాకరం! పారూ, జానూ... ముందుగా నా అజ్ఞానానికి మనస్ఫూర్తిగా నన్ను క్షమించండి. మీరు నా మంచికోరి చెప్పినా నేను వినకపోవటం చాలా అపరాధం." గిల్టీగా అన్నది, వసుధ.

"ఛఛ! మనలో మనకి క్షమాపణలు ఏమిటి వసూ? అమాయకంగా నువ్వు నమ్మి బలి అయిపోయావని మా బాధ... అంతే! ఇప్పుడైనా ఫరవాలేదు. ఆమె అసలురూపం తెలిసింది కదా, ఇక దూరం పెట్టేయి. ఆమెకు నీ ప్రేమను పొందే అర్హత లేదు. అపాత్రదానం కూడా మహాపరాధమే కదా వసూ!" అంది జానకి, మెల్లగా ఆమె వీపు నిమురుతూ.

"నిజం జానూ... నాకిప్పుడు ఏం చేయాలో బాగా అర్థమైంది..." అంటూ కళ్ళు తుడుచుకుంది, వసుధ.

"దట్స్ గుడ్ వసూ... నువ్వు విజ్ఞురాలివి. కొంచెం వివేకంగా ఉండు... మాయతెరలు తొలగిపోయాయి కనుక కోమలిని ఎలా డీల్ చేయాలో నీకు తెలుసు. కానీ జాగ్రత్తగా వ్యవహరించు. అలాంటి మనుషులతో చాలా జాగ్రత్తగా ఉండాలి." చెప్పింది, పార్వతి.

సరేనన్నట్టు పార్వతి చేయి నొక్కింది, వసుధ.

★★★

రెండురోజుల తరువాత,

తన చెలులతో వసుధ ఇంటికి వచ్చిన కోమలి ఆశ్చర్యపోయింది.

"అమ్మా! కాలేజీకి రావటంలేదేం? ఇంకా మీకు జ్వరం తగ్గలేదా? ఇవన్నీ ఏమిటి?" ప్యాక్ చేసి ఉన్న సూట్‌కేసుల వైపు చూస్తూ అన్నది కోమలి.

"లాంగ్ లీవ్ పెట్టాను. జర్మనీ వెళుతున్నాను. రాత్రికే నా ఫ్లైట్..." తాపీగా చెప్పింది వసుధ.

"అదేమిటి, ఇదివరలో అనుకోలేదు కదా... నాన్నగారే వచ్చేస్తారని అన్నారుగా... ఈ ఆకస్మిక ప్రయాణం ఏమిటి, మా పరీక్షల ముందు?"

"బావుంది కోమలీ, పరీక్షలు మీకు కానీ నాకు కాదు కదా... బాగా ప్రిపేర్ అయి రాయండి." ముక్తసరిగా అంది. వసుధా.

"అదేమిటమ్మా అలా అంటారు? మీరు నోట్స్ ఇవ్వకుండా ఎప్పుడైనా మేము పరీక్షలు వ్రాసామా?" గోముగా అన్నది కోమలి.

"నాకంత ఓపిక లేదమ్మా. అయినా అక్కడొకటీ, ఇక్కడొకటీ కాపీలు చేసే కదా నేను నోట్స్ ప్రిపేర్ చేసేది, ఆ మాత్రం మీరే చేసుకోగలరు..."

కోమలి ముఖం వెల్లవేసినట్టు తెల్లగా పాలిపోయింది. తానన్న మాటలు యథాతథంగా వసుధకు చేరిపోయాయని అర్థం అయింది.

"మీ మనసును ఎవరో బాగా పాడుచేసారమ్మా..." బలవంతంగా గొంతులోకి ఏడుపు తెచ్చుకుంటూ అన్నది.

"ఎవ్వరూ పాడుచేయలేదు కోమలీ.. నాకు నేనే పాడు చేసుకున్నాను. నీ ప్రేమను నిజమని నమ్మాను. నా వెనకాల ఇలాంటి కథలు ప్రచారం చేస్తున్నట్టు అర్థం చేసుకోలేకపోయాను. 'కంఫర్టబుల్‌గా ఉంటాయమ్మా!' అని నువ్వు డ్రెస్‌లు తెచ్చిస్తే వేసుకున్నాను. వయసు తగ్గించుకోవాలని చూడలేదు. 'మనం కలిసి భోజనం చేద్దామమ్మా...' అని ఆప్యాయంగా పిలిస్తే నిజమనుకున్నాను. నీకు నా బిల్లు భారమౌతుందని అనుకోలేదు. పైగా ఎప్పుడూ మీరు నన్ను బిల్లుకు డబ్బు పెట్టనివ్వలేదు. నేనసలు ఇంట్లో వంటే చేయనని కదా అన్నావు! లొట్టలేసుకుంటూ తిన్న వంటకాల రుచిని మరచిపోయావా కోమలీ?

గిల్టునగలు కొనేది, పెళ్ళిళ్ళకూ, ఫంక్షన్లకూ అసలేమీ వేసుకోకపోతే బాగుండదని మాత్రమే. బంగారునగలు లేక కాదు. ఒంటరిగా ఉంటున్నాను కాబట్టి బ్యాంకు లాకర్లో దాచుకున్న బంగారునగలను, రిస్క్ అని ఇంటికి తీసుకురావటం లేదంతే. మీరు వయసులో ఉన్న అమ్మాయిలు. మీతో నాకు పోటీ ఏమిటమ్మా? నా వయసుకు తగ్గట్టే నేను ఉన్నాను తప్ప మీతో పోటీ పడాలని, మీలాగా ఉండాలని ఎప్పుడూ అనుకోలేదు. మీ ఆప్యాయత నిజమని నమ్మాను. మీ అవసరానికి మీరు నన్ను ఉపయోగించుకున్నారని తెలిసాక, నా అజ్ఞానానికి, అమాయకత్వానికి నా మీద నాకే జాలివేసింది. మిమ్మల్ని నమ్మినందుకు నన్ను నేను శపించుకున్నాను. చాలమ్మా... మంచితనంతో ఇలా వంచించవచ్చని చక్కగా ఋజువు చేసావు. సంతోషం. రేపు నిజమైన ఆత్మీయులను సైతం అనుమానించేలా నన్ను తయారుచేసావు. ఏది ఏమైనా, ఇది నాకు చక్కని గుణపాఠం. ఇక ఆపేయండి. చాలమ్మా, ఈ నాటకాలు!! ఇక మీరు వెళ్ళండి, నాకు చాలా పని ఉంది..." తర్జనితో గుమ్మం వైపు చూపించింది వసుధ.

ఉడుకుతున్న అగ్నిపర్వతంలా ఉన్న ఆమెను చూసి, భయంతో వణికిపోతూ, బయటకు నడిచారు కోమలి అండ్ బృందం.

తలుపుమూసి, నిస్త్రాణగా కూర్చుండిపోయింది, వసుధ. కాసేపటి తరువాత తనను తాను సంబాళించుకుంటూ, లేచి, బ్యాగ్‌లో తన మందులు, కావలసిన వస్తువులు సర్దుకోవటంలో మునిగిపోయింది. ఆమె మనసు తుఫాను తరువాతి కడలిలా ప్రశాంతంగా మారిపోయింది.

# అడవి

**అవసరాల వెంకటరావు**
✆ 9989976688



స్టేట్ బ్యాంక్‌లో పనిచేసి పదవీ విరమణ చేసిన వెంకటరావుగారు మంచి రంగస్థల నటులు, ప్రయోక్త. కథామంజరి ఆలోచన ఈయనదే! ప్రచురణకర్తగా బాధ్యత స్వీకరించి.. అప్పుడప్పుడు కలం పట్టుకుని అడపాదడపా కథలు వ్రాస్తున్నారు.

> ***“నీకు తెలియనివి ఏమున్నాయి మూర్తీ... తోటివారికి సేవ చేయడం, ఆర్తులని ఆదరించడం, సమాజానికి మంచి చేయడం... ఇందులో నీకు తెలియనివి ఏమున్నాయి? ‘మానవ సేవే మాధవ సేవ’ అని చిన్నతనంనుండి చదువుకుంటున్నాం కదా! నీకే కాదు, ఇవి అందరికీ తెలిసినవే. కానీ చాలామంది వీటిపై మనసు పెట్టరు, ఆచరించరు.”***

‘వినా వేంకటేశం ననాథో ననాథః సదా వేంకటేశం స్మరామి స్మరామి’

తిరుమల మూలమూలలా వేంకటేశనామం మంద్రంగా, మధురంగా ప్రతిధ్వనిస్తోంది. భక్తులు భక్తిపారవశ్యంతో గోవిందనామాన్ని జపిస్తున్నారు. కలియుగదైవం కొలువై ఉన్న కలియుగవైకుంఠం ఆధ్యాత్మికతకి పట్టుగొమ్మగా వెలిగిపోతోంది. కోరిక తీర్చమని కొంతమంది, కోరిక తీరిందని కొంతమంది శ్రీవారిదర్శనం చేసుకుని వెళ్తున్నారు. ఏ కోరికాలేని భక్తుడ్ని చూడాలన్న శ్రీవారి కోరిక మాత్రం తీరడం లేదు.

అది పాపవినాశం నుండి బయలుదేరిన రహదారి! అటు, ఇటు శేషాచలం అడవుల మధ్య మెలికలు తిరుగుతూ పోతున్న దారి! అక్కడ సంచారమే లేదు. స్వామిదర్శనం చేసుకున్న వారిలో దాదాపు పదోవంతు భక్తులు పాపవినాశనం దర్శిస్తారు. ఈ జలధారలో స్నానం... సకల పాపవినాశనం అని నమ్మిక! అది పూర్తిచేసుకున్న భక్తులు తిరిగి తిరుమలకి వెళ్ళడమే కాని, ముందుకు వెళ్ళరు.

మెలికలు తిరిగిన పాములాంటి ఆ రహదారిలో, ఓ నల్లటి త్రాచులాంటి కారు! మధ్యాహ్నసూర్యుడి మల్లెపూవు ఛాయలో ఆ కారు మరింత మెరుస్తూ సాగిపోతోంది. అందులో అంతకంటే నల్లగా ఉన్న మూర్తి, బావమరిది సుందరం, డ్రైవరు సింహాచలం... ఒకరితో ఒకరు మాట్లాడుకోకుండా ప్రయాణం చేస్తున్నారు. మూర్తిని మాట్లాడించడానికి సుందరం అప్పటికే చాలాసార్లు ప్రయత్నించాడు.

“ఇటెందుకు బావా? ఇదంతా అడవే! నీకు నచ్చదు కదా?”

మూర్తి మౌనం. కనుతిప్పి కూడా చూడలేదు.

"అడవి బాగుంటది కదండీ" తల తిప్పకుండా డ్రైవరు సింహాచలం అన్న మాటలకి...

సుందరం నవ్వి, "అది అందరికీని. మా బావ అడవి మర్డర్ చేయడానికి మంచిచోటంటాడు. బావతో అడవిలోకి వెళ్తావా?"

సింహాచలం మారుమాట్లాడలేదు.

ఎప్పుడూలేనిది మూర్తి చిన్నగా నవ్వి, "ఎందుకోరా... ప్రశాంతంగా అడవిలోకి వెళ్లాలనిపిస్తోంది. ఓసారి చూద్దాం!"



కారు చిన్నమలుపు తిరిగి ముందుకు వెళ్లబోతుంటే.. "ఇక్కడ ఆపరా! మీరు ఇక్కడే ఉండండి, నేను లోపలకి పోయి వస్తాను." మూర్తి కారు దిగి వెళ్లబోతుంటే, "ఒక్కడివీ ఎందుకు బావా, నేనూ వస్తాను" సుందరం అనుసరించబోయాడు. "వద్దన్నాను కదా. ఇక్కడే ఉండు" స్థిరంగా చెప్పాడు మూర్తి.

కారు దిగబోతున్న సుందరం కాలు లోపలకి తీసేసుకున్నాడు. లేకపోతే ఏం జరుగుతుందో సుందరానికి బాగా తెలుసు.

కిందకి దిగిన మూర్తి అడవిలోకి ప్రవేశించాడు. సుందరం, సింహాచలం ఏం చేయాలో తెలియని అయోమయ స్థితిలో ఉన్నారు.

మూర్తి వెళ్ళినవైపే తదేకంగా చూస్తూ సుందరం అన్నాడు "నాలుగురోజులనుంచి బావ కొత్తగా ఉన్నాడ్రా! అస్సలు అర్థం అవడం లేదు."

"అవునండి. ఆ కుక్క చచ్చిపోవడంనించి..."

"కుక్క చచ్చిపోవడం ఏమిటి?"

"అవునండి. నాలుగురోజుల క్రితం మూడో ఆవిడ ఇంటినుంచి వస్తుంటే, ఈయన్ని చూసి ఓ వీధికుక్క అరిచిందండి. ఈయనకి కోపం వచ్చి దాని కడుపుమీద తన్నారు. అప్పుడే పిల్లల్ని కన్న కుక్క... ఆ తాపుకి తట్టుకోలేక చచ్చిపోయిందండి. అది అలా చచ్చిపడి ఉంటే, పిల్లలన్నీ పాల కోసం పొదుగు మీద పడ్డాయండి. ఎందుకో ఈయన చాలాసేపు వాటికేసే చూస్తూ ఉండిపోయారండి!"

"మనుషులు చస్తూంటేనే చూసి ఆనందిస్తాడు, కుక్క చచ్చిపోతే బాధపడతాడా? అబ్బే! ఇంకోటేదో ఉందిరా!"

"ఏమోనండి!"

"బావ ఇంటి బయటకు వస్తే నీతోనే ఉంటాడు. నువ్వు 'ఏమో' అంటే ఎలాగరా!"

"ఏమో... అవునండీ. రెండు మూడు రోజులనించీ ఎవరో పిలుస్తున్నట్టు ఉందిరా అనేవారు. కొంపదీసి చేతబడి లాంటిది అంటారా?"

"అమ్మో!" భయపడ్డాడు సుందరం.

★★★

మూర్తి అడవిలో నడుస్తున్నాడు. అతని మనస్సు అంతకు ముందెన్నడూ లేనంత ప్రశాంతంగా ఉంది. చుట్టూ నలుగురు కత్తులు పట్టుకు కాపలా ఉన్నా, అత్యంత అప్రమత్తంగా ఉండే మూర్తి... చూపు మరల్చకుండా, నిర్భయంగా రోజూ వెళ్ళే దారిలో నడుస్తున్నట్టు స్థిరంగా నడిచి వెళ్లిపోతున్నాడు.

అడవి లోపలకి వెళ్లిపోతున్నాడు మూర్తి. వాతావరణం చాలా ప్రశాంతంగా ఉంది. భయం కల్పించేంత నిశ్శబ్దం. గాలి, వెలుతురు ఆ చెట్ల మధ్యకి రాలేకపోతున్నాయి. సన్నటివెలుగులో కాలిబాట కూడా లేని ఆ ప్రదేశంలో చిన్నమొక్కలు, తుప్పలు, పొదల మధ్యనుండి అలవాటైన దారిలో నడిచినట్టు సాగిపోతున్నాడు మూర్తి! నడిచి, నడిచి ఓ ప్రదేశం చేరుకున్నాడు. అక్కడ గాలి చిన్నగా వీస్తోంది. పువ్వుల సుగంధం, పక్షుల కిలకిలలు ఆ ప్రదేశాన్ని ఆహ్లాదకరంగా మారుస్తున్నాయి. బాగా వయసుమీరిన చెట్లు, విస్తారంగా వ్యాపించి మనోహరంగా ఉన్నాయి. ఏదో తెలియని ఒక శబ్దం మంద్రంగా వినిపిస్తోంది. ఆ తేడాని కూడా పట్టించుకునే స్థితిలో లేడు మూర్తి.

స్థిరంగా నడుచుకుంటూ ఒక చెట్టు కిందకు చేరి, సాష్టాంగం చేసి "నమస్కారం స్వామీ!" అన్నాడు మోకాళ్ళ మీద కూర్చుంటూ.

"నేను నీకు పూర్తిగా కనబడుతున్నానా?" అడిగాడు ఎదురుగా చెట్టుకింద పద్మాసనంలో ఉన్న దిగంబర స్వామి. ఆయన బక్కచిక్కి, జడలు కట్టిన జుట్టుతో సూర్యుడులా వెలిగిపోతున్నాడు. ఆ వెలుగు వెన్నెలలా ప్రశాంతంగా ఉంది. ఆ గొంతు వీణ మీటినట్టు ఆహ్లాదాన్ని అందిస్తోంది.

"అవును స్వామీ... కనబడుతున్నారు." అన్నాడు మూర్తి ఆ మూర్తిని తదేకంగా చూస్తూ.

"అవునా? ఇంకా ఎవరైనా కనబడుతున్నారా?" అడిగాడు జటాధారి.

"లేదు స్వామీ. మీరు తప్ప ఎవరూ కనబడటం లేదు!" వినయంగా చెప్పాడు మూర్తి.

తన మాటలోనూ, చేతలోనూ చేరిన మర్యాద, అణకువలని మూర్తి గుర్తించనేలేదు. ఇవి మునుపెన్నడూ లేని లక్షణాలు!

"శుభం. అయితే గురువాజ్ఞ నీ గురించే! చెప్పు మూర్తీ... నువ్వేం సంపాదించుకున్నావు?"

"నా పేరు మీకెలా తెలిసింది స్వామీ?"

స్వామి చిరునవ్వు. "చెప్పు నువ్వేం సంపాదించుకున్నావు?"

"బాగానే సంపాదించా స్వామీ... మా ఊళ్ళో సగానికి పైగా ఆస్తులు..." కొంచెం గర్వంగా చెప్పకోబోయాడు మూర్తి.

"అవి కాదు... పైకి వెళ్ళడానికి ఏం సంపాదించుకున్నావు?"

"అంటే?"

"చనిపోతే... కూడా వచ్చేవి?"

"అంటే... నేను చనిపోతానా?"

"ఎవరు చనిపోరు? అందరూ పోతారు, ఎక్కువమంది మళ్ళీ వస్తారు."

మూర్తి నివ్వెరబోయాడు. తన చావు గురించి అతను ఇంత దగ్గిరగా ఎప్పుడూ ఆలోచించలేదు. 'అవును. ఏం సంపాదించుకున్నాను?' ఆలోచనలో పడ్డాడు.

"ఏం మూర్తీ... సంపాదన కనబడ్డంలేదా? సరేలే... ఇక మొదలుపెట్టు. సరేనా?" అన్నాడు స్వామి.

మూర్తికి ఎక్కడలేని కంగారు, భయం వచ్చాయి. 'మనుషుల్ని బెదిరించో, చంపో వాళ్ళ ఆస్తులు ఆక్రమించడం తెలుసుగాని, ఇదేమిటి... ఈ సంపాదన ఎలాగా?'

తాను ఒంటరైనట్టు, తనుచేసిన పాపాలు తనను చుట్టుముట్టినట్టు... మూర్తి పూర్తిగా క్రుంగిపోయాడు. ఇంతవరకూ ఎదుటివారి కళ్ళలో భయం చూసిన మూర్తి కళ్ళల్లో తీవ్రమైన భయం. ఒక్కసారిగా స్వామి ఎదుట కూలబడ్డాడు. తనకి మార్గదర్శనం చేయమని, తనకున్న సందేహాలు నివృత్తి చేయమని వేడుకున్నాడు.

కరుణించిన స్వామి, “కంగారు పడకు మూర్తీ... ఈ పరిస్థితి దాదాపు ప్రతివారి జీవితంలోనూ వస్తుంది. నువ్వు ముందు ప్రశాంతంగా ఉండు. నీ సందేహాలు ఏమిటో చెప్పు!” అన్నాడు.

“నాకు ఈ విషయం ఎందుకు చెబుతున్నారు? ఎంతోమంది రోజూ వెళ్లిపోతున్నారు కదా!”

“అవును. నీకు పూర్వజన్మలో మా గురువుగారితో బాంధవ్యం ఉంది. ఆ వాత్సల్యం వల్లనే ఆయన నిన్ను హెచ్చరిస్తున్నారు.”

“ఎవరు ఆయన? ఎక్కడ ఉంటారు?”

స్వామి చిరునవ్వు.

“ఇక నేను ఎన్ని రోజులు బ్రతుకుతాను?”

స్వామి చిరునవ్వు.

“ఇంతమందిని చంపినందువల్లా, వాళ్ళ ఆస్తుల్ని తీసేసుకున్నందువల్లే తొందరగా చనిపోతున్నానా?”

మరోసారి స్వామి చిరునవ్వు నవ్వి... “మూర్తీ... ఇక నీ ఆలోచనల్ని ఇహం వైపు నుండి పరం వైపు మార్చు! గతాన్ని నువ్వు మార్చలేవు. జరగాల్సినది ఆలోచించు!”

మూర్తి ఒక్కసారి నివ్వెరబోయాడు. జీవితంలో తనకు అస్సలు పరిచయం లేని కొత్తకోణం! పుణ్యం, పాపం, మరణం, పరం... ఎలా స్పందించాలో కూడా తెలియని స్థితి. అదే స్వామికి నివేదించాడు.

స్వామి జాలిగా చూసి, “అందుకే మన జీవనవిధానంలో బాల్యంనుండీ భక్తిని, వైరాగ్యాన్ని కూడా కలిపారు. వాటిని కూడా అనుసరించిన వారికి చివరిదశలో ఇంత కలవరం ఉండదు.”

మూర్తి తలపంకించి, “దయచేసి నాకు మార్గదర్శనం చేయండి. నేను చేయవలసిన పనులు తెలియజేయండి.” అన్నాడు.

“నీకు తెలియనివి ఏమున్నాయి మూర్తీ... తోటివారికి సేవ చేయడం, ఆర్తులని ఆదరించడం, సమాజానికి మంచి చేయడం... ఇందులో నీకు తెలియనివి ఏమున్నాయి? ‘మానవ సేవే మాధవ సేవ’ అని చిన్నతనం నుండి చదువుకుంటున్నాం కదా! నీకేకాదు, ఇవి అందరికీ తెలిసినవే. కానీ చాలామంది వీటిపై మనసు పెట్టరు, ఆచరించరు.”

“పోనీ నావాళ్ళు... వాళ్ళ పుణ్యాన్ని నాకు దానం చేయవచ్చా?”

“పుణ్యం వేరు, పాపం వేరు. అయినా నీవాళ్ళు ఎవరున్నారు మూర్తీ?! నువ్వు పెట్టే కష్టాలు తట్టుకోలేక నీ భార్యే నీ మరణం కోసం ఎదురుచూస్తోంది. నువ్వు కుడిభుజం అనుకున్న నీ సుందరం అదను కోసం ఎదురు చూస్తున్నాడు. ఇప్పుడు అతను నిన్ను పరిమార్చే ఉద్దేశ్యంతోనే వస్తున్నాడు.”

“అవునా!”

“అవును... మరి నీకు చెల్లెలు వరసయిన అతని భార్య పట్ల అసభ్యంగా ప్రవర్తించావు.”

మూర్తి తల దించుకున్నాడు.

“నువ్వే కాదు మూర్తీ... చాలామందిలో ఈ చీకటి కోణం ఉంటుంది. భక్తి, పాపభీతి లాంటివి... ఈ చీకటి చోటుల్లోకి కొంచెం కాంతిని చేరుస్తాయి. మనిషిని మృగంగా మారిపోకుండా కాపాడతాయి. కానీ రాను రాను మనం ఈ మంచికి దూరం అవుతున్నాం. వీటిని పాటించడం చాదస్తంగా, అసాంఘికంగా భావిస్తున్నాం. బ్రతుకుకోసం పరుగు పెడుతూ, మనకు తెలియకుండా ఆ బ్రతుకునే దూరం చేసుకుంటున్నాం! ఇప్పుడు నిన్ను మంచిపనులు చేసి పుణ్యం చేయమన్నది... నువ్వు పోగు చేసుకున్న పాపం హరించడానికి కాదు. అలా అవ్వదు కూడా! నీ తర్వాత నీ గురించి కొంచెమైనా మంచిగా మాట్లాడుకోవాలని. వెళ్ళు మూర్తీ... నీ చేతులో ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకో!”

స్వామి చెయ్యెత్తి ఆశీర్వదించాడు.

“ఏదైనా కావలిస్తే నేను మళ్ళీ రావచ్చా స్వామీ?”

జటధారి చిరునవ్వు నవ్వి “రావలసిన అవసరం ఉంటే వస్తావు, నీ అంతట నువ్వు రాలేవు. మంచిది మూర్తీ” అన్నాడు.

పరిస్థితి అవగతమౌతున్న మూర్తికి దూరంగా ‘బావా’ అని అరుచుకుంటూ, వెదుక్కుంటూ వస్తున్న సుందరం కనిపించాడు. సెలవు తీసుకోడానికి వెనుదిరిగిన అతనికి స్వామి కనిపించలేదు.

# రాణి

సూరంపూడి
✆ 9440139149

కథామంజరి బాల కథ



కథామంజరి చిత్రకారుడు, రచయిత. ఎప్పుడో వదిలిన వ్యంగ్య చిత్రకళని వెలికి తీసి, పదును పెట్టి, మార్పులు చేర్పులతో కథలను బొమ్మల్లో చూపిస్తున్న చిత్ర కథకుడు.

***తన గుహకు చేరుకున్న రాణి 'ఈ అడవి మాది' అనుకుంది. 'మేము ఇక్కడ స్వేచ్ఛగా తిరగాలి. మనుషులు వచ్చి మాకు ఇబ్బంది కలిగించకూడదు.'***

***కానీ దానికి వాస్తవాలు తెలుసు. మనుషులు సంఖ్యలో ఎక్కువ. వారి ఆయుధాలు శక్తివంతమైనవి. అడవి వైశాల్యం కూడా మనుషులలో స్వార్థం పెరుగుతున్న కొద్దీ క్రమంగా తగ్గిపోతోంది.. 'భవిష్యత్తు ఎలా ఉంటుందో చూడాలి' అని అనుకుంటూ తన పిల్లల దగ్గరగా ఒదిగింది.***

సూర్యుడు కొండల వెనుక నుండి బంగారు రంగులు వెదచల్లుతున్నాడు. అడవి ఇంకా నిద్రమత్తులోనే ఉంది. తన పిల్లలు గాఢ నిద్రలో ఉండగా రాణి గుహలోని చీకటి నుండి నెమ్మదిగా బయటకొచ్చింది. దాని కళ్ళు చీకటికి అలవాటు పడి, ప్రతి కదలికను పసిగట్టగలవు. దట్టమైన చెట్లు అడ్డంగా ఉన్న గుహలో, తన పిల్లలకి ఎటువంటి ప్రమాదం లేదని నిర్ధారించుని 'ఆహారం దొరికి, నేను ముందు కడుపు నింపుకుంటేనే కదా, నా పిల్లలకి పాలివ్వగలను' అనుకుంటూ దట్టమైన పొదల మధ్య నుంచి తన రాజ్యాన్ని పరికిస్తూ, నడవడం మొదలుపెట్టింది. అడవి, దాని రాజ్యం, చిట్టెలుకల కిచకిచలు, నెమలి అరుపులు, దూరంగా ఏనుగుల గర్జన... వెరసి ఒక అద్భుతమైన సంగీతం లాంటి ధ్వని వినిపిస్తోంది.

'హ్... మరో రోజు మొదలైంది' అనుకుని నడుస్తుండగా, మనుషులు నడిచిన కాలి గుర్తులు దాని కంటపడ్డాయి. అంటే "మనుషులు... మళ్ళీ వచ్చారన్నమాట! వాళ్ళు ఈ అడవిలోకి రాని రోజు ఉండదు" అని నిట్టూర్చింది. రాణికి మనుషులంటే భయం లేదు, కానీ ఒకరకమైన అయిష్టం మాత్రం ఉంది. ఎందుకంటే క్రూరత్వంతో నిండిన వాళ్ళ కళ్ళు, తీరని ఆకలితో ఉంటాయి. వచ్చి తమ పనులతో అడవి ప్రశాంతతకి అంతరాయం కలిగిస్తారు. అమాయక జంతువులని ఎంతో క్రూరంగా చంపుతారు. చెట్లను నరికేస్తారు, వారి కత్తులు చెట్ల హృదయాలకి గాయాలు చేస్తాయి, పచ్చని అడవిలో గాయాలను మిగిల్చి వెళ్తారు. వారి ఉనికి, అడవిపై నీడలా, దీర్ఘమైన నాశనానికి గుర్తులా ఉంటుంది.

★ ★ ★

సూర్యుడు పైపైకి వస్తున్నాడు. అడవి వేడెక్కుతోంది. ఎండ వేడి తాపం తగ్గించుకునేందుకు, రోజూ తను నీళ్ళు తాగే నీటిపాయలో చాలాసేపు కూర్చొంది. తరువాత రాణి ఒక దట్టమైన పొద నీడలో సేద తీర్చుకోవడం మొదలుపెట్టింది. దాని కళ్ళు సగం మూసుకున్నాయి, కానీ చెవులు మాత్రం చిన్న శబ్దానికి కూడా అప్రమత్తంగా ఉన్నాయి. దూరంగా ఒక మనిషి స్వరం వినబడి, క్రమంగా అది దగ్గరవుతోంది. రాణి తన శరీరాన్ని బిగించింది. ఒక ఇద్దరు మనుషులు మాట్లాడుకుంటూ, నడిచి వెళ్తున్నారు. ఒకడి చేతిలో ఒక పొడుగాటి సంచి ఉంది. 'పండ్లు, పుల్లలు ఏరుకోవడానికి వచ్చుంటారు' అనుకుంటూ పొద లోపలికి కొంచం జరిగింది. వాళ్ళు రాణి దాక్కున్న చోటుకు కొంచెం దూరం నుంచి వెళ్ళిపోయారు. రాణి ఊపిరి పీల్చుకుంది. 'వాళ్ళు వాళ్ళ దారిన వాళ్ళు పోతే నాకు ఎలాంటి ఇబ్బంది లేదు, కానీ వాళ్ళు నన్ను రెచ్చగొడితే మాత్రం...' దాని కళ్ళు మెరిసాయి.

ఇంతలొ పెద్ద శబ్దం, ఏదొ దూసుకెళ్ళినట్టు చుట్టు ప్రక్కల పొదలన్ని ఒక్కసారి కదిలిపోయాయి. తుపాకి శబ్దానికి కలవరపడిన రాణి ఒక్కసారి కోపముతో వెనక్కి తిరిగి చూస్తే.. ఇంతకు ముందు తనకు కనబడిన ఇద్దరు మనుషులు కనబడ్డారు. ఒకడి చేతిలో ఇంకా పొగ చిమ్ముతున్న తుపాకి కనబడింది. భయంకరంగా అరుస్తూ వాళ్ళమీదకి దూకింది. వాళ్ళు ప్రాణభయంతో పరుగులు తీస్తూంటే వెంటపడి ఒకడి వీపు మీద తన పంజాతో గీరి అక్కడే నిలబడింది. ఆ మనుషులు పెద్దగా కేకలు పెట్టుకుంటూ పారిపోయారు. ఈ మనుషులకి అడవి జంతువులంటే ఎంత లోకువ అని అసహ్యించుకుంటూ వెనక్కి తిరిగింది.



★ ★ ★

సూర్యుడు పడమర దిక్కున ఎర్రటి రంగులు పూస్తున్నాడు. ఒక దుప్పి దొరికింది. రాణి కడుపు నింపుకుంది. ఇప్పుడు అది నెమ్మదిగా పొదలమాటున అడుగులో అడుగులు వేస్తూ, తన గుహ వైపు నడవడం మొదలుపెట్టింది. నెమ్మదిగా చీకట్లు ముసురుకుంటున్నాయి. రాణికి వేటగాళ్లంటే చాలా కోపం. వాళ్ళు తనలాగా కాదు. తను ఆకలయినప్పుడు మాత్రమే వేటాడుతుంది. వాళ్ళు అవసరమున్నా

లేకపోయినా.. కేవలం సరదా కోసం, స్వార్థం కోసం అమాయక జంతువులను చంపుతారు. సూర్యుడు పూర్తిగా అస్తమించాడు. అడవిలో చీకటి చిక్కపడింది. నెమ్మదిగా నడుస్తున్న రాణి మళ్ళీ గతంలోకి జారుకుంది.

ఒక రోజు రాత్రి రాణి ఒక మానవ శిబిరాన్ని చూసింది. ఒక నిప్పు మండుతోంది, దాని చుట్టూ గుమిగూడిన వారిలో ఒకరు తుపాకీని ఎత్తి పక్కనున్న చెట్టు కొమ్మలలోకి పేల్చాడు. భయంతో కేకలు వేస్తూ ఒక కోతి కొమ్మల నుండి కింద పడింది. గిలగిలా కొట్టుకుంటూ చావుకు దగ్గరై బాధతో అరుస్తున్న ఆ కోతిని చూసి, వాళ్ళు వికృతంగా నవ్వుతూ ఆనందించడం చూసి దాని హృదయం భగ్గుమంది. ఈ మానవులు, ఆక్రమణదారులు, మరో జీవి ప్రాణం మీద గౌరవం లేదు. అడవి సున్నితమైన సమతుల్యతను అర్థం చేసుకోరు అని కోపంతో తన రాజ్యాన్ని రక్షించుకోవాలని, మరుసటి రోజు, తన యుద్ధాన్ని ప్రారంభించింది. అది వారి శిబిరంలో సామాగ్రిని చెల్లాచెదురు చేసింది. రాణి ఉనికిని గమనించిన మనుషులు పారిపోయారు. కానీ మనుషులు దుర్మార్గమైన సహనశీలులు. రాణిని పట్టుకొవడానికి వాళ్ళు ఉచ్చులు పెట్టారు, రక్తం వాసనతో విషం పూసిన ఎరలని పెట్టారు, పట్టుకోవాలని ఆశించారు., కనీసం బలహీనపరచాలని అనుకున్నారు. ఎప్పుడూ అప్రమత్తంగా ఉండే రాణి వాళ్ళ ఉచ్చుల నుండి తప్పించుకుంది. దాని ఇంద్రియాలు గాలిని చదవడం, మనుషుల కదలికలను అంచనా వేయడంలాంటి వాటిలో ఆరితేరాయి. రాణి మనుషులకి కనపడకుండా నీడలా వారిని గమనించడం నేర్చుకుంది.

తన గుహకు చేరుకున్న రాణి ‘ఈ అడవి మాది’ అనుకుంది. ‘మేము ఇక్కడ స్వేచ్ఛగా తిరగాలి. మనుషులు వచ్చి మాకు ఇబ్బంది కలిగించకూడదు.’

కానీ దానికి వాస్తవాలు తెలుసు. మనుషులు సంఖ్యలో ఎక్కువ. వారి ఆయుధాలు శక్తివంతమైనవి. అడవి వైశాల్యం కూడా మనుషులలో స్వార్థం పెరుగుతున్న కొద్దీ క్రమంగా తగ్గిపోతోంది.. ‘భవిష్యత్తు ఎలా ఉంటుందో చూడాలి’ అని అనుకుంటూ తన పిల్లల దగ్గరగా ఒదిగింది.

ప్రతిరోజు తెల్లవారుజాము నుండి చీకటి పడే వరకు అడవిలో తిరిగే రాణి మనసులో, మనుషుల గురించి ఎన్నో ఆలోచనలు మెదులుతాయి, వాటిలో కోపం, భయం, అయిష్టం, ఆందోళన, జాలితో కూడినవెన్నో! అడవికి రాణి అయిన పులి కూడా మనుషుల ఉనికిని పట్టించుకోకుండా ఉండలేదు. వారి రాకపోకలు దాని దినచర్యను, ఆలోచనలను ప్రభావితం చేస్తూనే ఉంటాయి.



కథామంజరి బాల కథ

# సంకల్పం


సరస్వతి కరవది

✆ 9849530000


రచయిత్రి, కథామంజరి గళాకారిణి. సంగీతం, సాహిత్యం, నృత్యం, అభినయం, చిత్రలేఖనం .. ఇంకా ఇంకా వాటిల్లో ఆరితేరిన విదుషీమణి. కథామంజరి ప్రయత్నాలకి నిరంతర అనుయాయి.

***"అమ్మా, నాన్నా నన్నసలు చదివేవా లేదా అని కూడా అడిగేవాళ్ళు కాదు. ముఖ్యంగా నాన్న, అమ్మ నా గదిలోకి వచ్చినా వాడిని చదువుకోనీ. ఊరికే వాడితో ముచ్చట్లు పెట్టుకోకు అని అమ్మని కోప్పడేవారు. హాయిగా ఫోన్‌లో మ్యాచ్‌లు చూసినంతసేపు చూసి నిద్రపోయేవాడిని. పుస్తకం ముట్టుకోలేదు!"***

"బాబాయ్, ఎప్పుడొచ్చావు?" వెంకట్రావుని చూస్తూనే చాటంత మొహంతో స్కూల్ బాగ్‌ని హాలులో ఉన్న టేబుల్ పైకి విసిరి వెళ్లి సోఫాలో ఉన్న వెంకట్రావు పక్కనే కూర్చున్నాడు రాజేష్

"వచ్చి ఎంతో సేపు కాలేదు కానీ, రోజూ ఈ సమయానికేనా ఇంటికి వచ్చేది?" వాడివంక ఆప్యాయంగా చూస్తూ అడిగాడు వెంకట్రావ్.

ఔనన్నట్లు తలాడిస్తూ "ఏం చేద్దాం? పదో తరగతని తోమి పడేస్తున్నారు స్కూల్‌లో" రాజేష్‌గొంతులో విసుగు. అప్పుడే సునీత లోపలనించి మంచినీళ్లు తెచ్చింది కొడుకు కోసం. వాడు తాగే వరకూ అక్కడే నిల్చుని గ్లాస్‌అందుకుంటూ "రాజా.. చేగోడీలు చేశా ఇప్పుడే, ఇద్దరూ తింటారా?" అంటూ అడిగింది.

"ఆకలేస్తోందమ్మా.. త్వరగా ఆ చేసినవేవో పెట్టేస్తే తినేసి చదూకోవాలి మళ్ళీ. రేపో స్లిప్‌టెస్ట్‌ఉంది!" అన్నాడు రాజేష్.

"తెచ్చేస్తున్నారా నాన్నా... ఈ లోగా ఫ్రెష్‌అవ్వు!" లోపలకు వెళ్తూ అంది సునీత.

ఆమె అటు వెళ్ళగానే లేవబోతున్న వాడల్లా మళ్ళీ సోఫాలో కూలబడి, టీవీ రిమోట్‌అందుకుంటూ "ఊ, ఇంకేంటి బాబాయ్‌సంగతులు. బామ్మెలా ఉంది? నీతో రాలేదే?" అన్నాడు రాజేష్. అతని చేతులు నిర్విరామంగా టీవీ ఛానెళ్ళు మారుస్తూనే ఉన్నాయి.

"అదేమిట్రా ఏమీ తెలియనట్లు అడుగుతావు? మీ నాన్నేగా నాకు ఫోన్‌చేసి "అమ్మని రాజేష్‌పరీక్షలయ్యే వరకూ కాస్త నీ దగ్గరే ఉంచుకోరా... ఇక్కడుంటే ఆవిడతో పాటు కలిసి తెలుగు సీరియల్స్‌చూస్తున్నాడు వీడు. అసలే టెన్త్. పరీక్షల్లో మంచి మార్క్సురావాలి అన్నాడుగా" బాబాయి మాటలు విని..

'అలాగా' అన్నట్లు చూసాడు రాజేష్. అయితే ఆ విషయానికి ఆట్టే ప్రాముఖ్యత నివ్వలేదు.

"పోయినసారి వచ్చినప్పుడు మీ వూళ్ళో స్పోర్ట్స్ చానెల్స్ రావట్లేదు కదా... ఇప్పుడొస్తున్నాయా?"

"వస్తున్నాయిరా. పాపం నువ్వు ఈ ఏడాది టీవీ చూడట్లేదేమో! టెన్త్ కదా... పరీక్షలవగానే మా ఊరికొచ్చేయి సెలవులకి." వెంకట్రావు అన్నాడు.

"లేదులే బాబాయ్. మీ వూళ్ళో ఎండలు. నా రూంలో ఏసీ ఉంది కదా. హాయిగా ఉంటుంది." కాస్త గొప్పగా అన్నాడు.



వెంకట్రావుకి తెలియకుండానే కనుబొమలు పైకి లేచాయి. అయితే అన్నయ్య అర్జెంట్గా యాభైవేలు పంపరా అంది దీని కోసమా?

"రా బాబాయ్, నా గది చూద్దుగాని."

సరిగ్గా పెద్ద ప్లేటులో చేగోడీలు, కప్లో కాంప్లాన్ తీసుకుని వచ్చింది సునీత, "ఇవి ఇద్దరూ తినండబ్బాయ్. నీకు ఇవి అయ్యాక కాఫీ తెస్తా రాజా" చెయ్యి ముందుకు చాచింది సునీత. అది గమనించనట్లే గదిలోకి వెళ్ళిపోయాడు రాజా.

వెంకట్రావు నొచ్చుకుంటూ, "ఇలా ఇయ్యి వదినా... నేను పట్టుకెళ్తాలే" అని ఆ పళ్ళాన్ని తీసుకున్నాడు.

అతనికి పళ్ళాన్నందించి, మొహం మీంచి ధారాపాతంగా కారుతున్న చెమటలని తుడుచుకుంటూ, "ఈ ఏడు ఎండలు మరీ ఎక్కువగా ఉన్నయబ్బాయ్. కాసేపు పడుకుంటా. మళ్ళీ మీ అన్నయ్య వస్తే కాఫీ ఇవ్వాలి" అంటూ తమ రూమ్వైపు వెళ్ళబోయింది సునీత.

"కాసేపు వాడి గదిలో పడుకో వదినా, హాయిగా ఉంటుంది కదా..."అన్నాడు వెంకట్రావు

"అమ్మో వాడు చదువుకోవాలి. ఆ గదిలోకి మటుకు నువ్వెళ్ళకు! అని వార్నింగ్ ఇచ్చారయ్యా మీ అన్నయ్య!" నవ్వుతూ అంటూ సునీత తమ గదిలోకి వెళ్ళిపోయింది.

ఓసారి భుజాలెగరేసి రాజేష్రూంలోకి వెళ్ళాడు. వెళ్ళగానే లోపల ఏసీ చల్లదనము ముఖానికి తాకింది. ఓ పక్క రీడింగ్ టేబుల్, చైర్, మరోపక్క కొత్త మంచం పరుపు, మరో కుర్చీ, గోడలకు ప్రకాశవంతమైన రంగులు, కంటి కిబ్బంది కలగని లైట్లు... ఒక్కసారిగా వేరే లోకంలోకి అడుగుపెట్టినట్లుంది వెంకట్రావుకి. ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోయాడు.

"ఇవన్నీ టెన్త్కు వచ్చానని నాన్న చేయించిన ఏర్పాట్లు. బాగా చదువుకోవాలని" గర్వంగా చెప్పాడు రాజేష్.

"గుడ్. బాగా చదువుతున్నావా మరి?"

"బ్రహ్మాండంగా. అన్ని వసతులతో ఓ ప్రత్యేకమైన గది. చిటికేస్తే చాలు ఏవి కావాలంటే అవి అందించే అమ్మ, నేను గదిలోకి వచ్చాక అస్సలు డిస్టర్బ్ చెయ్యని నాన్న... ఇంకేం కావాలి బాబాయ్ చదువుకోవటానికి!" రీడింగ్ చైర్ వెనక్కి వాలి కూర్చుని ఫోన్ చూస్తూ విలాసంగా ఊగుతూ అడిగాడు రాజేష్.

ఔనన్నట్లు తలూపి," స్లిప్టెస్ట్ అని ఫోన్ చూస్తున్నావు! ఇదేనా చదువు?" ఓ చురకేసి హాల్లోకి కదిలాడు వెంకట్రావు.

గతుక్కుమని ఫోన్ పక్కన పడేసి పుస్తకం తీశాడు రాజేష్. అమ్మో, బాబాయ్తో డేంజర్!

★★★

చీకటిగా ఉన్న ఆ గదిలోకి అడుగుపెడుతూ లైట్ స్విచ్ వేసాడు వెంకట్రావు. గదిలొ మంచం మీద ముఖానికి చెయ్యి అడ్డంగా పెట్టుకుని పడుకుని ఉన్న రాజేష్"ఎవరదీ?" బిగ్గరగా అన్నాడు. వాడి గొంతులో కోపంతో పాటు దుఃఖం కూడా ధ్వనించింది.

"పకోడీలు నీకు ఇష్టమే కదరా?" వచ్చి అతని పక్కన కుర్చీలో కూర్చుంటూ అడిగాడు వెంకట్రావు. "ఏసీ వేసుకోకుండా పడుకున్నావేం? ఉక్కగా లేదూ?" రిమోటుతో ఏసీ ఆన్‌చేసాడు. ఒక్క నిమిషం అతని మొహంలోకి చూసాడు రాజేష్.

"నీకు తెలియదా? నేను పరీక్షలో తప్పాను."

వాడి కళ్ళల్లోకే చూస్తూ తెలుసు అన్నట్లు తలూపాడు వెంకట్రావు.

"అయితే మీ నాన్న ఏసీ వేసుకోవద్దన్నాడా?"

"అమ్మా, నాన్నా నాతో మాట్లాడట్లేదు."

"నువ్వు చేసిన పని సరైనదేనా? ఎప్పుడూ క్లాసులో ఫస్ట్‌వచ్చేవాడివి ఎలా తప్పావు?"

"అమ్మా, నాన్నా నన్నసలు చదివేవా లేదా అని కూడా అడిగేవాళ్ళు కాదు. ముఖ్యంగా నాన్న, అమ్మ నా గదిలోకి వచ్చినా వాడిని చదువుకోని. ఊరికే వాడితో ముచ్చట్లు పెట్టుకోకు అని అమ్మని కోప్పడేవారు. హాయిగా ఫోన్‌లో మ్యాచ్‌లు చూసినంతసేపు చూసి నిద్రపోయేవాడిని. పుస్తకం ముట్టుకోలేదు!"

"సరైన పనేనా?"

"కాదు. తప్పు చేసాను. మళ్ళీ ఎప్పుడూ చెయ్యను. రేపు ఇన్స్టంట్ లో నేనేమిటో నిరూపించుకుంటాను."

"ఇది సంకల్పమంటే. ఇవే మాటలు వెళ్లి మీ నాన్నతో చెప్పరా. చెప్పి, నిరూపించుకో. ఊళ్ళో ఉన్న బెస్ట్‌కాలేజీలో సీట్ తెచ్చుకు చూపించు!" మంచం మీద నించి లేచి బాబాయిని గట్టిగా కౌగలించుకుని గదిలోంచి బయటకు పరిగెత్తాడు రాజేష్.

వాడికాపాటి ప్రోత్సాహం ఇచ్చినవాళ్ళు లేరు.

★★★

"బాబాయ్! నాకు 98% వచ్చింది. సిటీ బెస్ట్‌కాలేజీలో సీటూ వచ్చింది. అమ్మా, నాన్న, నేనూ మీ వూరికి వస్తున్నాము. నాలుగురోజులు మీ అందరితో గడపటానికి! పిన్నిని మినపసున్ని, చక్రాలు సిద్ధంగా ఉంచామను" రాజేష్‌ఇంచుమించు అరిచినట్లు చప్పాడు వెంకట్రావుతో.

"శుభం. నీ తప్పు నువ్వు తెలుసుకుని గాడిలో పడ్డావు. మినపసున్నేం ఖర్మ.. నువ్వేమడిగితే అది చేస్తుంది మీ పిన్ని. వచ్చెయ్యండి. ఎదురుచూస్తుంటాం!" హాయిగా నవ్వుతూ అన్నాడు వెంకట్రావు.



# కటికోళ్ళ పిల్లాడు

వేంపల్లె షరీఫ్
✆ 9603429366

**విశిష్ట అతిథి కథ**

> ***"మా నాయనా కొనిచ్చినాడని" చెప్పినాడు మన్సూరు.***
> ***"ఎందుకు కొయ్యడానికా." అన్నాడు బక్కోడు. బక్కోని మాటలకు అక్కడున్న మిగతా ఇద్దరు పశువుల పిల్లోళ్లు కూడా శృతి కలిపారు.***
> ***"అవును కోసేదానికి పట్టుకొచ్చినాడు ఈ కటికోళ్ల పిల్లోడు" అన్నారు. మన్సూర్‌కు చుర్రుమంది.***
> ***"మీరే పశువులు ఒట్టిపోయినాక కబేళాకు అమ్ముకునేది. మేము కాదు. అన్నం పెట్టిన సెయ్యిని అమ్ముకోం" అన్నాడు.***

శుక్రవారం.

రామాపురంలో పశువుల సంత. ఒకరోజు ముందునుంచే అక్కడ సందడి మొదలవుతుంది. దూరప్రాంతాల నుంచి పశువుల్ని తోలుకొని వస్తారు చాలామంది రైతులు. ఆ చుట్టుపక్కల్లోనే అంత పెద్దసంత మరెక్కడా జరగదు.

అసలే ఎండాకాలం. కరువు. మేతకు రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. విస్తరిస్తున్న రియల్ ఎస్టేట్, కలిసిరాని వ్యవసాయం, పెరుగుతున్న యంత్రపు పనులు... కారణాలు ఎన్ని ఉన్నాయో అన్ని రకాలుగా నాశనమై, పశువులు అక్కడికి చేరుకున్నాయి.

గొర్లు, మేకలు, ఆవులు, ఎద్దులు, ఎనుములు అన్నీ అక్కడక్కడ మందగా ఉన్నాయి. వాటికోసం కట్టుకొచ్చిన బండ్లు, వేసుకొచ్చిన చెత్త... అంతా చిందర వందరగా ఉంది. కొంతమంది రైతులు బేరాలు దొరక్క తమ గొడ్లను సంతలో అటూ ఇటూ తిప్పుతున్నారు. ఆ గొడ్లను బేరమాడుతూ అక్కడక్కడా కొంతమంది జనాలు తిరుగుతున్నారు. గొడ్ల ధూళి, మనుషుల కాళ్ళ ధూళి అంతా గాల్లోకి లేచి సంతంతా ఎర్రెర్రగా మారింది.

సాయంత్రం నాలుగు గంటలవుతోందనగా సంతలోకి అడుగుపెట్టాడు దర్బారు. ఆ పక్క, ఈ పక్క తల్లోంచి చెంపల మీదికి చారు మాదిరి కారుతోంది చెమట! ముడతలు బడ్డ ముఖం, గుంటలోకి వెళ్లిన కళ్ళు, ముందుకు దూసుకొచ్చిన ముక్కు!

పాత పసుప్పచ్చ జుబ్బా వేసుకున్నాడు. అది పొట్టిగా ఉంది. దాని మీదికి ఎర్రటి పూలలుంగీ కట్టుకున్నాడు. తలకు ఆకుపచ్చ టర్కీటవల్ చుట్టుకున్నాడు. సాయంత్రం అవుతున్నా ఇంకా ఎండ తగ్గకపోవడంతో దర్బారుకంతా చిరాగ్గా ఉంది.

‘ష్.. బ్బా..’ అనుకుంటూమ, తలకు చుట్టుకున్న టవల్ విప్పి చెమటంతా తుడుచుకుని తిరిగి తలకు కట్టుకున్నాడు.

సంతలో దారికి అడ్డంగా నిలబడి బాతాఖానీ కొడుతోంది ఒక గుంపు.

‘వొచ్చి పోయేటోళ్లు ఎట్లా ఎల్తారని గూడా తెలీకండా దార్లోనే నీలుక్కోని మాటలు పెట్టుకోనుండారు గబ్బునాకొడుకులు’ గొనుక్కుంటూనే ఆ గుంపు మధ్యలోకి దూరి బయటికొచ్చాడు దర్బారు.



వెంటనే వెనక్కి చూసి... ‘ఒరే... మన్సురా...’ అంటూ అరిచాడు కొడుకు దాటుకోగలుగుతాడో లేదో అని.

మన్సూరు, దర్బారు కన్నా వేగంతో ఆ గుంపును చీల్చుకుని ముందుకొచ్చాడు... ‘ఈడ్నే ఉండా నాయనా...’ అంటూ!

వాడి చురుకును చూసి ముసిముసిగా నవ్వుకున్నాడు దర్బారు. ఒక తండ్రి తాలూకు గర్వం అతనిలో కనబడింది. ’రౌడీనాకొడుకు పుట్టినాడు నా కడుపున’ అని ముద్దుగా మనసులోనే తిట్టుకున్నాడు. పైకి మాత్రం ‘సూద్రా .. యాడన్నా బిక్క గొడ్లు ఉన్నాయేమో...’ అంటూ మన్సూరును పురమాయించాడు.

అంతకు ముందు దర్బారు ఒక్కడే సంతకొచ్చేవాడు. ఈమధ్యే కొడుకును వెంటేసుకుని వస్తున్నాడు. తల్లి లేని బిడ్డకి అన్నీ తానే అయి పెంచాడు దర్బారు. స్కూల్లో వేసి ఉంటే మన్సూరు ఈపాటికి ఏ ఏడో తరగతిలోనో ఉండేవాడు. వారాంతంలో సావుగొడ్లను కోసుకుని బతికే దర్బారుకు, అతన్ని చదివించడం కష్టం అనిపించింది. అందుకే కొడుకును ఇంటిపట్టునే సహాయంగా పెట్టుకుని కటికపని నేర్పాడు.

కత్తి పట్టుకోవడం దగ్గర్నుంచి, ఎముకల్లో ఇరుక్కున్న మాంసాన్ని చాకచక్యంగా తప్పించి మూడు సెకండ్లలో ముక్కలు కొట్టడం దాకా అన్నీ నేర్పాడు. కానీ మన్సూరులో లౌక్యమే లేదు.

సంతలో సావు గొడ్లను బేరమాడ్డం ఒక కళ! సావుగొడ్లనే కాదు ఏ వస్తువునైనా బేరమాడ్డం ఒక ఆర్టే! అందులోనే లౌక్యమూ, మాటకారితనం అన్నీ దాగున్నాయి. చూడగానే ఏ గొడ్డు ఎంత మాంసం పడుతుందో ఇట్టే చెప్పయగలగాలి. ఎంత మాంసం పడే గొడ్డుకి ఎంత రేటు పెట్టాలో కూడా తెలియాలి. లేకపోతే అసలుకే మోసం వస్తుంది. ఇంత కష్టపడి గొడ్డుని జుహా చేసి, చర్మం వలిచి, మాంసం కొట్టి, ముక్కలు చేసి, కుప్పలు పెట్టి అమ్మితే... చివరికి కూలీకూడా మిగలదు తేడా వస్తే. అందుకే ఈ లోతుపాతులన్నీ తెలియడం కోసమే కొడుకుని తనతోపాటు సంతలకు తోడు తీసుకొస్తున్నాడు దర్బారు.

కానీ తండ్రి ఉద్దేశ్యం... తండ్రికే వదిలిపెట్టి ఒక మాంచి పెయ్యి దూడ కోసం వెతుకుతున్నాడు మన్సూరు. అవును అతనికి దూడ అంటే ఇష్టం. దాని ముద్దుముద్దు నడక అంటే ఇష్టం. దూడ మెడలో చిన్నగంట కట్టి, అది ఇంటి ముందు చెంగుచెంగున ఎగురుతుంటే చూడాలని ఆశ. ఆ ఆశ అతనికి ఈ మధ్యే కలిగింది.

మన్సూరు ఇల్లు ఎక్కడో ఊరికి దూరంగా విసిరేసినట్టుగా ఉంటుంది. ఆ ఇంటి వెనుక పెద్దగా బీడుభూములు ఉన్నాయి. అవి ఇప్పుడిప్పుడే రియల్ ఎస్టేట్ రూపం ఎత్తుతున్నాయి. అయితే ఆ భూముల్లోకి తరచూ పశువులు కాసే పిల్లోళ్ళు వస్తుంటారు. వాళ్ల దగ్గర లేతలేత దూడలున్నాయి. పెద్దిరెడ్డి జీతగాడు బక్కోడి దగ్గరైతే నల్లమచ్చల పెయ్యి దూడ ఒకటి ఉంది. దానిని చూసి మనసు పడ్డాడు ఓ రోజు మన్సూరు.

‘కాసేపు ఎత్తుకుంటానురా...’ అన్నాడు.

‘ముట్టుకుంటే మక్కెలిరుగుతాయి...’ అన్నాడు వాడు పొగరుగా.

అప్పటినుంచి మన్సూరుకు దూడను ఎత్తుకోవాలని, ముద్దుపెట్టుకోవాలని, కలిసి ఆడుకోవాలని ఆశ కలుగుతోంది. అందుకే తండ్రి వెంటపడ్డాడు... తనకు ఒక దూడని తీసియ్యమని! పోయిన వారం కాక, ఆ పోయిన వారం ఇదే సంతకు వచ్చాడు మన్సూరు తండ్రి వెంట.

అప్పుడు ఒక మంచి తెల్లనిదూడ సంతలో కనబడింది. కాకపోతే తల్లితో పాటు ఉంది. పదివేల రూపాయలు చెప్పాడు రైతు. ఏ పది పదకొండు వందలో పెట్టి సావుగొడ్లను కొనే దర్బారు, ఇలా దూడకోసం పదివేలు పెట్టడానికి ససేమిరా అన్నాడు. అసలు ఆ ఆలోచనకే బెదిరిపోయి, “ఏం చేసుకుంటావురా...” అని తిట్టాడు.

“సాక్కుంటా...” అన్నాడు.

"నీ మొహం... నువ్వు సాక్కోవాలనుకుంటే... ఏ కోణ్ణో, కుక్కనో సాక్కో కానీ, ఇట్టా రేట్లు దండిగా ఉండేటివి సాక్కుంటానంటే యాణ్ణుంచి తేవాలా వాయ్ లెక్క" అని అరిచాడు.

మరీ అంత రేటు కాకపోయినా ఈసారి ఏ ఐదారు వందల్లోనైనా కూసింత బుజ్జి దూడ దొరక్కపోతుందా... తండ్రి చేత కొనిచ్చుకోకుండా పోతానా... అనేది అతని ఆలోచన. అందుకే తండ్రి పిలిచిందే తడవుగా ఠంచనుగా రెడీ అయ్యి సంతలకు వస్తున్నాడు.

చీకటిపడేదాకా సంతంతా కలియతిరిగారు తండ్రీకొడుకులు. ఎక్కడచూసినా సావుగొడ్లకు కూడా భారీ గిరాకీ ఉంది. ఎవరూ గిట్టుబాటు కానివ్వలేదు. కబేళావాళ్లొచ్చి ఎంతకు పడితే అంతకు లాట్ కొనేసి వ్యాన్లకు ఎక్కించుకుని వెళ్తున్నారు. దర్బారుకేమో సావుగొడ్డు ఎక్కువ రేటు పడితే నష్టం వస్తుంది.

అసలు తమవాడలో ఎవరైనా గొడ్డుమాంసం తినేది అగ్గవనే. ఇప్పుడు తాను ఎక్కువరేటుకు గొడ్డును కొని, మాంసం ఎక్కువ రేటుకు అమ్మితే, కొనడానికి ఎవరూ రారు. 'నీకు ఇచ్చే రేటుకు చికెన్, మటన్ వచ్చాండాదే' అంటారు. అందుకే ఈ వారం గొడ్డును కోయుకన్నా పర్వాలేదు కానీ, నష్టమైతే మాత్రం రాకూడదనుకున్నాడు. తిరిగి తిరిగి అలిసిపోయిన దర్బారు సంత మధ్యలో ఉన్న చింత చెట్టు కింద నిలబడ్డాడు. అప్పుడు కనబడింది మన్సూర్‌కు నల్ల మచ్చల పెయ్యి దూడ. అది అచ్చం పెద్దిరెడ్డి జీతగాడి దగ్గరున్న దూడ మాదిరే ఉంది. కాకపోతే నీరసంగా ఉంది. మూడు వారాల వయసుంటుంది. మూడు కాళ్లతో నడుస్తోంది. ముందున్న కుడి కాలుకు పెద్ద కట్టు కట్టి ఉంది.

దాన్నెవరో కబేళాకు అమ్మేశారు. కబేళాకు తరలించే దళారి దాన్నెత్తి వ్యానులోకి పడేశాడు. వ్యానంతా గొడ్లతో నిండిపోయి ఉంది. ఊపిరి తీసుకోవడానికి కూడా సందు లేదు.

బాధనిపించింది దర్బారుకు.

"సూడ్రా... మన్సురా... మనుషులు ఎట్టాంటోళ్ళే. మనం కోచ్చే ఇట్టనే నిమిషంలో పానం పోతాది. యీళ్లు సూడు వాటిని ఎన్ని రకాలుగా గావాల్లంటే అన్నిరకాలుగా బాదపెట్టి సంపుతాండారు... అందుగ్గాదూ అందరూ మనమింద పడేది." అన్నాడు దర్బారు.

అప్పటికే బాధతో దాని వైపు చూస్తున్న మన్సూరుకు తండ్రి మాటలతో ఏడుపొచ్చింది.

"అది మనం కొనుక్కుందాం నాయనా!" అన్నాడు మన్సూరు దీనంగా.

"ఎందుకురా... అది బతకదు. అందుకే కబేలాకు అమ్మేసినారు."

"లేదు నాయనా... దానికి ఆకుపసరు కట్టి బాగు చేసుకుంటే బాగయితాది. మనింటి ఎనకాలుండే పశువుల పిల్లోల్లను అడిగితే దానికి మందు పూచ్చారు" అన్నాడు.

"సరే... ఇచ్చాడో లేదో అడిగి సూద్దాముండు..." అని అక్కడికి వెళ్లారు.

అప్పటికే చీకటి పడుతుండటంతో దళారి చాలా కంగారుగా ఉన్నాడు.

"ఓన్నా... ఆ దూడనంట ఇచ్చావా? పిల్లోడు సాక్కుంటానని ఏడుచ్చాండాడు" అన్నాడు దర్బారు.

"ఎందుకన్నా... అది బతకదు సచ్చాది" అన్నాడు దళారి.

"సచ్చే సావనీలేన్నా... పిల్లోని ముచ్చట తీర్తాది. ఎంతకిస్తావు సెప్పు" అన్నాడు.

ఒక్క క్షణం దర్బారు ముఖంలోకి చూశాడు దళారి. కొనే ముఖమా... కాదా... అన్నట్టు. దర్బారులో అతనికి ఏదో నిజాయితీ కనిపించినట్టుంది.

"వెయ్యి రూపాయలైతాది ఇస్తావా?" అన్నాడు దళారి.

"ఓయమ్మా... అంత యాడ పెడ్తావులేన్నా. ఏడొందలకు యిచ్చేయన్నా. నువ్వే సెప్తాండావా... బతకదని!" అన్నాడు దర్బారు.

"సరే... ఇట్టీ... ఏడొందలు" అన్నాడు దళారి మారు మాట్లాడకుండా.

డబ్బుతీసి దళారి చేతిలో పెట్టాడు దర్బారు. దళారి ఆ కుంటిదూడను వ్యాన్ లోంచి కిందికి దింపాడు చాలా మొరటుగా. నడవలేని స్థితిలో ఉన్న దాన్ని పక్కకు ఈడ్చాడు. దాన్ని అలా ఈడ్చినందుకు బాధ కలిగింది మన్సూరుకు.

"సిన్నంగన్నా... దాన్ని ఇంటిక్కూడా తీసుకుని పోనిచ్చేటట్టు లేవే, ఈణ్ణే... సంపేసేటట్టుండావు సామీ!" అని గొనిగాడు మన్సూరు.

కూర్చొని దూడను కౌగిట్లోకి తీసుకున్నాడు. దాని ఒంటిమీదున్న తెల్లటిబొచ్చంతా అట్టలు కట్టి ఉంది. ముఖమంతా దిగాలుగా, భయంగా ఉంది. కాలు భరించలేని నొప్పిగా ఉన్నట్టుంది. డొక్కలో ఏమీ లేదు. అర్జెంటుగా అటెళ్లి రెండు రూపాయల అవిశాకు కొన్నాడు దర్బారు. తెచ్చి దాని మూతి దగ్గర పెట్టాడు. అది తినలేదు. దానికి నీళ్లు కావాలి... అర్థమైంది మన్సూర్‌కు.

"నాయనా.. దీనికి నీళ్లు తాపుకోనొచ్చా.. ఈణ్ణే ఉండు" అంటూ సంతలో కాంపౌండ్లో ఒక వారగా ఉన్న బోరింగు దగ్గరకి తోలుకెళ్లాడు. అక్కడ అప్పటికే ఒకతను ఎద్దులకు నీళ్లు తాపుతున్నాడు. అతనిది అయిపోయేంతవరకు ఉండి దూడకు నీళ్లు కొట్టి తాగించాడు. అది తాగింది.

మళ్లీ దాన్ని ఎత్తుకుని తండ్రి దగ్గరకి తీసుకొచ్చాడు. తండ్రి దగ్గరున్న అవిశాకు తినిపించాడు. అది ఒక్కో ఆకు కొరకడం మొదలుపెట్టింది. ఆనందానికి అంతు లేకుండా పోయింది.

కాసేపటి క్రితం వరకు ఆ దూడ ఎవరిదో! ఇంకాసేపుంటే ఇంకెక్కడిదో! ఇప్పుడు మాత్రం అది మన్సూరుదైంది. మనుషులకు దానికి ఒక తెలియని ఆత్మీయబంధం ఏర్పడింది.

దర్బారు, మన్సూరు ఇద్దరూ దూడను తీసుకుని ఇంటికి వచ్చేసరికి బాగా చీకటిపడింది. రాత్రికి దాని కాలికున్న కట్టు విప్పాడు మన్సూరు. ఆ కాలు తీరుమానంగా విరిగిపోయినట్టుగా అనిపించింది. 'అది ఏ స్కూటరు కింద పడిందో...' అనుకున్నాడు. అసలు కాలు అతుకుతుందో లేదో అని దిగులు ముసిరింది. ఎప్పుడెప్పుడు తెల్లారుతుందా... అని ఎదురు

చూశాడు. తెల్లారింది. ఎప్పుడెప్పుడు పొద్దెక్కుతుందా అని ఎదురు చూశాడు. పొద్దెక్కింది. ఎప్పుడెప్పుడు ఆ దూరంగా కనపడే బీడుభూముల్లోకి పశువుల పిల్లాళ్ళు వస్తారా అని ఎదురుచూశాడు. వెళ్ళొచ్చారు. ఇంకేం ఆలస్యం చేయలేదు మన్సూరు.

నేరుగా దూడను తీసుకుని పశువులు కాసే పిల్లోళ్ల దగ్గరికి వెళ్ళాడు. పెద్దిరెడ్డి జీతగాడు బక్కోడిని బతిమాలాడు.

"ఒరేయ్... బక్కోడా... ఈ గోడకు కాలిరిగింది. నువ్వు ఆకుపసరు కట్టరా... అది బాగయితాది" అన్నాడు మన్సూరు.

గతంలో ఇలాగే ఒక కుంటిదూడను బాగు చేశాడు బక్కోడు. అది గుర్తు పెట్టుకుని అడిగాడు మన్సూరు.

"ఆకుపసరు లేదు... గీకుపసరు లేదు... అసలునీకు ఈ దూడ యాడిది? అది సెప్పు ముందు?" నిలదీశాడు బక్కోడు.

"మా నాయన కొనిచ్చినాడు" అని చెప్పినాడు మన్సూరు.

"ఎందుకు కొయ్యడానికా?" అన్నాడు బక్కోడు. బక్కోని మాటలకు అక్కడున్న మిగతా ఇద్దరు పశువుల పిల్లోళ్లు కూడా శ్రుతి కలిపారు.

"అవును కోసేదానికి పట్టుకొచ్చినాడు ఈ కటికోళ్ల పిల్లోడు" అన్నారు.

మన్సూర్‌కు చుర్రుమంది.

"మీరే పశువులు ఒట్టిపోయినాక కబేళాకు అమ్ముకునేది. మేము కాదు. అన్నం పెట్టిన సెయ్యిని అమ్ముకోం" అన్నాడు.

"అవును అమ్ముకోరు. కోసుకుంటారు..." అన్నారా పిల్లోళ్లు పక్కపక్క నవ్వుతూ.

మన్సూర్‌కు చిరాకు వచ్చింది. ఆకుపసరు సంగతి ఏమో కానీ పక్కనే పడున్న చింత బుర్ర అందుకున్నాడు. ముగ్గురి పిర్రలు వాచేలా తరిమి తరిమి కొట్టాడు.

చురుక్కు తట్టుకోలేని బక్కోడు ముందుకు పరిగెత్తినట్టే పరిగెత్తి, అట్లే వేగంగా వెనక్కి వచ్చి చిరుతపులిలా మన్సూరు మీదకి లంగించాడు.

మన్సూరు అట్లే ముందుకు బొక్కబోర్లా పడ్డాడు. మిగతా ముగ్గురూ వాడిమీద పడ్డారు. పిడిగుద్దులు కురిపించారు. మన్సూరు కళ్ళలోకి నోట్లోకి మన్ను పోయింది.

మంట... మంట... దెబ్బలు... బాధ... నొప్పి... విలవిల్లాడాడు.

"కటిక నా కొడుకా... మల్లా ఇంగోసారి గనక మా తావుకు వొచ్చినావంటే సూడు..." అన్నారు వగరుస్తూ వదిలేసి.

కాసేపు నేలమీదనుంచి లేవలేకపోయినాడు మన్సూరు. వాణ్ణి ఆ స్థితిలోనే వదిలేసి గొడ్లను తోలుకుంటూ, వంక దాటి ఆ పక్క బీళ్ళలోకి వెళ్లిపోయారు పిల్లోళ్లు.

మన్సూరు దూడ అక్కడక్కడే తిరుగుతోంది. తర్వాత కాసేపటికి మెల్లగా లేచి దూడను వెంటేసుకుని ఇంటికి వచ్చాడు మన్సూరు.

దెబ్బలతో ముఖమంతా దోక్కుపోయి ఇంటికొచ్చిన మన్సూరును చూసి కంగారుపడ్డాడు దర్బారు.

"ఏమైందిరా?" అని అడిగాడు.

జరిగిందంతా చెప్పాడు మన్సూరు.

"సూడు నాయనా. మనం దూడని కోసుకుని తింటామంటా. సూచ్చా సూచ్చా దూడ నెట్టకోసుకుంటాం నాయనా మేము" అన్నాడు చివరగా.

"నువ్వెందుకు పోయినావురా వాళ్ళ నోటికి?" అంటూ దండించాడు దర్బారు.

"నేనేమన్లా నాయనా... వాళ్లే నన్ను తిట్టినారు, నేను కలబడనా..." అన్నాడు మన్సూరు.

"అసలు నువ్వు దూడను వాళ్ళ జతకు ఎందుకు తోలికుపోయినావ్ వాయ్... అది సెప్పు ముందు" అంటూ గదిమాడు... ఒక పక్క కుడితి నీళ్ల బకెట్లో చేయి పెట్టి కలతిప్పుతూనే.

మౌనంగా ఉండిపోయాడు మన్సూరు.

కాసేపుండి దర్బారే అన్నాడు.

"బక్కోని షౌకారి పెద్దిరెడ్డి గురించి తెల్సునా నీకు?"

"తెల్దే..."

"నువ్వు అప్పుడు సిన్నపిల్లోనివి. పెద్దిరెడ్డికి నాగులగుట్టపల్లెలో ఉండే తిప్పారెడ్డితో కచ్చలుండాయి. ఈయప్ప బూములు ఆ తిక్కునే గదా ఉండేది. ఈ అప్ప మీద కచ్చతో, తిప్పారెడ్డి సీనాసెట్లను నరికించినాడు. అబ్బుడు పెద్దిరెడ్డి నడిరేత్రి మనసల్ని ఏస్కపోయినాడు... తిప్పారెడ్డి ఇంటిమీదికి! ఆయప్ప యాడ ఉండాడు? రాయచోటికి బోయి దాంకున్నాడు. అబ్బుడు పెద్దిరెడ్డి కోపం పట్టలేక, ఆ పిచ్చికోపంలో ఏం చేయాల్నో తెలీక పశవులు ఉండే కొట్టానికి అగ్గి పెట్టించినాడంట. ఆ పొద్దు ఎన్ని బరిగొడ్లు సచ్చిపోయినాయో తెల్సునా? కాడెడ్లు, మూడు నాలుగుదాంక ఆవులు, దూడలు, పది దాంక బరిగొడ్లు ఉండాయి తిప్పారెడ్డికి. అయిన్ని అగ్గిలో పడి కాలిపోతా సన్న అరుపులు అర్సలేదంట. ఊళ్ళో వాళ్లు సచ్చినారో బతికినారో తెల్దు. ఆ పక్కకు తొంగి గుడక సూల్లేదంట. అన్నీ అట్నే గొంతు కూర్చొని పానం యిడ్సినాయి. ఒకటో రెండో సావు బతుకుల్లో ఉంటే, ఆ పొద్దు నన్ను పిల్లంపి అమ్మినాడు తిప్పారెడ్డి.

ఆ పొద్దు నాకు పెద్దిరెడ్డి మింద శాన బాద కలిగిండాది. అట్టాంటోని కాడ పనిజేచ్చాండే బక్కోని జోలికి నువ్వు పోతాండావు. రేపొద్దున ఏందన్నా జరిగితే, అందురూ ఆ బక్కోన్ని వొదిలేసి మనల్నే అంటారు. అందుకే వోళ్ళ సుతికి పోవద్దు నాయనా. ఇంకోపారి వాళ్ళ తాన కనబడినావనుకో... గొడ్లకు బదులు నిన్ను కోసి... ఎండేచ్చా... కనుక్కో..." అన్నాడు దర్బారు.

"సరే... నాయనా... ఇంకెప్పుడూ పోను." అన్నాడు మన్సూరు. కానీ తెల్లారి మళ్లీ బక్కోని జోలికి వెళ్లకుండా ఉండలేకపోయాడు.

"బక్కోడా... బక్కోడా... నిన్న నన్ను నువ్వు కొడితే కొడితివి. అంతా తూచ్చీ. ఈ దూడకాలికి కొంచెం ఆకుపసరు కట్టవా?" అన్నాడు దీనంగా మన్సూరు.

బక్కోడు కరగలేదు.

"మీరు ఈ దూడని కోసుకుని తింటారని ఒప్పుకో. అప్పుడు బుద్ధిబుడితే ఆకుపసరు కడతా" అన్నాడు బక్కోడు.

మన్సూరుకు అలా అనడానికి మనసు రాలేదు.

ఒకసారి చేతుల్లో ఉన్న దూడ వైపు చూసుకున్నాడు. దాని కుంటికాలి వైపు చూసాడు.

"ఆ... ఒట్టి మాటే కదా... చెబితే ఏమయితాదిలే" అనుకున్నాడు.

"ఔను. మేము ఈ దూడను కోసుకుని తింటాం. తింటానికే రామాపురం సంత నుంచి కొనుక్కోని వచ్చినాం" అన్నాడు మన్సూరు.

"మల్ల కోసుకునే తినేదానికి కట్టెందుకు కట్టాలా?" అన్నాడు బక్కోడు వెక్కిరిస్తూ.

మన్సూరుకు ఏడుపొచ్చింది.

ఈసారి పక్కనే ఉన్న మట్టిపెళ్లలు అందుకున్నాడు. బర్‌బర్‌మని ఒకదాని తర్వాత ఒకటి రాకెట్ వేగంతో విసిరినాడు.

బక్కోడి కాలికి తగిలింది ఒక మట్టిపెళ్ల. "కుయ్యో... మొర్రో" అంటూ బక్కోడు కుంటుకుంటూ దూరంగా పరిగెత్తాడు.

ఏం చేయాలో తెలియక తన కుంటిదూడతో దిగాలుగా ఇంటికి చేరుకున్నాడు మన్సూరు. మళ్లీ రెండురోజుల తరువాత వెళ్ళాడు. మన్సూరును చూసి ముందుగానే అక్కడి నుంచి పశువులను తోలుకొని దూరంగా వెళ్లిపోతున్నాడు బక్కోడు.

అప్పుడు మన్సూరు గట్టిగా అరిచాడు. 'ఆగు బ్బీ... బక్కోడా. దీన్ని మేము ఈ పొద్దు కోసేస్తాండాం. ఇంగ నువ్వు దీనికి కట్టు కట్టాల్సిన పనిల్యా. ఈ సంగతే నీకు చెబుదామని వచ్చినానంతే" అన్నాడు.

ఏమనుకున్నాడో ఏమో... బక్కోడు ఆగాడు.

మన్సూరును దగ్గరకు పిల్చుకుని దూడను ఎత్తుకున్నాడు. అలా పక్క గట్లకెళ్ళి ఏదో ఆకు తెచ్చి నలిపి, అక్కడే దొరికిన ఒక పాతగుడ్డతో కట్టుకట్టి నేల మీదకి వదిలాడు.

అది కుంటికాలును నేలమీదకు మోపింది. మన్సూరు ముఖం ఆనందంతో వెలిగిపోయింది.

అప్పుడు బక్కోడు "నువ్వు ఉత్తినే సెప్తాండావ్. నువ్వు దీన్ని కొయ్యవు. సాక్కుంటావు గదూ!" అన్నాడు.

మన్సూరు కొంటెగా నవ్వాడు. భరోసాగా అతని భుజం మీద చేయి వేశాడు. బక్కోడు కూడా స్నేహంగా నవ్వాడు. దూడ ఉన్నట్టుండి ఎందుకు మైదానంలో అటు ఇటు పరిగెత్తింది. మూడు కాళ్ళతోనే చెంగు చెంగున ఎగిరింది. చివరికి మళ్ళీ వాళ్ళ కాళ్ళ దగ్గరకే వచ్చి ఆగింది. దూడను ఒక్కసారిగా ఇద్దరు ఎత్తుకొని ముద్దు చేయడం మొదలుపెట్టారు.

*('నవ మల్లెతీగ' మాసపత్రిక, ఏప్రిల్ 2024 నుంచి పునర్ముద్రణ)*



# గుర్రపు డెక్క

కాశీభట్ల వేణుగోపాల్

**కథా మార్గదర్శి కథ**

> ***గ్వార్నెరీ.. ఆ మాటీలకీ.... ద్వారం వెంకటస్వామి నాయుడు 'మేఘమల్హార్' చుట్టపొగల్తో చెల్లించినంత... సారంగీకి తారగా మార్చి తన స్నాయువును ఆయువుగా చేసిన మృగానికి, వాద్యకారుడి గోరెంత బాకీ..... అరగంట జ్వలనం... మండి మండి చివరాఖరికి రాగమావిరైపోదూ...***

ఒక అపస్మారకంలో... ఎవ్వరో నాలోపల స్మరించిన మంత్రాక్షరాలు.. అక్షరాలా మంత్రాక్షరాలే...యాంత్రిక మంత్ర తంత్రాక్షరాలు.. నాలో ఎవరో ఎవరెవరో... నా లోపలికి తొలుచుకుని... నన్నింకో నన్నుగా మలచి....

నా కళ్లు లో.... లోపలికి...

ఇంప్లోషన్

భా.......o.......స్ స్ స్...

చుప్...ప్.....ప్.....

శూన్యం

నా చెవులు నాచే విసర్జింపజేయబడి......

నావికాని ఏవేవో ఉచ్ఛరణలు వింటూ.....

'ఆగుఁ! ఎక్కడికీ?' 'దూయిటగేన్ ' 'ఛీఛీఛీ కాంట్యూ' 'రా!' 'ఇంతమాత్రాని కింతాయసమా!' అంత యెందుకూ ఇట్స్ వేస్ట్ యూజ్ లెస్ అబ్సలూట్లీ యూజెలెస్...స్ స్ స్...”

ఎవరి స్వప్నాలోకంటూ.. కిరాయి కలలు...



ఆకుపచ్చటి సాయంకాలాలూ... ముక్కు వాసనల ఏసీగదుల డిన్నర్లూ.. బొద్దింకలు నమిలుమిసిన నాఫ్తలీన్ వాసనలు చల్లబరిచిన గాలి వీవెనలూ.. తెల్ల కొవ్వొత్తుల నల్ల కాంతుల్లో ముక్కల ముక్కల ముఖాలు అతికించిన చిర్నవ్వులూ... హోలీషిట్.

క్రూసిఫిక్షన్... ప్రతి వక్కడూ ఒక్కోడూ ఒక్కో ఇమ్మానియేలో లేదూ పక్కన ఉమ్ములు మిసిన దొంగలో... అంతే అంతే క్రూసిఫిక్షన్ క్రాసు మీద... సిలువ విలువ.

క్రాసు... పవిత్ర విలువల్ని కొలిచే త్రాసు... ఒహొహో...

బహావుల్లా ఏమంటాడో!? ఢిల్లీలో పద్మాలయం పాలరాత్తో కట్టించమన్నాడా యేం? ఓ ఉరికొయ్యకింద వేలాదిగా... వేనవేలు... వేలాదిగా ఆనాదిగా ముక్కలు చెక్కలై శిథిల పూర్ణత్వాలై... పరిపూర్ణ శిథిలాలై

ఎన్నెన్ని కోరికలు కలలూ?!

ఆ చిలుక

ఈ పిచుక

ఎన్ని రాబందులూ?!

ఈ చిగురు

ఆ పూవు

ఎన్నెన్ని తుఫానులూ?!

★★★

ఎక్కడినించీ ఎక్కడికొచ్చాను

ఎప్పుడు మొదలైందీ ప్రస్థానం... నానేక్కడ? ఈనేనెవ్వరు? నాది కాని జీవితాన్ని నేను జీవిస్తూ దాన్ని ప్రేమించేదెలా?

వైబ్రేట్ మోడ్లో పెట్టుంచిన సెల్ జేబులో వణికింది...

"హెలో"

"హాఁ ఆగే నింన్యువర్ డ్రీంలాండ్? అటాప్సీ కేస్... ఎక్స్యామ్ చేసి స్పాట్ పీ.ఎమ్.... సస్పెక్టెడ్ హోమి సైడ్.. కట్నంచావు... రొటీన్నాదు ప్రోగ్రెసివ్ విమెన్స్ ఆర్గనైజేషనుంది దీని వెనుక... అందుకే అడ్వాన్స్ గా ఇన్ఫాం చేస్తున్నా... సియ్యై ముచికుంద్ పిలుస్తాళ్లే యింకాస్సేపట్లో... బీ ప్రిపేర్డ్ ఫారెవాం నైట్ బైబై" కొలీగ్ పరమాత్మ...

శవం... తవ్వితీసి... చావుక్కారణాలు వెదకాలి

★★★

ఆడశవం... కుళ్లిన ఆడశవం.... ఆడది కుళ్లిందా? ఆడదాని శవం కుళ్లిందా? వాంనైట్ వెచ్చటి రాత్రి... ఆర్సీ విస్కీ సిల్కుపరదా...రక్తమాంసాల్నీ కొవ్వు ముద్దల్నీ నంచుకునే సరదా.. రాత్రి వెచ్చగా.. సీయ్యైతో లాలూచీ... సాంఘిక లావాదేవీల్లో ఇదీ ఓ... వన్ మోర్ ట్రాన్సాక్షన్...

గుట్టమీద గెస్టౌస్ లో..

గెస్టౌస్ లో గుట్టుచప్పుడు కాని గుండె చప్పుళ్ళో... తప్పుడు పనుల్లో....

నీలి సరదాలు...

రాత్రిళ్లకు సిగ్గెందుకేయదు... సిగ్గుని చీకటి నాకేస్తుందా?

కుళ్లి కంపుకొడ్తూ... చీకిపోయి... చివికిపోయి...సగం మన్నైన శరీరం....

సగం శరీరమై మన్నూ.. ఊడొచ్చే వెంట్రుకలూ... చర్మమూ..

“తనువా హరిచందనమే’ ‘చందన్ సా బదన్’ దగా దగా.. షీర్ డిసెప్షన్ యొక్క గబ్బు గబ్బు.... ఎక్కడి వరకూ... నచ్చనిదంతా అంతే.. యోగవాసిష్ఠం..

చీతాలామచెందులుక్కూలా...ప్చ్..... వెర్రివెంగళాయి అర్థంకాలేవాడిక్కూడా పద్నాలుగేళ్లు అంగలార్చాడు. పద్నాలుగేనా? సిలోన్ విలనోడి కిడ్నాప్ తర్వాత ఊపిరి పీల్చుకునుంటాడు. జల్సాగా తర్వాత ఎక్స్ కర్షన్లాగా వెతికినట్టు నటించుంటాడు.. కోతిమూకలు వెతికి పట్టుకొస్తే అందరికోసం అంటగట్టుకుని మళ్లీ అడవికి తోలేసాడు..

సెబ్బా...ష్ ష్ ష్

అయాం నాటె కింగ్, శ్రీరామచంద్ర మూర్తిలాగా.. అయ్ కానాడ్డూ దట్... దొంగలు బాబోయ్ దొంగలు దొంగలు...

శవాన్ని తవ్వి తీయాలి.. పాతిపెట్టి న్నిజాన్ని ప్యాక్చేసి పట్టుకెళ్లి కడిగి... కోసి అణువణువూ శోధించి...

“తను” రమ్మందే ఎలా?

ఆంఖోమె మస్తీ షరాబీ... కాలీ జుల్ఫోమ్ రాతె షబాబ్ కీ... అదీ... అలాగ....ఇలాంటిచోట... తనువాచందన్ లు రాగాలు నూరుకోవాలి. రేగిపోయి చెలరేగి.. ఆగి వూగి తూగి ఈ రోజుకా కలల్ని వాయిదావేయ్... సగటు మానవా! ఈ స్వప్నాన్ని రేపట్లోకి బదిలీ చెయ్... నీకు చేతనైంది ‘కలలమార్చేకదా? ఫవర్ ఫెలో..

“వాట్స్ ద మాటర్ స్టిల్ ఫుల్లీ ట్రెస్డ్ – గోయింగౌట్?”

డెబ్బైయ్యారు కిలోల కొవ్వుముద్దలు.. ఎర్రటి చర్మపుసంచిలో మూటలు మూటలుగా ఒదిగి...

ఆ కొవ్వు మూటల బస్తా సోయగం ఆడపదార్థం నించీ సమాధానమాసించినట్టా లేనట్టా...

కెనెనీ బడి సేవ్ దిస్ హ్యాప్లెస్ హ్యూమన్బీయింగ్?

హౌ హ్యూమేనయాం??? తప్పులే తప్పులు.. మనిషిని గదా?

‘ఎరారీ హ్యూమానం ఎస్ట్’ ల్యానిట్లో నైనా అచ్చుపచ్చి గ్రామీణ తెలుగులో నైనా తప్పుతప్పు... ల మనిషే... మనిషి... పశువూ?

ప్రేమ శారీరికావసరమే... ముమ్మాటికీ...

చల్లారిపోయిన పెనమ్మీద అట్లులెయ్యవ్... అటులే చటులాలంకారప మటుమాయలుపోయిన సంవత్సరమొదిలేసిన కమీజ్లోకే నేను దూరలేనే....

“రాత్తిర బోయనానికొస్తావా? కరీంగాడిని పట్కెళ్లమనీనా?”

అన్నం మిగట్టానికి వీల్లేదూ.. బోయనమట బోయినం.....

ఏటి ఒడ్డున .. తుమ్మచెట్టు నీడల్లో... ఎర్రటి చంద్రనిప్పులు చెరిగే మధ్యాహ్నం..తుమ్మకాయల్ని మేస్తూ మేకలూ... మేకల వాసనా... పైన ముళ్లకొమ్మల మధ్యన పాలపిట్టలూ.. పాలపిట్టలు నీలి ఈకలూ.. చొట్టలు పడ్డ ఇత్తడి క్యారేజీలో మెత్తటి

జొన్న సంగటీ... దాని మధ్యన సాయంత్రపు సూర్యుడిలా మిరపకారం.. ఏట్లో తోడిన చెలమలో చల్లటి తీయటినీళ్ళూ.. కాళ్ల కింద కదిలిపోయే ఇసుక...

భక్ష్య భోజ్య లేహ్యాచోష్య పానీయ.. అదీ బోయనం తెలుసా నా కొవ్వు పొట్లమా...

మొన్నటికి మొన్న రాత్తిర 'ఆకలి' అన్నేనంటే 'తను' అప్పటికప్పుడు వేడి వేడన్నం మల్లెల బువ్వా.. వెల్లుల్లి కారంగుండా.. కమ్మటి నెయ్యీ... ఆవకాయబద్దా మీగడ పెరుగూ..

ఇక్కడ పెరగటం లేదు... అంతా విరుగే విరుగే అవిరి కుడుమా.. మై ఫుట్...

“ఆయా మీటింగౌట్” అన్నట్టు సైగ

“ఎవళ్లతోటీ?” అనవసర విషయాలాలస..

“పోస్ట్మార్టమ్ మ్యామ్” శవాల్తో కల్సిబోయనం.. ఫీస్టింగ్ విత్ ద డెడ్... హహ్హా....

“ఓహ్ ఆయ్ థాట్ డిఫరెంట్లీ” యా ఇటీజ్ డిఫరెంట్.. ఇటాల్వేస్ ఈజ్.. సక్రమంగా ఆలోచించేడిచిందెప్పుడూ అని...

“విల్యూబీలేట్?” ఇట్స్ ఆల్రెడీ టూ లేట్....

“కాంట్ సే”

సీయ్యై ముచికుందుడి ఫోన్ తర్వాత... నా మెటామార్ఫసిస్ నాకు రెక్కలు మొలిచాయి...

★★★

అలిసిపోయున్న నన్ను 'తను'... మరీ యవ్వనం.. లేదు... కాదు... వుంది... అదే అంతే...

ఇప్పట్నించీ రేపట్లలోకి ఎల్లుండ్లలోకి పరిగెడుతూ.... బాల్యంలో అంతమవుతుంది 'తను'

అప్పుడు ఓ ముసలాడు పదేళ్ళ పాపతో శృంగారం? ఏమో?

జనాలందరూ మఫ్టీలో పోలీసులే.. యూనిఫాంలో జనద్వీపం మధ్య మరో మనిషి. ఎవర్నేవరు అదుపూ ?....

రిడిక్యులస్.. షీర్ నాన్సెన్స్... ఎక్కడో ఎవరికోసమో ఎవరో నిరంతరంగా ఎదురుచూట్టం.. ఎక్కడికో వెళ్ళిన ఎవరో తిరిగొస్తే.. బావుణ్ణనుకుంటూ...

'తన' కో సందేశం రాసి పంపాలి. నా చర్మంతో ఓ ప్యాలింప్సెస్ట్ చేసి దానిమీద వెయిట్ ఫర్మీ అని పచ్చపొడిపించి... పంపాలి.. ఆయాసం...

నేను తనకెంత రుణం?

నా యావద్దేదమోదాలు... నా తప్పొప్పులూ... చిటికెడు స్వర్గం.....

ఎంత బాకీయో?!

జంత్రానికీ స్వరరాగ సుధాద్రుతికీ కృతికారుడికీ..

గ్వార్నెరీ.. ఆ మాటీలకీ.... ద్వారం వెంకటస్వామి నాయుడు 'మేఘమల్హార్' చుట్టపొగల్తో చెల్లించినంత...

సారంగీకి తారగా మార్చి తన స్నాయువును ఆయువుగా చేసిన మృగానికి, వాద్యకారుడి గోరెంత బాకీ.....

అరగంట జ్వలనం... మండి మండి చివరాఖరికి రాగమావిరైపోదూ...

వద్దు వద్దు వద్దు వద్దు...

ఈ బలవన్మరణ సదృశ జీవితం యాక్కు...

సభ్యసమాజమా! ఆరోగ్యవంత సంఘమా! ఓ మహాసంస్కృతీ!

మీ అందరి ముందూ మోకరిల్లి తప్పప్పుకుంటాను. తప్పనిసరి తప్పునే స్వీకరిస్తానని ప్రమాణం చేస్తాను.

దిస్ సిన్ ఈజ్ డివైన్....

దిస్ అన్హోలీనెస్ ఈజె బ్లిస్...

ఈ చీకట్లు జ్వాజ్వల్యాలు..

ఏ పాపమెరుగని నంగనాచి పాపం టూటౌన్ పోలీస్ స్టేషన్ ...

నా కోసం నిరీక్షణ ముచికుందా గా పరిణమించి... నా కోసమేనా? ... నే...నే...నే "హెలో ఎక్కడా? ఎప్పుడూ?" మూర్తీభవించిన యాంత్రికత్వం నేనై...

"హైవే బరియల్ గ్రౌండ్... టుమారో మానింగ్ కొత్త ఆరైగారు.. ఆరైగారూ! డాక్టర్

"హెలో" "హెలో"

ఇట్స్ టుబి డిక్లేర్డె హోమిసైడ్... పైనించీ తాఖీదు... ఇటీజ్ ఇన్ఫ్యాక్ట్... హహ్హహా" ఎవర్నెవరు చంపుతారూ... నన్ను నేనెన్నిసార్లు హత్య చేసాను... హెలో...

"టుమారో మానింగ్... నేనిక్కడికొచ్చేస్తా సర్" ఆరై... ఆరై.. జీవితకాలం రిగరాస్ ఇంప్రిజన్మెంట్...

పాతబడిన పాపంలో వీడికెన్ని పిడికిళ్లో....?

ఆడశవం పాపం...! పాపం ఆడశవం...!

"హౌవోల్డ్ ఈస్దడెత్"? పురాతనమైన మరణానికి వయసేంటి?

"సెవెన్టీన్ డేస్ .. ఆరైగారూ రేపు ఇక్కడికేరండి కలిసెల్దాం"

పాపపు పిడికిలి తలూపింది ఆశ్లీలంగా... కదుల్తూ వెళ్లిపోయింది.

"నైట్ ఫ్రీనే కదా హహ్హాహా" మనిషంతా బొర్రలాగే అయిపోయి...

గోగోల్ ముక్కులా ఓ పిడికిలీ ఓ బొర్రా.... భలే.

"ఇంకా చీకటే పళ్లేదూ?" చీకటే చీకటి వెల్తురేఈ.. 'తన' ఇంట్లో 'తన' గుండెల్లో...

అన్నీ కుదిరేసరికి అదే చీకటౌతుంది. రమ ఒకేనా? ఇంకా చెప్పలేదు. ఒక్క ఫోన్ చాలు వచ్చేస్తుంది". హహ్హా హా గోగోల్ బుర్ర...

"సీ డ్రింక్స్ హెవిలీ... మనం నెక్రోఫీలికగా ఆడుకోవాలి" పీనగల్తో కామ కేళి...

"పొద్దున్న లేచినప్పటించి పీనుగులే కదా మీ కంపెనీ" యూటూ ఆర్ వన్ బాస్టc... మీటూ.. నిజంనిజం ఇంట్లో కూడా ఓ పీనుగుంది. కొవ్వుబస్తాల మూటల మూటల పీనుగ...

"సెల్ ఓ మాటివ్వండి"

"రమకేనా?"

"యాc హెలో రమ స్టాఫ్ ఉన్నారా? హాయ్... ఆcఆc నేనే నైట్ గెస్టాస్ కొచ్చేయ్ సెవెన్తర్టీ... ఎవ్వరూ లేరు నేనూ డాక్టర్ అంతే.. ఇట్స్ గోయింగ్ టుబీ ఆర్జీ అండ్ లాట్సాఫ్ చికెన్ ఫ్రం ఇంటర్నేషనల్... బై"

నాకు రమా వద్దు ఆర్జీ వద్దు 'తను' కావాలి... ఒరే సామాజికుడా! కోరికలకు కలలమ్ముకునేవాడా! ఇదెన్నో ట్రాన్సాక్షనూ?

అదిస్తే....యిదిస్తా.. దీనికి నాకది కావాలి....

నా నవ్వుకు నీ కన్నీళ్లిస్తావా?

నా దాహానికి నీ దేహాన్ని తవ్వనా?

నీ కలలకి నా కళ్లు అద్దెకిస్తా... ట్రాజెడీ..

ఆల్ దిసీజ్ ఎ సేక్రెడ్ ట్రాజిడీ....

ముచికుందుడితో లాలూచీకి ఓ కలబలి... రాత్రి గెస్టాస్ లో ఓ పాట చిరిగి పోయింది.... ఓ స్వప్నబిందువు చితికి పోయింది... రమ అనే శవంతో క్రీడించిన ఇద్దరు సభ్య సామాజిలొచ్చేసిం తర్వాత నరికేసిన మొద్దు... బాహ్యస్పృహ కతీతంగా.. పడగవిప్పిన కోరిక సెంట్రీ ఇంకో నెక్రోఫీలిక్...

★★★

మర్నట్రోజ...... స్మశానంలో ప్రగతిశీల మహిళలు... మరణకారణ నిర్ధారణకు మేమూ.. సియ్యో ముచికుందుడు...

"తవ్వండి.... శవాన్ని బైటికి తీయండి" హుకుం... నిజంగా మరణించి జీవించిన శవం... ఒకటి....రమ రెండు.... కొవ్వు బస్తా మూడు... 'తను' నాలుగు.. ఎన్నో ఎన్నెన్నో...

"తవ్వండి శవాన్ని జాగ్రత్తగా తీయండి"

ఎన్నో యుగాల క్రితం... దుమ్మూధూలీ పొరల నడుమ నన్ను నేను పాతిపెట్టుకున్నానే నన్నెవరు వెలికితీసి నా మరణ కారణ నిర్ధారణ చేయాలి? మనిషి...ఇంకో మనిషి... మరో మనిషి.... 'తను' ఆకాశంలో ఓ స్వేచ్ఛాకేతనం ఎగరేసి నిన్న రాత్రిర 'తన' డయిరీలో యిలా రాసుకునుంటుంది.

నేనతన్ని సరేనని నన్నడగమని నా కళ్లతో అడిగాను... అతనడిగాడు సరే నంటానకి సరేనా అని.. నా కొండ పూవు.. ముందుగా అతని చుట్టూ చేతులు వేసి సరే... నా దగ్గరికి లాక్కుంటాను.. నా వక్షోజాల పరిమళంతో ముంచి సరే అతని హృదయం వెర్రి ఆనందంతో సరే... నేననేస్తాను సరేనంటానికి సరేనని..."

*(పై చివరి వాక్యం జేమ్స్ జాయిస్ యులిసిస్ నవలలో చివరి వాక్యానికి మక్కీకి మక్కీ.... సరే.....)*

# కథామంజరి

## పది కథల సమాహారం

కథామంజరి
తెలుగు కథ విస్తృతే ధ్యేయంగా
ఐదు సంవత్సరాలుగా పనిచేస్తోంది.

ఇది లాభాపేక్ష లేని సంస్థ.
అందుకే ఇక్కడ చందా తప్పనిసరి కాదు.

మేము ఆశించేదల్లా తెలుగు కథ
చదవడం, చదివించడం.

ఈ క్రింద పొందుపరచిన రెండిటిలో మీకు
నచ్చిన మార్గము నెంచుకొని కథామంజరి
సంచికను పొందవచ్చును.

రు.200/-ల వార్షిక చందాతో
సంచికను పొందుటకు

ఉచితంగా సంచికను
పొందుటకు